అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 10-06-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 161 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల: 6.50

పార్లమెంటులో 'మీ వాణి' వినిపిస్తా : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : పార్లమెంటులో మీ గొంతుకగా నిలుస్తానని, మీ భవిష్యత్తుకు సంబంధించిన సమస్యలను లేవనెత్తుతానని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆదివారం నీట్ విద్యార్థులకు హామీ ఇచ్చారు. మెడికల్ ప్రవేశ పరీక్ష 'నీట్' వివాదంపై ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్న మోడీపై విరుచుకుపడ్డారు. నీట్ పరీక్షల్లో 'అక్రమాల'తో 24లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు సర్వనాశనమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

" ప్రధాని మోడీ ఇంకా ప్రమాణ స్వీకారం చేయలేదు. నీట్ పరీక్షలో అక్రమాలు 24 లక్షల మంది విద్యార్థులను మరియు వారి కుటుంబాలను నాశనం చేశాయి " అని ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులు పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించారని, చాలా మంది విద్యార్థులకు సాంకేతికంగా సాధ్యంకాని మార్కులు వచ్చాయని అన్నారు. అయితే ప్రభుత్వం మాత్రం పేపర్ లీక్ కాలేదని చెప్తోందని అన్నారు. విద్యా మాఫియా, ప్రభుత్వ యంత్రాంగంతో కుమ్మక్కై చేస్తున్న పేపర్ లీక్ పరిశ్రమను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పటిష్టమైన ప్రణాళికను రూపొందించిందని అన్నారు. చట్టం రూపొందించడం ద్వారా విద్యార్థులకు పేపర్ లీక్‌ల నుంచి విముక్తి కల్పిస్తామని తమ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చామని గుర్తు చేశారు.

వ్యాపారవేత్త కిడ్నాప్ కలకలం

- లావాదేవీల విషయంలో గొడవ
- నిందితుల అరెస్టు, రిమాండ్
- వివరాలు వెల్లడించిన నార్సింగి ఏసీపీ రమణగౌడ్



నవతెలంగాణ-గండిపేట్

రంగారెడ్డి జిల్లా నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో వ్యాపారవేత్త కిడ్నాప్ కలకలం సృష్టించింది. లావాదేవీల విషయంలో గొడవలు కావడంతో ఇద్దరు వ్యక్తులు వ్యాపారవేత్త శివవర్ధన్‌రెడ్డిని కిడ్నాప్ చేశారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో.. వెంటనే స్పందించిన పోలీసులు బాధితుడిని హైదరాబాద్ నుంచి కర్నూలుకు తరలిస్తుండగా సినీఫక్కీలో కిడ్నాపర్స్ వాహనాన్ని చేధించి పట్టుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన వివరాలను నార్సింగి ఏసీపీ రమణగౌడ్ ఆదివారం మీడియాకు వివరించారు. శివవర్ధన్‌రెడ్డి కర్నూల్ నుంచి వచ్చి గండిపేట మండలం హైదర్షాకోట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో కుటుంబంతో కలిసి నివాసం ఉంటూ ఇక్కడే వ్యాపారం చేస్తున్నారు. ఆర్థికంగా ఎదిగేందుకు ఇతరుల దగ్గర డబ్బులు తీసుకున్నాడు. నిందితులు క్రాంతికుమార్, కె.సందీప్.. లావాదేవీలపై శివవర్ధన్‌రెడ్డితో చర్చించారు. వారు తిరిగి డబ్బులు చెల్లించాలని అడగడంతో శివవర్ధన్‌రెడ్డి అప్పుడు.. ఇప్పుడు.. అంటూ దాటవేశాడు. దాంతో నిందితులు శివవర్ధన్‌రెడ్డిని కిడ్నాప్ చేసి కర్నూల్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బాధితుడి కుటుంబ సభ్యులు 100 కు ఫిర్యాదు చేశారు. నార్సింగి సీఐ హరికిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. శివవర్ధన్‌రెడ్డిని ఔటర్ రింగ్‌రోడ్డు మీదుగా కర్నూలు తరలించడంతో మహబూబ్‌నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సినీఫక్కీలో నిందితులను పట్టుకుని, బాధితుడిని కాపాడారు. అయితే శివవర్ధన్‌రెడ్డిపై నిందితులు దాడి చేసినట్టు కారులోని రక్తం మరకల ఆనవాళ్లను పోలీసులు గుర్తించారు. డబ్బులు వసూలు చేసేందుకే కిడ్నాప్ చేసినట్టు పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ సమావేశంలో సీఐ హరికిషన్‌రెడ్డి, ఎస్‌ఐ సతీష్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-బోథ్



అప్పుల బాధతో పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పూల్‌సింగ్ నాయక్ తండాలో ఆదివారం జరిగింది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాథోడ్ సుభాష్(45) తనకున్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో గతేడాది పత్తి సాగు చేశాడు. అతివృష్టి, అనావృష్టితో పంట దిగుబడి రాకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక కలత చెంది, ఆదివారం తన ఇంటి సమీపంలో పురుగులమందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు బోథ్ ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. అతనికి బ్యాంకులో రూ.1.5లక్షలు, ప్రయివేటుగా రూ.1.5లక్షలు మొత్తం రూ.3లక్షలు అప్పు ఉన్నట్టు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రాము తెలిపారు.

వ్యవసాయ నేలల ఆరోగ్యం ఆందోళనకరం

తాగేనీరు, ఆహారభద్రత, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

- వర్షాభావ పరిస్థితులే పంటల ఉత్పత్తిని దెబ్బతీస్తున్నాయి
- వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయ నిర్మాణం జరగాలి
- అరిబండి ఆరవ స్మారకోపన్యాసంలో నార్మ్ డైరెక్టర్ శ్రీనివాసరావు
- వ్యవసాయ ప్రణాళిక తరహాలో నీటి ప్రణాళిక ఉండాలి : రాజిరెడ్డి
- అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలి: టి సాగర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వాతావరణ మార్పులు సమాజంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని జాతీయ వ్యవసాయ పరిశోధనల యాజమాన్య అకాడమీ(నార్మ్) డైరెక్టర్ డాక్టర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం వ్యక్తం చేశారు. వ్యవసాయ నేలల ఆరోగ్యం దెబ్బతింటున్నదని తెలిపారు. తద్వారా త్రాగే నీరు, ఆహారభద్రత, ఆరోగ్యంపై ప్రభావం పడుతున్నదని చెప్పారు. వర్షాభావ పరిస్థితులు పంటల ఉత్పత్తి కూడా ఒడిదుకులను ఎదుర్కొంటున్నదన్నారు. వాతావరణ మార్పులను తట్టుకునే విధంగా వ్యవసాయ నిర్మాణాన్ని చేపట్టాల్సిన అవసరముందని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వాటర్ టెక్నాలజీ సెంటర్‌లో అరిబండి ఫౌండేషన్, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో 'వాతావరణ మార్పులను తట్టుకోగల వ్యవసాయ నిర్మాణం' అనే అంశంపై శ్రీనివాసరావు అరిబండి ఆరవ స్మారకోపన్యాసం చేశారు.

ఈ కార్యక్రమానికి తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాదరావు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పులు సుస్థిర వ్యవసాయానికి పెద్ద సవాల్‌గా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాభావ పరిస్థితులు, వరదలు పంటలను దెబ్బతీస్తున్నాయన్నారు. నీరు, ఇందనం,ఆహారం జీవ వైవిద్యం తగ్గిపోతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో వాతావరణ మార్పుల రిస్క్ పెరుగుతున్నదని హెచ్చరించారు. ఈ మార్పులను ఎదుర్కొగల వ్యవసాయానికి మద్దతు పెరగాల్సిన అవసరముందన్నారు. వాతావరణ మార్పులకు కారణమైన హరిత వాయువుల ఉద్గారాలను తగ్గించాలన్నారు. ఆకలి, పేదరిక సమస్యలను పరిష్కరించేందుకు జీవ వైవిధ్యాన్ని పునరుద్ధరించాల్సిన ఆవశ్యకతను ప్రతీ ఒక్కరూ గుర్తించాలన్నారు. లేకపోతే ఆర్థిక మాంద్యం, ఆహార భద్రత, పోషకాహార లోపాలు, యుద్ధాలు తలెత్తుతాయని చెప్పారు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు పంటలు, పశువులు, అడవులు, మత్స్య సంపద, పౌల్ట్రీ ఇలా రకరాల సమగ్ర వ్యవసాయ విధానం అమల్లోకి రావాలన్నారు. సాంకేతికతో వాతావరణంలో మార్పులు తెలుసుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు పంటల బీమా పథకం, మార్కెటింగ్ రక్షణ వంటి చర్యలు చేపట్టాలని సూచించారు.

రైతులు అవసరానికి మించి యూరియా, డీఏపీ ఉపయోగించడం సరైందికాదన్నారు. మొక్కలకు ఎంత అవసరమో అంతే తీసుకుంటాయి తప్ప ఎక్కువగా తీసుకోవని గుర్తించాలన్నారు. పంట పొలాల్లో వ్యర్థ అవశేషాలను కాల్చివేయడంతో వాతావరణ కాలుష్యం పెరుగుతున్నదని తెలిపారు. ఇలా చేయడం ద్వారా నేల చనిపోయినట్టేనని ప్రముఖ వ్యవసాయ నిపుణులు స్వామినాథన్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. చెరువులో చేరిన మట్టిని పంట పొలాల్లో పోయడం ద్వారా ఎరువుల వాడకం తగ్గుతుందన్నారు. రానున్న రోజుల్లో వ్యవసాయం ఒక్కరూగా చేయలేరనీ, సంఘటితంగా చేయాల్సి ఉంటుందని గుర్తు చేశారు. రాజస్థాన్‌లో నీటి కరువు ఉన్నప్పటికీ రైతుల ఆత్మహత్యలు ఉండవన్నారు. ఎక్కువగా పశుసంపదపై ఆధారపడి జీవిస్తారని తెలిపారు. వ్యవసాయంపై పిల్లల్లో ఆసక్తి కల్పించాల్సి బాధ్యత తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ విస్తరణ మాజీ డైరెక్టర్ డి.రాజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ ప్రణాళిక తరహాలో నీటి ప్రణాళిక కూడా రూపొందించాలని సూచించారు. వరి, పత్తిని 90 శాతానికి విస్తరించి, ప్రమాదకర జోన్‌లో ఉన్నామని చెప్పారు. పత్తిలో సోయా, కంది వంటి అంతర పంటల సాగు చేసి రైతులు రిస్క్ తగ్గించుకోవాలని తెలిపారు. ఈసారి 4.7లక్షల ఎకరాల్లో చిరుధాన్యాలు సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం శుభ పరిణామమన్నారు. పరిశోధనలు, సాంకేతిక విశ్వవిద్యాలయాలకు పరిమితం కాకుండా పొలాల్లోకి తీసుకెళ్లాలన్నారు. వరి సాగు ఎంత అవసరమో అంతే సాగుచేయాలన్నారు. ఆర్గానిక్ వ్యవసాయం అన్ని ప్రాంతాల్లో చేయకుండా ఉద్దేశపూర్వకంగా వ్యవసాయ ప్రాంతాల్లో చేయాలని సూచించారు.

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ మాట్లాడుతూ సన్న రకానికే కాకుండా కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీమేరకు ఏడు పంటలకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పంటల ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కోరారు. ఎన్నికలకు ముందు కౌలు రైతులకు ఇస్తామన్న రైతు భరోసా ఇవ్వాలన్నారు. పంటల బీమాలోని లోపాలను సవరించి, ఆ బీమాప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. రైతు బీమా వయస్సును 70 ఏండ్లకు పెంచాలని కోరారు. పోడు వ్యవసాయానికి హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత మూడు నెలలుగా విజయ డైరీ రైతులు బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పాలరైతులకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. డాక్టర్ కె కిరణ్‌బాబు డిజిటల్ వ్యవసాయ ప్రాధాన్యతపై వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, జంగారెడ్డి మాట్లాడారు. సహయ కార్యదర్శి మూడ్ శోభన్ అతిథులను వేదిక పైకి ఆహ్వానించారు. అరిబండి ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ మనోహర్, కోశాధికారి డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ లావణ్య, ఐఏఎస్ అధికారి వేణుప్రసాద్, పివి అమరనాథ్ ప్రసాద్, డాక్టర్ ఏ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రజల్లో రాజకీయ చర్చలు శుభపరిణామం


ఎస్వీకే వెబినార్‌లో ప్రొఫెసర్ హరగోపాల్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



సాధారణ ప్రజల్లో రాజకీయ చర్చలు జరగడం శుభపరిణామం అని పౌరహక్కుల సంఘం నాయకులు ప్రొఫెసర్ జీ హరగోపాల్ అభిప్రాయపడ్డారు. ఇలాంటి చర్చలు సమాజ పరిణామక్రమాన్ని నిర్దేశిస్తాయనీ, ప్రతిపక్షాలు తప్పనిసరిగా వారితో కలిసి నడవాల్సిన పరిస్థితుల్ని కల్పిస్తాయన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్వీకే) అధ్వర్యంలో ఆదివారం 'పౌరహక్కులు-ప్రతిపక్షాల కర్తవ్యం' అంశంపై జరిగిన వెబినార్‌లో ఆయన మాట్లాడారు. సామాజిక సంబంధాల్లో సమానత్వం, ధరల పెరుగుదల సహా ఆర్థిక నమూనాలోని అంశాలపై సమగ్ర అవగాహన ఉండాలని చెప్పారు. భారత రాజ్యాంగాన్ని ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్నారనీ, ఇది పాశ్చాత్య రాజ్యాంగమని సావర్కర్ హయాం నుంచీ బీజేపీ నేతలు నమ్ముతున్నారని వివరించారు. రాజ్యాంగాన్ని మారిస్తే అసమానతలు పెరిగి, సమానత్వ భావన కోల్పోతామనే భావన ప్రస్తుత ఎన్నికల ఫలితాల ద్వారా ప్రజల్లో వెల్లడి అయ్యిందన్నారు. ఈ ప్రభావం ప్రాంతీయ అస్థిత్వాలపైనా పడిందనీ, భవిష్యత్‌లో బీజేపీ ఆర్థిక అభివృద్ధి నమూనా ఇలాగే కొనసాగితే, ప్రతిపక్షపార్టీలు పార్లమెంటులో అర్థవంతమైన చర్చను లేవనెత్తే అవకాశం ఉందని తెలిపారు. అసమానతలపై అసంతృప్తి పెరిగినందున, దాని అణచివేత కోసం 'ఉపా' చట్టం తెచ్చారని చెప్పారు. నెహ్రూ మోడల్‌ను కాంగ్రెస్ వదిలేసిందనీ, బీజేపీ నెహ్రూనే తోసేయడంతో ఆర్థిక నమూనాలు భిన్నంగా మారాయని విశ్లేషించారు. ఉత్పత్తి రంగంలో ఉన్న టాటా, బిర్లాలు దేశ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని తమ పెట్టుబడుల్లో 40 శాతాన్ని విద్యారంగంపై పెట్టుబడి పెట్టారనీ, కానీ బీజేపీ విధానాలతో అదానీ, అంబానీలు ఒక్క వస్తువును కూడా ఉత్పత్తిచేయకుండా, సంపదను పోగేసుకుంటున్నారని అన్నారు. ప్రస్తుతం దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉందనీ, అయితే పార్లమెంటులో పటిష్టమైన ప్రతిపక్షం ఇప్పుడు ఉన్నందున బీజేపీ ఏకపక్ష నిర్ణయాలు చెల్లవని చెప్పారు. కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో రాజ్యాంగ పరిరక్షణను అజెండాగా పెట్టుకోవడంతో, బీజేపీ కూడ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని చెప్పక తప్పలేదన్నారు. ప్రస్తుతం మీడియా కార్పొరేట్ చేతుల్లో ఉందనీ, ఫలితంగా పాలకవర్గాలు ఆ శక్తుల్ని కాదని నియో లిబరల్ మోడల్‌ను వదులుకొనే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబు, నితీష్‌కుమార్‌ల భావజాలాలు భిన్నమైనవనీ, కాంగ్రెస్‌పార్టీతో చేరిన పలు పార్టీల్లోనూ భిన్న భావజాలాలు ఉన్నాయని వివరించారు. ప్రతిపక్షపార్టీలు అధికారపక్షాన్ని గాడిన పెట్టే ప్రయత్నం చేయాలన్నారు. అన్ని రాజకీయపార్టీలు సిద్ధాంత, విధానపరమైన అమలు సమస్యను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అధికారంలో ఉండే పార్టీలకు ప్రజలే ప్రతిపక్షంగా ఉంటారంటూ, ఢిల్లీ రైతాంగ పోరాటం, ప్రజా ఉద్యమాల ప్రాధాన్యతను వెల్లడించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతిపక్షాలపై బాధ్యత మరింత పెరిగిందనీ, పౌరసమాజం, ప్రజాసంఘాల మద్దతుతో ముందుకు నడిస్తే, అధికారపక్షం ఆచితూచి నిర్ణయాలు తీసుకుటుందని విశ్లేషించారు. ప్రస్తుత ఎన్నికల ఫలితాలతో ఫాసిజానికి తాత్కాలికంగా బ్రేక్ పడిందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ఓటమికి కూడా పెత్తందారీ పోకడలే కారణమనీ, మోడీ కూడా ప్రజల్ని కలవకుండా, దాదాపు అదే దారిలో నడిచినందువల్లే సీట్లు తగ్గాయని చెప్పారు. రాజ్యహింసను తగ్గించి, మానవీయ, సామాజిక దృక్పథంతో దేశ పురోగమనం ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి ఎస్వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ అధ్యక్షత వహించారు.

రాజస్థాన్‌లో అర్ధరాత్రి భూకంపం..



జైపూర్: రాజస్థాన్‌లో అర్ధరాత్రి భూమి కంపించింది. శనివారం అర్ధరాత్రి 11.47 గంటలకు సికార్, చురు, నాగౌర్ జిల్లాల్లో కొన్ని సెకన్లపాటు భూకంపం వచ్చింది. దీని తీవ్రత రిక్టర్‌స్కేలుపై 4.2గా నమోదయింది. సికార్ జిల్లాలోని హర్ష పర్వత వద్ద భూకంప కేంద్రం ఉన్నదని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. భూ అంతర్భాగంలో 5 కిలోమీటర్ల లోతులు కదలికలు సంభవించాయని వెల్లడించింది. అర్ధరాత్రి వేళ భూమి కంపించడంతో భయాందోళనలకు గురైన ప్రజలు ఇండ్ల నుంచి బయటకు పరుగుతు తీశారు. కాగా, భూకంపం వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగలేదు.

తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్ పర్సన్‌గా

జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్‌గా జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సభ్యులుగా ప్రదీప్ కుమార్ రెడ్డి పల్లె (అడ్వకేట్, జ్యుడీషియల్ మెంబర్), రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిత్రా రామచంద్రన్ (టెక్నికల్, అడ్మినిస్ట్రేటివ్ మెంబర్) కూడా ఆయనతో పాటు బాధ్యతలు చేపట్టారు. చైర్‌పర్సన్, సభ్యుల నియామకానికి ప్రభుత్వం ఈ నెల 7న వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. బాధ్యతల స్వీకరణ సందర్భంగా రెరా అథారిటీ చైర్మెన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ, సభ్యులు కె.శ్రీనివాసరావు, జె.లక్ష్మినారాయణ చైర్మెన్, సభ్యులకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ట్రిబ్యూనల్ చైర్‌పర్సన్, సభ్యులతో పాటు రెరా అథారిటీ చైర్మెన్, సభ్యులు సమావేశమై చర్చించారు. కార్యక్రమంలో రెరా అడ్జుడికేటింగ్ ఆఫీసర్ లతీఫ్ ఉర్ రెహమాన్, రెరా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, పరిపాలనాధికారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో శ్రీచైతన్యకు టాప్ ర్యాంక్‌లు



నవ తెలంగాణ - హైదరాబాద్

ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో తమ విద్యార్థులకు ఆల్ ఇండియా స్థాయిలో అగ్ర ర్యాంక్‌లు దక్కాయని శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో ఓపెన్ కేటగిరిలో తమ విద్యార్థులు 10లోపు 5 ర్యాంకులు సాధించారన్నారు. ఒక్కటవ ర్యాంక్‌తో పాటు ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 4,5,6,9,10,12,14 ర్యాంకులతో శ్రీచైతన్య ఆధిపత్యాన్ని కొనసాగించిందన్నారు. ఆలిండియా స్థాయిలో రాఘవ శర్మ 1వ ర్యాంక్, రిథమ్ కేడియా 4వ ర్యాంక్, పుట్టి కుశాల్ కుమార్ 5వ ర్యాంక్, రాజదీప్ మిశ్రా 6వ ర్యాంక్, ధ్రువిన్ హేమంత్ దోషి 9వ ర్యాంక్, సిద్విక్ సుహాస్ 10వ ర్యాంక్‌ల్లో నిలిచారని వెల్లడించారు. 100లోపు 30 ర్యాంక్‌లు, 1000 లోపు 202 ర్యాంక్‌లు, వివిధ కేటగిరీల్లో 100 లోఎపు ఏకంగా 146, 1000 లోపు 721 ర్యాంక్‌లు సాధించామన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 3,728 మంది శ్రీచైతన్య విదార్థులు అర్హత సాధించారని తెలిపారు. ఈ దఫా ఐఐటీల్లో తొలి వరుసతో పాటు మొత్తం సీట్లలోనూ అత్యధిక శాతం శ్రీచైతన్యదేనని తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి సుష్మ అభినందనలు తెలిపారు.

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యం

ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌కు తెలంగాణ ప్రజలు పదేండ్ల తర్వాత అధికారం ఇచ్చారని, ఆరు గ్యారంటీలపై ప్రజలు పెట్టుకున్న ఆశలు నెరవేర్చడమే తమ లక్ష్యమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. భువనగిరి నియోజకవర్గంలో ప్రధానంగా విద్య, ఉపాధి, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడమే తన టార్గెట్ అని తెలిపారు. త్వరలోనే పార్లమెంటు పరిధిలో ఉన్న ప్రజలందరినీ కలుసుకుంటానని అన్నారు. పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన తర్వాత 'నవతెలంగాణ'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలను వివరించారు.

- పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేస్తా
- ప్రభుత్వ స్కూళ్లకు పక్కాభవనాలు నిర్మిస్తా
- మండలానికో జూనియర్ కాలేజీ, నియోజకవర్గానికో డిగ్రీ కాలేజీ..
- భువనగిరిలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి : భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-ఆలేరు



భువనగిరి ఎంపీగా గెలిచినందుకు అభినందనలు. మీ విజయానికి దోహదం చేసిన ప్రధాన అంశాలేంటి..?

కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానాలైన ఆరు గ్యారంటీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే కొన్ని గ్యారంటీలను అమల్లోకి తీసుకొచ్చింది. వాటిని పూర్తిగా అమలు చేస్తామన్న నమ్మకం వల్లే భువనగిరి ఎంపీగా ఇక్కడి ప్రజలు నన్ను గెలిపించారు. నన్ను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు. నా విజయానికి కృషి చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్ రెడ్డికి రుణపడి ఉంటాను.

ఎంపీగా మీ లక్ష్యం ఏమిటి?

ఇక్కడి ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే నా లక్ష్యం. ప్రధానంగా మూడు పనులు చేయడమే నా టార్గెట్. నా నియోజకవర్గం హైదరాబాద్‌కు 50 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నప్పటికీ.. ఇక్కడ మెజారిటీ ప్రజలు రైతులే. వాళ్ళను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 5 పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడమే నా తొలి లక్ష్యంగా పెట్టుకున్నాను. పదేండ్లలో కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి పెట్టిన కేసీఆర్ సర్కారు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా వదిలేసింది. మా నియోజకవర్గంలో గంధమల్ల రిజర్వాయర్‌ను, మూసీ నదిపై పెండింగ్‌లో ఉన్న బునాదిగానికాలువ, ఇతర ప్రాజెక్టులను పూర్తి చేసి సాగు విస్తీర్ణాన్ని పెంచుతాను.

విద్యా రంగంపై మీ ప్రణాళిక ఏమిటి..?

నియోజక వర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీ భవనాలన్నింటినీ పూర్తి చేస్తాను. ప్రతి మండలంలో ఒక జూనియర్ కాలేజీ, ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో ఒక డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాను. చదువు కోసం హైదరాబాద్ వెళ్లేందుకు విద్యార్థులు పడుతున్న కష్టాలు తీరుస్తాను.

ఉపాధి అవకాశాలపై మీ ప్రణాళిక ఏమిటి..?

డిగ్రీ, ఇంజనీరింగ్ చదివి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న ఇక్కడి యువతకు వస్తున్న వేతనం.. వాళ్ల వసతి, భోజనానికి కూడా సరిపోవడం లేదు. ఇంట్లో వాళ్ళే నెలకు రూ.10 వేలు పంపించే పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ఉద్యోగం వదిలేసి ఇంటికి వచ్చేయాలని పిల్లలను తల్లిదండ్రులు ఒత్తిడికి గురుచేస్తున్నారు. వాళ్ల కష్టాలు తీర్చేందుకు నా నియోజక వర్గంలో పరిశ్రమలు నెలకొల్పుతాను.

ఎంపీగా మీరు తొలిసారి గెలిచారు. మీ అనుభూతి ఎలా ఉంది..?

నేను మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చాను. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లో జాతీయ స్థాయిలో పనిచేశాను. భువనగిరి ప్రజలు నన్ను తొలిసారి పార్లమెంట్‌కు పంపించారు. నాకు గెలిచిన సంతోషం ఒక్కరోజే ఉంది. వెంటనే నా బాధ్యత గుర్తుకొచ్చింది. ప్రజల ఆలోచనలు, అవసరాలు నాకు తెలుసు. నేను నిద్రలేవక ముందే ప్రజలు నా ఇంటి వద్దకు వచ్చి ఉంటారు. గెలిచిన తర్వాత నేను ఫోన్ లిఫ్ట్ చేయకుంటే ప్రజలు నన్ను నమ్మరు. అందుకే ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాను.

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 10-06-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

పార్లమెంట్‌లో రైతుల గొంతుక

ఎంపీ అమ్రారామ్‌కు ఏఐకేఎస్ అభినందన

- బీజేపీ అడ్డాలో సీపీఐ(ఎం) గెలుపుపై హర్షం
- హాజరైన సీతారాం ఏచూరి, బృందా కరత్



వివరాలు 11లో

సంపుటి : 10 సంచిక : 111 Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar 12 పేజీలు వెల : 6.50

కొలువుదీరిన క్యాబినెట్

మోడీ సహా 72 మంది ప్రమాణ స్వీకారం

- తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురు
- 30 మందికి క్యాబినెట్ హోదా
- స్వతంత్ర హోదాలో ఐదుగురు సహాయ మంత్రులు

న్యూఢిల్లీ : భారత ప్రధానిగా నరేంద్ర మోడీ మూడోసారి ప్రమాణస్వీకారం చేశారు. దీంతో జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత మూడుసార్లు ప్రధాని పదవిని చేపట్టిన నేతగా మోడీ రికార్డు సృష్టించారు. రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం తెలుగు రాష్ట్రాలకు చెందిన కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ (తెలుగుదేశం), శ్రీనివాస వర్మ బండి సంజయ్ కుమార్, కిషన్ రెడ్డి (బీజేపీ) సహా 71 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురికి, తెలంగాణకు చెందిన ఇద్దరికి క్యాబినెట్‌లో చోటు లభించింది.




మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన వారిలో రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, జేడీ నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్, నిర్మలా సీతారామన్, జైశంకర్, మనోహర్ లాల్ ఖట్టర్, హెచ్‌డీ కుమారస్వామి, పీయుష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, జతిన్ రామ్ మాంఝీ, లలన్ సింగ్, సర్బానంద సోనోవాల్, డాక్టర్ వీరేంద్ర కుమార్, ప్రహ్లద్ జోషీ, జుయల్ ఓరం, గిరిరాజ్ సింగ్, అశ్వనీ వైష్ణవ్, జ్యోతిరాదిత్య సింధియా, భూపేంద్ర యాదవ్, గజేంద్ర సింగ్ షెకావత్, అన్నపూర్ణ దేవి, కిరణ్ రిజిజు, హర్దీప్ సింగ్ పూరి, మనుసుఖ్ మాండవియా, చిరాగ్ పాశ్వాన్, సీఆర్ పాటిల్, రావు ఇంద్రజిత్ సింగ్, డాక్టర్ జితేంద్ర సింగ్, అర్జున్ రామ్ మేఘ్‌వాల్, ప్రతాప్ రావ్ జాదవ్, జయంత్ చౌదరి, జితిన్ ప్రసాద్, షరిపడ్ నాయక్, పంకజ్ చౌదరి, కిషన్ పాల్, రామ్‌దాస్ అథావలే, రామ్‌నాథ్ ఠాకూర్, నిత్యానంద్ రాయ్, శ్రీమతి అనుప్రియా పటేల్, వి. సోమన్న, ప్రొఫెసర్ బఘేల్, శోభా కరంద్లాజె, కీర్తి వర్ధన్ సింగ్, బీఎల్ వర్మ, శాంతను ఠాకూర్, సురేష్ గోపి, డాక్టర్ ఎల్ మురుగన్, అజయ్ తమ్టా, కమలేష్ పాశ్వాన్, భగీరథ్ చౌదరి, సతీష్ చంద్ర దూబే, సంజయ్ సేథ్, రవనీత్ సింగ్, దుర్గాదాస్, శ్రీమతి సుకంత మజుందార్ తదితరులు ఉన్నారు.

మోడీ క్యాబినెట్‌లో బీజేపీకి చెందిన 61 మందికి చోటు దక్కింది. మిత్రపక్షాల నుండి 11 మంది క్యాబినెట్‌లో చేరారు. టీడీపీ, జేడీయూ, శివసేన పార్టీలకు రెండేసి మంత్రి పదవులు లభించగా మిగిలిన మిత్రపక్షాలకు ఒక్కో పదవి లభించింది. క్యాబినెట్‌లో 27 మంది ఓబీసీలు, 10 మంది ఎస్సీలు, ఐదుగురు ఎస్టీలు, ఐదుగురు మైనారిటీలు ఉన్నారు. క్యాబినెట్‌లో చేరిన 43 మందికి మూడుసార్లు మంత్రులుగా పనిచేసిన అనుభవం, 23 మందికి రాష్ట్రాల్లో మంత్రులుగా పనిచేసిన అనుభవం ఉంది. 30 మందికి క్యాబినెట్ హోదా లభించగా ...11లో

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ	- యూపీ
క్యాబినెట్ మంత్రులు	
రాజ్ నాథ్ సింగ్	- యూపీ
అమిత్ షా	- గుజరాత్
నితిన్ గడ్కరీ	- మహారాష్ట్ర
జెపి నడ్డా	- రాజ్యసభ
శివరాజ్ సింగ్ చౌహాన్	- మధ్యప్రదేశ్ (మాజీ సీఎం)
నిర్మలా సీతారామన్	- రాజ్యసభ
జయశంకర్ సుబ్రమణ్యం	- రాజ్యసభ
మనోహర్ లాల్	- హర్యానా (మాజీ సీఎం)
హెచ్ డి కుమార స్వామి	- కర్నాటక (జేడీయస్)
పియూష్ గోయల్	- మహారాష్ట్ర
ధర్మేంద్ర ప్రధాన్	- ఒడిశా
జితిన్ రామ్ మాంఝీ	- బీహార్ (హెచ్ఏఎం)
లలన్ సింగ్	- బీహార్ (జేడీయూ)
సర్బానంద్ సోనేవాల్	- అసోం(మాజీ సీఎం)
వీరేంద్ర కుమార్	- మధ్యప్రదేశ్
కింజరపు రామ్మోహన్ నాయుడు	- ఏపీ (టీడీపీ)
ప్రహ్లాద్ జోషి	- కర్నాటక
జోయల్ ఓరాం	- ఒడిశా
గిరిరాజ్ సింగ్	- బీహార్
అశ్వినీ వైష్ణవ్	- ఒడిశా
జ్యోతిరాదిత్య సింధియా	- మధ్యప్రదేశ్
భూపేంద్ర యాదవ్	- రాజస్థాన్
గజేంద్ర సింగ్ షెకావత్	- రాజస్థాన్
అన్నపూర్ణ దేవి	- జార్ఖండ్
కిరణ్ రిజిజు	- అరుణాచల్ ప్రదేశ్
హర్దీప్ సింగ్ పురి	- రాజ్యసభ
మన్సుక్ మండవియ	- గుజరాత్
జి. కిషన్ రెడ్డి	- తెలంగాణ
చిరాగ్ పాశ్వాన్	- బీహార్ (ఎల్‌జేపీ)
సిఆర్ పాటిల్	- గుజరాత్

సహాయ మంత్రులు


ఇంద్రజీత్ సింగ్ – హర్యానా, జితేందర్ సింగ్ – రాజస్థాన్ అర్జున్ రాం మేఘావల్ – రాజస్థాన్, ప్రతాప్ రావ్ గణపతి రావ్ యాదవ్ – మహారాష్ట్ర (శివసేన షిండే, మిత్రపక్షం) జయంత్ చౌదరి – రాజ్యసభ (రాష్ట్రీయ్ లోక్ దళ్, మిత్రపక్షం) జితెన్ ప్రసాద్ – యూపీ, శ్రీపాద్ యసో నాయక్ – గోవా ...10లో




ఇక సెలవ్...

- అధికారలాంఛనాలతో ముగిసిన రామోజీరావు అంత్యక్రియలు
- పాడెమోసిన చంద్రబాబు
- అంతిమయాత్రలో పాల్గొన్న సినీ, రాజకీయ ప్రముఖులు





నవతెలంగాణ–హైదరాబాద్ బ్యూరో

రామోజీ గ్రూపు సంస్థల చైర్మెన్ రామోజీరావు అంత్యక్రియలు ఆదివారం ముగిశాయి. తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో పూర్తిచేశారు. గౌరవ సూచకంగా పోలీసులు గాల్లోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో రామోజీ స్వయంగా నిర్మాణం ...11లో



నెలరోజులు... వరుస సమీక్షలు

జోడెద్దులుగా అభివృద్ధి-సంక్షేమం

- అధికారుల బదిలీలకు తొలి ప్రాధాన్యత
- పాలన పరుగులుతీయాలి
- సీఎం, డిప్యూటీ సీఎంల ఆకాంక్ష
- ప్రణాళికలు సిద్ధం చేసిన రేవంత్ సర్కార్

నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

నెలరోజులు...వరుసగా అన్ని ప్రభుత్వ శాఖలపైనా సమీక్షలు. ఏ జిల్లాకు ఆ జిల్లాలోనే సమీక్షలు. జిల్లా మంత్రుల అధ్యక్షతన అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి వరుస సమావేశాల నిర్వహణ. అభివృద్ధి–సంక్షేమం జోడెద్దుల బండిలా పరుగులు తీయాలి. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నిర్ణయించారు. దానిలో ...11లో

ధాన్యం కొనుగోళ్లలో రికార్డు

రూ.10,355.18 కోట్ల చెల్లింపులు

- మూడు రోజుల్లోనే రైతుల ఖాతాలకు..



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త రికార్డు నెలకొల్పింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు మూడు రోజుల్లోనే డబ్బులు చెల్లించింది. ఇప్పటివరకు 8,35,109 మంది రైతులకు రూ.10,355.18 కోట్లు చెల్లింపులు చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ముందుగా ప్రారంభించింది. గతంలో ఏప్రిల్‌లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యేవి. ఈసారి దాదాపు రెండు వారాలు ముందుగా మార్చి 25వ తేదీ నుంచే కొనుగోళ్ల ప్రారంభమయ్యాయి. రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర వ్యాప్తంగా ఈసారి 7,178 కేంద్రాలను తెరిచింది. వీటిలో 6,345 కేంద్రాల్లో కొనుగోళ్ల జరిగాయి. ఈ నెల 7 వరకు రాష్ట్రవ్యాప్తంగా 47.07 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల జరిగాయి. చాలాచోట్ల ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయిందనీ, మరో పది రోజుల పాటు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చే అవకాశముందని సివిల్ సప్లయిస్ విభాగం అంచనా వేస్తోంది. ఆలస్యంగా పంటలు వేసిన రైతులకు ఇబ్బంది తలెత్తకుండా.. ఈ నెలాఖరు వరకు అవసరమైన చోట్ల కేంద్రాలు తెరిచి ఉంచాలని అన్ని జిల్లాలకు ఆదేశాలు జారీ చేసింది.

ఈ ఏడాది దాదాపు 75.40 లక్షల మెట్రిక్ టన్నుల వడ్ల కొనుగోళ్ల జరుగుతాయని సివిల్ సప్లయిస్ విభాగం మొదట్లో అంచనా వేసింది. కానీ మార్కెట్లో మద్దతు ధర కంటే ఎక్కువ రేటు రావటం, ప్రయివేటు వ్యాపారులు పోటీ పడి మంచి ధరకు కొనుగోలు చేయటంతో కేంద్రాలకు వచ్చే ధాన్యం అంచనా తగ్గింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఈసారి సివిల్ సప్లయిస్ విభాగం పక్కాగా ఏర్పాట్లు ...11లో

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు వెల్లడి

ఢిల్లీ జోన్‌కు చెందిన వేద్ లహోతికి టాప్ ర్యాంక్



న్యూఢిల్లీ: జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (జేఈఈ) 2024 ఫలితాలును ఆదివారం ప్రకటించారు. ఈ పరీక్షకు 1.8 లక్షల మంది అభ్యర్థులు హాజరుకాగా, వీరిలో 48,248 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత సాధించిన వారిలో మహిళా అభ్యర్థులు 7,964 మంది, వికలాంగులు 594 మంది ...10లో

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్షలు

దరఖాస్తు చేసుకున్న వారు 4.03 లక్షల మంది

- హాజరైన అభ్యర్థులు 3.02 లక్షలు
- త్వరలో కమిషన్ వెబ్‌సైట్లో ప్రిలిమ్స్ కీ
- షెడ్యూల్ ప్రకారమే అక్టోబర్ 21న మెయిన్స్
- వివరాలు వెల్లడించిన టీజీపీఎస్సీ
- నిమిషం ఆలస్యం నిబంధన నిక్కచ్చిగా అమలు
- పలు చోట్ల నిరాశతో వెనుదిరిగిన అభ్యర్థులు

వివరాలు 10లో

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

ఆరుగురు మావోయిస్టులు మృతి

- పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీకి చెందినవారిగా గుర్తింపు



ఛత్తీస్‌గఢ్ : ఛత్తీస్‌గఢ్‌లో మరోమారు భద్రతా బలగాల కాల్పుల మోతలు వినిపించాయి. ఆరుగురు మావోయిస్టులు హతమయ్యారు. ఈ ఎన్‌కౌంటర్ నారాయణ్‌పూర్ జిల్లాలోని ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధిలోని గోబెల్, తుల్తులి గ్రామాల సమీపంలో శుక్రవారం జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో మొదట ఏడుగురిని చంపినట్టుగా ప్రకటించి, తర్వాత ఆరుగురేనని పోలీసులు వెల్లడించారు. వారిలో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు. వారంతా తూర్పు బస్తర్ ఫార్మేషన్‌కు చెందిన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్)కు చెందినవారిగా గుర్తించారు. మావోయిస్టుల ఉనికిపై ...11లో

బడి ఊడ్చేదెవరు..?

- బడులకు రంగులు, మరమ్మతులు సరే.. పరిశుభ్రత మాటేమిటి!
- అపరిశుభ్రమైన గదులు, టాయిలెట్ల నడుమ చదువులేలా..
- ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

స్కావెంజర్ల వ్యవస్థ రద్దుతో స్కూళ్లలో పారిశుధ్యం ప్రశ్నార్థకం

నవతెలంగాణ–సిటీబ్యూరో

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో సర్కారు బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కొత్త ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం కోట్ల రూపాయలు కేటాయించింది. విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలలకు రంగులు వేస్తూ అందంగా తీర్చిదిద్దుతున్నారు. టాయిలెట్ల రిపేరింగ్, అదనపు టాయిలెట్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ సరిచేయడంతో పాటు ఎలక్ట్రికల్ పనులు చకచకా జరిగిపోతున్నాయి. ఈ నెల 12లోపు పాఠశాలలను అందంగా తీర్చిదిద్ది విద్యార్థులకు మంచి వాతావరణంలో స్వాగతం పలికేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ప్రారంభ అనంతరం పరిశుభ్రత గురించి ప్రభుత్వం ఆలోచించింది లేదు. తరగతి గదుల శుభ్రత, మొక్కలకు నీళ్లు, ప్రాంగణాల పరిశుభ్రత, మరీ ముఖ్యంగా టాయిలెట్స్ క్లీనింగ్ పనులు స్కావెంజర్లకు బదులు జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీలు, పంచాయతీలకు



రెండేండ్ల క్రితం గత ప్రభుత్వం అప్పగించడంతో పనులు సరిగ్గా జరగడం లేదు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్యం, శానిటేషన్ ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పుడీ సమస్య విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. విద్యాసంవత్సరం ప్రారంభంలోపే స్కావెంజర్ల వ్యవస్థ పునరుద్ధరణపై ఒక నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ఉపాధ్యాయ సంఘాల భేటీలో ...11లో



పూరణ



యుద్ధ ట్యాంకులు ఎదురొచ్చినప్పుడే
సముద్రం బిక్కచచ్చిపోయింది
అలలపై విరుచుకుపడినప్పుడే
కలలు కందిపోయాయి
ఇక, పగలైనా రాత్రయినా–
కమ్ముకునేది చీకటేనని అప్పుడే తెలిసిపోయింది
చెట్ల మీద గూళ్లలో గుడ్లు ఎదురుచూస్తున్నప్పుడే
పొదగాల్సిన పక్షులు తూటాల మధ్య
కలవరపడినట్టు కబురొచ్చింది
పురిటి నెప్పులేవీ బాంబు పేలుళ్ల నడుమ వినబడలేదు
పాలసీసాలు పగిలిపోయిన ఆ క్షణమే
పాలస్తీనా అమ్మతనం నేలపాలైంది
తొమ్మిది నెలల కలల స్తన్యం పొలమారింది.
విరిగిపోయిన ఇంద్ర ధనస్సు
శిథిలాల మధ్య చెదిరిపడింది
దాన్లో తమ ముఖాలను పోల్చుకోలేక
పిల్లలు గుక్కపెట్టారు
గుట్టలుగా పోగుపడుతున్న శవాల మధ్య
కొన ఊపిర్లు మనుషుల బుక్‌మార్క్ లవుతున్నాయి
ఆరడుగులుండే దేహానికి
ఆరించులైనా లేని నోటితో..
నినాదాన్ని పూరించలేని తల్లిదండ్రులు
దుఃఖాన్ని తమ పాడె మీదకే ఎత్తుకుంటున్నారు
గళ్ల నుడికట్టులో పూడ్చేయగా మిగిలిన ఖాళీలను
ఇప్పుడిక ఎవరి ఆత్మలతో పూరిస్తావురా?
పిల్లలా? తల్లులా? తండ్రులా??
–లేదూ, చివరాఖరిగా మిగిలే నీతోనా?

- దేశరాజు

కాంతి-భ్రాంతి



అవనిని అలుముకున్న
సామాజిక మాధ్యమ రేఖలు...
కల ఏదో కళ ఏదో
కాంతి ఏదో భ్రాంతి ఏదో
తెలియనంతగా నట్టింట
నెట్టింటి వలలు....
కాలాన్ని దూరాన్ని తన గుప్పిట్లోకి
లాక్కున్న సాంకేతిక స్వర దృశ్య లయలు..
మనసులోని స్నేహ లతలు
మాటలోని ప్రేమ కృతులు
అనుబంధ గంధాల అనురాగ శృతులు
మానవతా గీతాల సరిగమలన్నీ..
సెల్ అలలలో గిలగిల చేపలు...

శబ్దాన్ని నిశ్శబ్దంగా తనలోకి
ఇముడ్చుకున్న మాయపొర
పద సంపదలు వాక్య మధురిమలు
పలకరింపుల పరిమళాలన్నీ నేడు
అర చేతి వైకుంఠపు గడులు
పద కోకిలల కిలకిల ధ్వనులతో
వాక్య కిరణాల వేకువ వెలుగులను
మనో గగనంలో ప్రసరింపజేద్దాం
భద్రమైన జీవన భాగ్యాన్ని తరతరాలుగా
అందిస్తున్న పుస్తక నేస్తాన్ని గుండె గుడిలో నిలుపుదాం..

- వెల్మల జయపాల్ రెడ్డి, 9441168976

మెచ్యూరిటీ!

ఎప్పటికీ.. బద్దలుకాని అగ్నిపర్వతాల్ని
మౌనంగ కనీసం గుండెల్లోనైనా గుట్టుగ
పేర్చుకోవడం నేర్చుకోవాలి!

తిట్లని, శాపనార్థాల్ని ఉద్దీపనా బహుమతులుగ
మనసు పొరల్లో రహస్యంగ ఎవరి కంట
పడకుండ దాచుకోవాలి..!

చివరాఖరికి మాటల్లోనైనామనమే ఓ ముందడుగేసి
శత్రువులైనా సరే.. హద్దుల్ని చెరిపేసుకోవాలి!

కినుకలు, అర్థంలేని అలకలు దూరదూరంగ ఉండటం..
నిశ్శబ్దాల్ని మోయడం.. మూతులు తిప్పుకోవడాలూ..
ముఖాల్ని దాచుకోవడాలు..

రానున్నవి గడ్డు రోజులు.. ఏకాంతం అతి ప్రమాదకరం!
ఆస్తులు, అంతస్తులెన్నున్నా ఎంతటి వారికైనా
ఆలోచనల అపరిపక్వత
'మెచ్యూరిటీ' అనిపించుకోదు!!

చూపు సక్కగలేనప్పుడు దృష్టి సంక్లిష్టత సహజం!
మనుషుల్తో సావాసమంటెనే కాళ్లల్ల కట్టిరికినట్లు..
జరంత సల్లు బిగుండాలే!!

అహమో, అజ్ఞానమో రెంటిని పక్కన పెడితే
అందరిలో ఆనందంగ వుంటాం!
ఒకమెట్టు దిగితే ఏం పడిపోం
నెగ్గడం కాదు తగ్గడమే మజా!!

ద్వేషం అసహజాతం!
ప్రేమ సర్వమోద సమ్మతం!!

- అశోక్ అవారి, 9000576581

కొల్లి వెంకన్న కవిత్వంలో 'దళిత వేదన'



"ఎంత కోయిల పాట వృధయయ్యెనో కదా చిక్కు చీకటి వనసీమలందు" అని జాషువ ఆవేదన చెందాడు. "పుట్టరాని చోట పుట్టుకతన ఎన్ని వెన్నెల వాగులు ఇంకిపోయెనో గదా?" అని వాపోయాడు. నేటికీ ఎంతోమంది అణగారిన వర్గాల కవులు, కవయిత్రులు వెలుగులోకి రాకుండా పోయారు. సాహిత్య చరిత్రలో వారికి సముచిత స్థానం దొరకలేదు. దళిత సాహిత్య ఉద్యమ ఉధృతిలో కొంతమంది తొలితరం కవులు వెలుగులోకి వచ్చారు. డాక్టర్ కల్లూరి ఆనంద రావు, గోగుశ్యామల, డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ లాంటి పరిశోధకులు పాత తరం కవులను, కవయిత్రులను సాహిత్య లోకానికి పరిచయం చేశారు. దళిత సాహిత్య చరిత్ర ఊట చెలిమ లాంటిది. ఈ సృజన చెలిమ నుండి మధురమైన కవితాజలాన్ని ఇంకా వెలికి తీయాల్సిన అవసరముంది. తరతరాలుగా అక్షరానికి దూరం చేయబడిన జాతిలో వెల్లువెత్తిన, సాహిత్య జీవ నదులతో వర్తమాన కాలానికి అంటిన కాలుష్యాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాలి. ఇలాంటి మరొక కవితా జీవనది కొల్లి వెంకన్న. వెంకన్న మాష్టారుగా ప్రఖ్యాతిగాంచిన ఈ కవి తూర్పు గోదావరి జిల్లా కోలంక గ్రామంలో 1932 ఫిబ్రవరి 4వ తేదీ మహాలక్ష్మి (తండ్రి పేరు) గంగమ్మ దంపతులకు జన్మించాడు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కావడంతో వెంకన్న ఐదవ తరగతి వరకు చదివి, ఆర్థిక ఇబ్బందుల వలన విధిలేని పరిస్థితుల్లో పశులకాపరిగా భూస్వామి వద్ద చేరాడు. ఆ తరువాత మేనమామ వడ్డి వెంకన్న, గురువు వీరన్నల ప్రోత్సాహంతో విద్యనభ్యసించి ఉపాధ్యాయవృత్తిలో ప్రవేశించాడు. పల్లి పాలెం, కోలంక గ్రామాలలో ఉపాధ్యాయుడిగా సేవలందించాడు. విద్యార్థులకు కొంగుబంగారంగా, గ్రామ ప్రజలకు తలలో నాలుకగా విలసిల్లి, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నాడు. రచయిత దాట్ల దేవదానంరాజు వెంకన్న ప్రియ శిష్యుడు. ఆయన ఏలుబడిలో అక్షరాలు దిద్దుకొని, తరువాత గురువుతో కలిసి ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. కోనసీమ ప్రాంత ప్రజల గుండెల్లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా కొలువైన కొల్లివెంకన్న 1996 జూన్ 11న మరణించాడు.

డెబ్బయ్యో దశకంలో ఆధునికదృష్టితో దళిత స్పృహతో వెంకన్న ఎన్నో పద్యాలు, గేయాలు, శతకాలు రాశాడు. నిరుపేదలు, వ్యసాయకూలీలు, అణగారిన వర్గాలు నిత్య జీవితంలో అనుభవిస్తున్న కష్టనష్టాలను వాస్తవ దృష్టితో కవిత్వీకరించాడు. స్పందనాస్పద హృదయంతో కవిత్వం రాసుకుంటూ పోవటం తప్ప ప్రచురణ విషయం వెంకన్న పట్టించుకోలేదు. అమూల్యమైన వెంకన్న అముద్రిత రచనలను సేకరించి వారి కుమారుడు కొల్లి సత్యనారాయణ 'దళిత వేదన' పేరుతో కవితా సంపుటిని ప్రచురించాడు. పద్య, గద్య, శతక, వచన, గేయ రూపంలో వెలువడిన ఈ సంపుటిని ఇటీవల హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. తరువాత యానాంలో పరిచయ సభ నిర్వహించారు.

ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుడైన వెంకన్న ప్రత్యేకించి భాషా శాస్త్రాలను అధ్యయనం చేయకపోయినప్పటికీ కుసుమ ధర్మన్న, గుర్రం జాషువ, బోయి భీమన్నల ప్రభావంతో సామాజిక అసమానతలు, ఆర్థిక అంతరాలు, ప్రజాసమూహంలో వేళ్లూనుకున్న మూఢ నమ్మకాలను తీవ్రంగా నిరసిస్తూ సరళంగా పద్య కవిత్వం రాశాడు. సందేశాత్మకమైన గేయాలు రాశాడు. ఒక్కొక్క అంశం గురించి భావ పరమైన పునరుక్తి లేకుండా ఎనభైకి పైగా పద్యాలు రాశాడు. కొన్ని పద్యాలు శతకశైలిలో ప్రబోధాత్మకంగా సాగాయి. కులపిశాచుల కుటిలత్వాన్ని, మత గజంబుల మదాన్ని మట్టు బెట్టాలని, 'మనువు చూపిన బాటను మంట గలపాలని వెంకన్న పిలుపునిచ్చాడు. దళిత జనుల వేదనను కవిత్వంలో శక్తివంతంగా పలికించాడు. మనువాదుల గుండెలదిరేలా ప్రశ్నాస్త్రాలను సంధించాడు. **"నీదు తల్లివలెనె నా తల్లి యున్నది/ నిన్ను గన్న యట్లు నన్ను గనెను/ నీదు రూపు గూడ నాదు రూపేనోయి/ ఏల వచ్చె నాకు మాల తనము?"** అంటూ సమర్థుడైన న్యాయవాదిలాగా కులవ్యవస్థ రూపొందించిన కుట్రను వ్యతిరేకించాడు. **'ఇరువురందు భేద మిసుమంతయు లేదని'** పద్యాల ద్వారా శాస్త్రీయంగా నిరూపించాడు. **"కోట్లకొలది సొమ్ము/ కూడ బెట్టు నరుడు కూడా"** కూలి వాని అండదండ లేకపోతే ఒక్క క్షణం కూడా మనుగడ సాగించలేడని వెంకన్న తెగేసి చెప్పాడు. కిందికులంలో పుట్టిన కారణంగా కూలివాడిగా మారాల్సి వచ్చిందనే ప్రగాఢమైన విశ్లేషణతో కవిత్వం రాశాడు. కుల నిర్మూలనా పోరాటంలో ముందుకు నడిచిన ఈలి వాడవల్లి, బి. వి రమణయ్య, పావన మూర్తి, పొనుగుమట్ల విష్ణుమూర్తి తదితర దళిత వైతాళికుల, నాయకుల అచంచల కృషిని పద్యాలలో కొనియాడాడు.

కవికి అపూర్వ వస్తు నిర్మాణ దక్షత ఉండాలి. విస్తృత వస్తువులను వేయి కళ్ళతో పరిశీలించి, పాఠక లోకానికి సరికొత్త రసస్ఫూర్తి కలిగించాలి. కొల్లి వెంకన్న అతి సాధారణ వస్తువులను గ్రహించి, పీడిత ప్రజల జీవితాలకు అన్వయించి రమణీయమైన పద్యాలను రచించాడు. డాక్టర్ బోయి విజయభారతి అన్నట్లుగా వెంకన్న ఊహాశక్తి గొప్పది. ఆయన ఎంచుకున్న కవితా వస్తువులలో వైవిధ్యం ఉంది. 'ఉప్పు మాత' లాంటి కవితల్లో ఈ రకమైన దృష్టి కనిపిస్తుంది.



> అసమ సమాజంలో బుసలుకొడుతున్న కులవివక్ష, పేదరికం, మతాధిపత్యాలను ఎదుర్కొనే క్రమంలో వెంకన్న ప్రతిఘటనాత్మకమైన చైతన్యాన్ని అందిపుచ్చుకున్నాడు. భావిభారత పౌరులను తీర్చిదిద్దే పాఠశాలలో కూడా ఆయన అనేక అవమానాలను ఎదుర్కొని, ఆత్మగౌరంతో వాటిని ధిక్కరించి నిలబడ్డాడు. డాక్టర్ ఏ.టి కోవూరు, గోరా, తాపీధర్మారావు వంటి వారి ప్రేరణతో హేతువాదిగా పరిణామం చెందాడు. మనుషులను నిలువెల్లా కలుషితం చేస్తున్న మూఢాచారాలను తరిమికొట్టే శాస్త్రీయ ఆలోచనలను విద్యార్థుల్లోనూ, తనజాతి జనుల్లో రేకెత్తించాడు.

"నీళ్ళు నీది తండ్రి, నేల నీదు జనని/ ఇరువురకును బుట్టి యిలను వెలసి/ సర్వ జనుల కిలను చప్పదనము బాపె/ గొప్ప దానివమ్మ ఉప్పు మాత" అంటూ కవి ఉప్పు పుట్టుక తీరును కవిత్వంగా మలిచాడు. **"నిన్ను గన్న తండ్రి, నీరు మళ్ళీ నిన్ను హతమారుస్తుందని, కరుణ లేనట్టి వాడు నీదు కన్న తండ్రి"** అంటూ నీటికి ఉప్పుకు ఉన్న విలక్షణ బంధాన్ని తేటతెల్లం చేసి, ఉప్పు మాతతో ఆత్మీయంగా కవి సంభాషిస్తాడు. నిత్య జీవనంలో ఉప్పు ప్రయోజనాన్ని, ఆహారంలో ఉప్పు ప్రాధాన్యతను, కడలి తీరంలో ఉప్పు ఉత్పత్తివిధానాన్ని, ఉప్పు వలన కలిగే లాభ, నష్టాలను వెంకన్న సముచితంగా అక్షరబద్ధంచేశాడు. జనుల నాలుకల మీద ఉప్పు 'రుచి మొలకలు' మొలిపిస్తుందని, ఆహారవిజ్ఞానికి ఉప్పుగల్లు 'ఒజ్జవిత్తు'గా ఉపయోగపడుతుందని కవితాత్మకంగా సంభాషించాడు. కోటేశ్వరునికీ, కటిక నిరుపేదకు ఉప్పు ఒకేరకంగా మేలు సమకూర్చుతుందని, ఉప్పుకు ఉన్న సమబుద్ధి మనుషులకు లేదని ఆవేదన చెందుతాడు కవి. ఉప్పుకు కూడా పన్ను చెల్లించాలని హుకూం జారీ చేసిన సీమదొరల దోపిడీ విధానాన్ని వెంకన్న నిరసించాడు. 'గొప్పదానివమ్మ ఉప్పు మాత' అనే మకుటంతో ఉప్పుతో సంభాషిస్తున్నట్లుగా సాగిన వెంకన్న పద్యశైలి విశిష్టంగా ఉంటుంది. 'తాటి చెట్టు జనని నీకు దండమమ్మ' అనే మకుటంతో హృద్యమైన భావధారతో వెంకన్న రాసిన పద్యాలు ఎంతగానో ఆకట్టు కుంటాయి. **"నీదు రక్తము కాశించి నీదు సుతులు/ తలలను నరికి నెత్తురు త్రాగు చుండె"** అంటూ కవి ఆవేదన చెందాడు. ఈ పద్యాలు చదువుతుంటే కరుణశ్రీ 'పుష్ప విలాపం' మదిలో మెదులుతుంది. **"దాన కర్ణుడు నీలోన దాగియుండె/ నిన్ను బోలిన సహకారి ఇలనెవరు గలరు?"** అంటూ వెంకన్న బహుళ ప్రయోజన దాయిని తాటిచెట్టు ఔన్నత్యాన్ని పద్యాల్లో ప్రస్తుతించాడు. కష్టజీవుల కడుపులో చెలరేగే ఆకలి మంటలనార్పే తల్లియని కీర్తించాడు. మద్యపానం, చీట్లపేక వల్ల సంభవించే ప్రమాదాలను కవిత్వంలో వెంకన్న ఆమోదయోగ్యంగా చిత్రించాడు. ఈ వ్యసనం సిరులను నోటన బెట్టియు కర కరమని నమిలి.. కడుపున దాస్తుందని" నరులను నాశన మొనర్చు పరమ పిశాచి' యని కవి హెచ్చరించాడు. "మేడల రేడుల యందున ఆడమని, పాడుబడిన బ్రతుకుల ఇళ్ళలో కాలు పెట్టవద్దని చీట్లపేకను వెంకన్న వేడుకున్నాడు. 'కోడిరేడు' కవితలో కోడికి మనిషికి మధ్యవున్న సంబంధ బాంధవ్యాలను, కాలికి కత్తి గట్టుకొని రణరంగంలో వీరోచితంగా పోరాడే కోడిపుంజు ధీరత్వాన్ని రమణీయంగా వర్ణించాడు .

అసమ సమాజంలో బుసలుకొడుతున్న కులవివక్ష, పేదరికం, మతాధిపత్యాలను ఎదుర్కొనే క్రమంలో వెంకన్న ప్రతిఘటనాత్మకమైన చైతన్యాన్ని అందిపుచ్చుకున్నాడు. భావిభారత పౌరులను తీర్చిదిద్దే పాఠశాలలో కూడా ఆయన అనేక అవమానాలను ఎదుర్కొని, ఆత్మగౌరంతో వాటిని ధిక్కరించి నిలబడ్డాడు. డాక్టర్ ఏ.టి కోవూరు, గోరా, తాపీధర్మారావు వంటి వారి ప్రేరణతో హేతువాదిగా పరిణామం చెందాడు. మనుషులను నిలువెల్లా కలుషితం చేస్తున్న మూఢాచారాలను తరిమికొట్టే శాస్త్రీయ ఆలోచనలను విద్యార్థుల్లోనూ, తనజాతి జనుల్లో రేకెత్తించాడు. యెండ్లూరి చిన్నయ్య అంబేద్కర్ జీవిత చరిత్ర అధ్యయనస్ఫూర్తితో వెంకన్న సామాజిక విముక్తి తత్వాన్ని అర్థం చేసుకున్నాడు. బాబాసాహెబ్ అంబేద్కర్ స్థాపించిన 'రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా' రాజకీయాలను, ఆశయాలనుప్రచారం చేశాడు. ఈశ్వరీ బాయి, బి.వి.రమణయ్య లాంటి నాయకులు కూడా ఎన్నికల సమయంలో అంబేద్కర్ భావజాల ప్రచారానికి వెంకన్నను ఆహ్వానించటం విశేషంగా భావించవచ్చు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జీవన, ఉద్యమ తీరుతెన్నులను వెంకన్న తన పద్యాలలో తాత్విక బంధురంగా చిత్రించాడు. **"అంధకారము బాపు అరుణుడేమి గొప్ప?"** అంటూ **"చీకటి బాపె అంబేద్కరే గొప్ప"** అంటూ వెంకన్న భీమైక దృష్టితో కలమెత్తి చాటిచెప్పాడు. **"మతము మారినావుగాని మాలతనము పోయిందా? మతము మారినా గాని మాదిగవే నీవిలలో"** అంటూ క్రైస్తవ, హిందూమతాల పరిమితుల్లో చిక్కిన మాల మాదిగలను ప్రశ్నించాడు. చర్చి, దేవాలయాల్లో, ప్రార్థనలు, అర్చనల్లో మునిగి తేలే అణగారిన వర్గాలకు వెంకన్న అంబేద్కర్ హక్కుల ఆవశ్యకతను తెలియజెప్పాడు.. **"కలమను హలమున భారత పొలము దున్ని/ జాతి మెరక పల్లము లెల్ల/ సౌఖ్య జలములు సర్వము సాగు నటుల/ సల్పితివి భీమ! నీకిలసాటి ఎవరు?"** అంటూ అంబేద్కర్ బహుముఖీన ఔన్నత్యాన్ని అపురూపంగా వర్ణించాడు. **"సత్యభామ మగనిచక్రంబు కంటెను/ భూపుత్రి పతియొక్క తూపుల కన్నను/ శివుని కరమునందు శూలంబు కంటెను/ అపరబుద్ధుని కల మరయ ఘనము"** (ఘనుడు అంబేద్కరుండు). విష్ణు చక్రం, రామ బాణం, శివుని శూలం ఇత్యాది పురాణ వీరుల ఆయుధాల కంటే అంబేద్కర్ కలము ఘనమైనదని కొల్లి వెంకన్న జ్ఞానోత్తేజంతో నిర్ధారించాడు. ఏభయ్యేళ్ల క్రితం వెంకన్న రాసిన ఈ పద్యంలో ఈనాటి దళిత కవుల తాత్విక ఎరుక కనిపిస్తుంది. **"మీ దగ్గర బ్రహ్మాస్త్రం ఉంది/ ఉంటే ఉండనివ్వండి/ మీ దగ్గర పాశు పతాస్త్రం ఉంది/ ఉంటే ఉండనివ్వండి"** అని సూర్యవంశి రాసిన 'యెన్నుంటేనేం' కవితకు వెంకన్న పద్యానికి భావ సామీప్యత కనిపిస్తుంది.


వెంకన్న ఉపాధ్యాయుడు కావటం వల్ల విద్యార్థుల మనోవికాసాన్ని పెంపొందింపజేసే సంకల్పంతో 'కోతి దూలము', 'కాకి పూజ' లాంటి సుప్రసిద్ధ కథలను, వాటిలోని నైతిక విలువలను, జీవిత సత్యాలను పద్యాలుగా మార్చి, పఠన యోగ్యమైన శైలిలో ప్రబోధించాడు. కథా కావ్య రచనాశైలిలో సాగిన ఈ ఖండికలు పాఠ్యపుస్తకాలలో చేర్చదగిన స్థాయిలోఉన్నాయని డాక్టర్ పల్లేరు వీరాస్వామి అన్నమాట సత్య సమ్మతమైనది. చాలామంది పండితుల్లాగా వెంకన్న ఏ గురువు వద్దా పంచకావ్యాలను, వ్యాకరణ, ఛందోగ్రంథాలను పఠించలేదు. పద్యరూపంలో సందేశమందిస్తే అది పదికాలాలపాటు నిలుస్తుందని ఆయన భావించాడు. చాలామంది దళిత సంప్రదాయ కవుల్లాగా పద్య రచనను సాధన చేసి పూర్తిగా వ్యవహారశైలిలో పద్యాలు రాశాడు. అక్కడక్కడ అన్వయ దోషాలు, వ్యాకరణపరమైన చిన్న చిన్నపొరపాట్లు దొర్లినప్పటికీ వెంకన్న పద్యాల్లో ఉదాత్తమైన భావసంపద పొంగిపొర్లుతుంది. మానవీయ జీవన మార్గం ఆలోచనా లోచనాలకు దర్శనమిస్తుంది. అన్నిటికీ మించి అంబేద్కర్, బౌద్ధ తాత్వికతకు వెంకన్న కవిత్వం నిలువుటద్దంలా ఉంటుంది.

(జూన్11 కొల్లి వెంకన్న వర్ధంతి సందర్భంగా)



డాక్టర్ కోయి కోటేశ్వర రావు,
9440480274

కమ్మనైన అమ్మ ముచ్చట



- గాజోజి శ్రీనివాస్,
9948483560

అమ్మ ప్రేమ గురించి ఎంత చెప్పినా తక్కువే. తన త్యాగం, కరుణ, అలుపెరుగని ఓర్పుతో బిడ్డని కనీ, పెద్దవారిని చేస్తుంది. అమ్మ పస్తులుండైనా బిడ్డ కడుపు నింపుతుంది. ఈ ప్రపంచానికి మొట్టమొదటి సారిగా నిన్ను పరిచయం చేసేది అమ్మే. ఎంత సేవ చేసినా అమ్మ రుణం తీర్చలేనిది. అమ్మ మీద అంతులేని ప్రేమను చూపడం బిడ్డ కర్తవ్యం. అలాంటి ప్రేమనే పెంచుకున్నారు మన కవి లేదాళ్ల రాజేశ్వరరావు. అమ్మ మీద ప్రేమను వ్యక్తం చేస్తూ రాసిన తన తృతీయ కవితా సంకలనమే 'అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి'.

రాజేశ్వరరావు అత్యంత విలక్షణమైన కవి. నిత్యం ఏదో ఒక పత్రికలో అతని కవితలు ప్రచురితం అవుతుంటాయి. ఆ కవిత్వంలో మానవీయ కోణాలు కవితా వస్తువులుగా కనిపిస్తాయి. వాటిని చదువుతుంటే మన చుట్టూ జరిగే సంఘటనలు గుర్తుకువస్తాయి. కొన్ని మన గుండెల్ని పిండేస్తాయి. అలాంటి కవి రాసిన ఎంతో ఆర్ద్రత గల కవితల్ని ఈ కవితా సంకలనంలో చదవొచ్చు. ప్రపంచీకరణలో మట్టి కొట్టుకుపోయిన మానవీయ విలువల్ని ఈయన కవిత్వంలో స్పృశిస్తున్నారు.

'అమ్మ కాళ్ళకు/ కొనలేని మెత్తని చెప్పులు గుర్తొచ్చి/ కన్నీటి ప్రవాహమవుతాను' పాడై పోతాయని అమ్మ చెప్పుల్ని తడవకుండా/ చేతిలో పట్టుకుని నడిచేది కొన్నిసార్లు/ ఇప్పుడా చెప్పులు గూట్లో స్తబ్దంగా కనిపిస్తాయి/ ముట్టుకున్నప్పుడల్లా మెత్తగా/ అమ్మ పాదాలు కంది పోతాయేమోనన్నంత మృదువుగా..

ఈ కవితను చదివినప్పుడు కంట్లో నీళ్ల తిరుగుతాయి. మనం బతికినన్నాళ్ళు అమ్మ బతకపోవచ్చు కానీ అమ్మ బతికిన్నాళ్లు మనం బతికే ఉంటాం. అమ్మ ప్రేమను పొందుతూనే ఉంటాం. ఈ కవిత చదువుతున్నప్పుడు ప్రతి ఒక్కరికి తన తల్లి గుర్తుకొచ్చి గుండె బరువెక్కుతుంది. ఈ కవిత 'అక్షరాల తెర టోరి రేడియో'లో కూడా ప్రసారితం అయినది.

'అనివార్యమై ఆమె ఒక్క రోజు జ్వరంతో నిద్రపోతే/ బ్రహ్మాండాలు బద్దలైనట్లు/ సునామీలు చుట్టూ ముసురుకున్నట్లు/ ఆమె చాకిరిని ప్రశంసించని/ కష్టాన్ని కనికరించని/ ఆమె పైనే ఆధారపడ్డ ప్రత్యక్ష పరాన్న జీవిని నేను'.

ఇంట్లో అమ్మ, భార్య చేసే చాకిరిని ఎప్పుడూ మనం గుర్తెరగం. ఆమెకు జ్వరం వచ్చి మంచం ఎక్కిన రోజున కిచెన్‌కి వెళ్లి వంట చేయాలన్నా, ఇంటిని శుభ్రం చేయాలన్నా బ్రహ్మాండం బద్దలవుతుంది. అలవాటు లేని పనిని చేసినప్పుడు ఏదో పాతాళంలోకి దిగబడిపోయినట్లుగా భావిస్తాను. అప్పుడే గుర్తుకొస్తుంది, తాను రోజూ ఎంత కష్టపడుతుందో అని. అయినా తన కష్టాన్ని గుర్తించమని ఎప్పుడూ అడగదు. నిస్వార్థంగా, ప్రేమగా తన పని తాను చేసుకుంటూ, ఇంట్లో అందరికీ అన్నీ సమకూర్చుతుంది. మనమే ఆమెపై ఆధారపడ్డ పరాన్న జీవులమై ఉన్నాం.

ఇలా ప్రతి కవితలో ఏదో ఒక అంశాన్ని గూర్చి చక్కగా ఆవిష్కరించారు. కవికి వస్తువు కొదవలేదు, వస్తువు లోతుపాతులు బాగా తెలుసు, మనసు చెప్పినట్టు రాసుకోగలిగారు. చదివే ప్రతి పదానికి మనసులో ఆలోచనలు తెరలుతెరలుగా పొంగిపొర్లుతాయి. మానవీయ కోణాల్ని ఆవిష్కరించడంలో ఈ కవి సఫలీకృతమయ్యారని చెప్పవచ్చు. ఇలా సరళంగా అర్థమయ్యేలాగా మనసులోకి చొచ్చుకుపోయే విధంగా ఉన్నాయి కవితలు.



నాతో ఎవరైనా ఉంటే బాగుణ్ణు/ఒక్కణ్ణే మాత్రం ఎంతని పయనించను?/ ఒక్కణ్ణే గుండెల్ని చీల్చుకుని ఏం రాసుకోను?/ గుండెల్లోనైనా ఒకరు ఉండాలి కదా!... నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా జీవనం సాగిస్తున్నారు. ఇంకొకరి గురించి ఆలోచించేంత సమయం ఎక్కడిది. ఉన్న సమయమంతా నేను, నా కుటుంబం అనుకునే కాడికే సరిపోతుంది. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా రూపొందాక మానవ బంధాల మాధుర్యం లేకుండా పోతుంది. ఓ ఆపద వచ్చినప్పుడు, కష్టాలు చుట్టుముట్టినప్పుడు, ఒంటరిగా మిగిలినప్పుడు నాతో ఎవరైనా ఉంటే బాగుండు అనే ఆలోచనలో మునిగిపోతాం. ఏదైనా సమస్య తనదాక వస్తే గాని తెలియట్లేదు బంధాల విలువలు.

'ఏం తీసుకొని పోతాను నాతో నేను/ ప్రోది చేసుకొని/ ఒంటరిగా వెళ్లేప్పుడు/ చిటికెడు కన్నీళ్ల కార్చడానికైనా ఒకరు ఉండాలి...' అని కవితను ముగిస్తాడు. ఎంత లోతైన భావుకత, చదువుతుంటే మనతో సూటిగా మాట్లాడినట్టే ఉంటుంది. ఈ లోకాన్ని దాటి వెళ్లేటప్పుడు తోడెవరు రాకున్నా కనీసం మనకోసం ఒక చిటికెడు కన్నీళ్లు రాల్చగలిగే మనుషులను సంపాదించుకోగలగాలి. మనకంటూ ఓ నలుగురు అయినవారు ఉండాలి అంటారు కవి. నాన్న గురించి మరో కవితలో..

'నాన్నొక దు:ఖ సంద్రం/ గంభీరంగా ఉండే సముద్రానికెంత దు:ఖం!?/ ఎన్ని బాధ్యతల/ నదుల ఘోషాల్ని/ తనలో ఇముడ్చుకోలేదు/ ఎన్ని కన్నీటి ప్రవాహాల్ని తన కన్నుల్లో దాచుకోలేదు నాన్న... అయినా/ నాన్న ఎప్పటికీ/ ఇంకిపోని అనురాగ జలనిధి.

నాన్న బాధ్యతల గురించి త్యాగాల గురించి ఎంత చెప్పినా తక్కువే. నాన్న కళ్ళల్లో కనిపించని ఎన్నో దు:ఖ సముద్రాలు దాగుంటాయి. అవేవీ తన బిడ్డలకు కనిపించనీయడు. తన పిల్లల కోసం నిత్యం పరితపిస్తూ, తనలాగా తన పిల్లలు ఇబ్బందులకు గురి కావొద్దని ఆకాంక్షించే నిస్వార్థపరుడు. పరిస్థితులు నాన్నని ఎంత క్షోభకి గురిచేసినప్పటికీ, తన పిల్లలకు మంచి భవిష్యత్ ఇయ్యాలనే కలలు కంటూ, మదన పడుతూ ఉంటాడు.

కొన్నింటిని అందరికీ చెప్పలేం/ దాచి దాచి లోలోపల/ కుమిలి పోతాం/ కొన్నింటిని కొంచెం కొంచెం అచేతనంలోకి నెట్టేయాలి/ విడవని బంక లాంటి ఊసుల్ని/ తీగలు తీగలుగా తొలగించాలి మరి/ అవును!/ జ్ఞాపకాలు తొరగా ఆరాలంటే/ వ్యాపకాల వింజామరతో విసరాలి.

మనసులో గూడుకట్టుకున్న అనేకానేక విషయాల్ని అందరితో పంచుకోలేం. అశ్రువులు నిండిన నయనాలు చూసి హేళన చేస్తారనో, లోకువైపోతామనో లోలోనే కుమిలిపోతాం. వాటిని ఏదొక వ్యాపకంతో కొద్దీ కొద్దిగా వదిలించుకోవాలి. అప్పుడే మనసు తేలికవుతుంది. కవిత్వం చాలామంది రాస్తారు, కానీ అనుభవాన్ని రంగరించి అలవోకగా అర్థమయ్యే విధంగా కొందరే రాస్తారు. అలాంటి కోవకే చెందిన కవి రాజేశ్వరరావు. ఊహించని విధంగా సూక్ష్మ దృష్టితో ఆలోచించి, తనదైన శైలిలో కవిత్వాన్ని అక్షరీకరిస్తాడు. ఈ కవి నుండి మరెన్నో అద్భుతమైన రచనలు రావాలని సాహిత్య అభినందనలు తెలియజేస్తూ...

కె.శివారెడ్డి కవిత్వస్ఫూర్తి పురస్కారం-2024

కె. శివారెడ్డిగారి పేరిట స్ఫూర్తి పురస్కారాల కోసం 35 సంవత్సరాల లోపు కవుల నుండి 2023 సంవత్సరంలో ముద్రితమైన కవితాసంపుటాలను ఆహ్వానిస్తున్నారు. మూడు ప్రతులను జులై 10వ తేదీలోపు ఇబ్రహీం నిర్గుణ్, 15.5.112/1/బి, స్కైలైన్ టవర్స్ ఎదురుగా, చైతన్యనగర్, ఖమ్మం-507002, తెలంగాణ చిరునామాకు పంపాలి. వివరాలకు: 9063696968.

పాలపిట్ట దాశరథి శతజయంతి సంచిక కోసం...

జులై 22న దాశరథి కష్ణమాచార్యులు శతజయంతి సంవత్సరం ఆరంభ సందర్భంగా సాహిత్యం, సంగీతం, నాటకం, సినిమా మొదలైన అన్ని రంగాలలో దాశరథికి సంబంధించిన ప్రతి అంశాన్ని రికార్డు చేయాలని పాలపిట్ట భావిస్తున్నది. దాశరథి కష్ణమాచార్యులతో సాహిత్య సంబంధం గలవారు, వారితో తాము పాల్గొన్న, కలిసి దిగిన ఫొటోలను, వారు రాసిన ఉత్తరాలను, దాశరథి తొలినాళ్ళ పుస్తకాల కవర్ పేజీలను పంపించవలసిందిగా కోరుతున్నారు. రచనలు, సూచనలు, ఫొటోలు పంపించవలసిన చిరునామా: ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం: 2, ఎం.ఐ.జి-2, ఏపిహెచ్‌బి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500044. వివరాలకు : 9490099327.

గీతమ్ పురస్కారం కొరకు...

గీతమ్ సంస్థ పన్నెండవ వార్షికోత్సవం సందర్భంగా ఉత్తమ కథా సంపుటాల పోటీ నిర్వహించి గీతమ్ పురస్కారం నిర్వహిస్తున్నారు. పోటీ కొరకు 2016 - 2024 మధ్య కాలంలోని సంపుటాలను జులై 5 లోపు మూడు కాపీలను ఓలేటి వెంకటేశ్వర రావు, అధ్యక్షులు, గీతమ్ సాహితీ సంస్థ, పిఠాపురం - 533450 చిరునామాకు పంపాలి.

శివేగారి దేవమ్మ కథా పురస్కారాలు - 2023

శివేగారి దేవమ్మ కథా పురస్కారాల కొరకు 2022, 2023 లో ప్రచురించిన కథా సంపుటాలు, బాలల కథా సంపూటాల పురస్కారాల ఫలితాలు వెలువరించారు. మునిసురేష్ పిళ్లై (గారడీ వాడు), కుసుమంచి నాగేంద్ర (చందమామలో మేనమామ), ఆర్.సి. కష్ణస్వామి రాజు (కార్వేటినగరం) రచించిన కథా సంపుటాలు ఎంపిక అయ్యాయి. - **కె.వి. మేఘనాథ్ రెడ్డి, 6300318230**

ఏడు రంగుల జండా పుస్తకావిష్కరణ

ఈ నెల 13 వ తేదీ సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో అమరవాది నీరజ రచించిన 'ఏడు రంగుల జండా' పుస్తకావిష్కరణ జరుగుతుంది. భాషా సాంస్కృతిక శాఖ, అమరవాది ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో ఆచార్య సి.మృణాళినికి శ్రీమతి అమరవాది హైమవతీ- డా.ఎ.సి.ఎం.ఎల్.ప్రసాద్ సాహిత్య పురస్కారం, గరిపెల్ల అశోక్‌కి డా॥ఎ.సి.ఎం.ఎల్.ప్రసాద్-శ్రీమతి హైమవతి బాలసాహిత్య పురస్కారం అందజేస్తారు. ఈ సభలో మణికొండ వేదకుమార్, డా॥పత్తిపాక మోహన్, డా॥జుర్రు చెన్నయ్య, చొక్కాపు వెంకటరమణ పాల్గొంటారు.



ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

- జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్ తెలిపారు. ఆదివారం జిల్లా కలెక్టర్ జిల్లా కేంద్రంలో గ్రూప్ -1 పరీక్ష నిర్వహిస్తున్న పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఆర్జెసి కళాశాల, క్రియేటివ్ హైస్కూల్, మౌంట్ ఫోర్ట్ హైస్కూల్, సెయింట్ జోసఫ్ హై స్కూల్, కృష్ణ ప్రసాద్ మెమోరియల్ స్కూల్, హార్వెస్ట్ హై స్కూల్, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల కళాశాలలను కలెక్టర్ సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పరీక్షా సెంటర్‌లో హాజరైన అభ్యర్థుల బయో మెట్రిక్ హాజరు వివరాలను అడిగి తెలుసుకొని, అభ్యర్థులు ప్రశాంతంగా పరీక్షా రాసే విధంగా, సమయం తెలిసే విధంగా ప్రతి అరగంట సమయానికి బెల్, చివరి 30 నిమిషాలు ఉన్నప్పుడు అలారం బెల్ మోగే విధంగా చూడాలని తెలిపారు. జిల్లాలో మొత్తం 52 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన గ్రూప్ -1 పరీక్షకు మొత్తం 18,403 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 13,855 మంది విద్యార్థులు హాజరు కాగా, 75.28 శాతం హాజరు నమోదు అయినట్లు, మిగిలిన 4,548 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదని తెలిపారు. పరీక్ష ముగిసిన అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్ పర్యవేక్షణలో హైదరాబాదు నుండి వచ్చిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ జెఎన్టి ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. దుర్గారావు, ప్రవీణ్ కుమార్, విజయ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్‌బాబు, ఎస్బిఐటి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జి.రాజ్‌కుమార్ అధికారులకు సంబంధిత పరీక్షా మెటీరియల్‌ను అందించారు.



కుట్టు మిషన్లు పంపిణీ

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని 35 డివిజన్ కార్పొరేటర్ వెల్లంపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో ఆదివారం మోతీ నగర్‌లో మహిళల ఉపాధి కోసం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కుట్టుమిషన్ల దాత సాయి గణేష్ ట్రేడర్స్ ప్రోప్రైటర్ కేశ నరసింహారావు, జన శిక్షణ సంస్థ డైరెక్టర్ రాధాకృష్ణ, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు యర్రా శ్రీనివాస్‌రావు, త్రీ టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు, కార్యదర్శి వర్గ సభ్యులు వజినేపల్లి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బండారు యాకయ్య, సానిక డివిజన్ నాయకులు సిద్ధిల రాజు, తమ్మినేని రంగారావు, ఎస్కే. అమీనా, వెల్లంపల్లి పద్మ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ మున్సిపాలిటీగా మధిర

- మధిర ఉజ్వల భవిష్యత్తు మనందరి బాధ్యత
- 128 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు
- మున్సిపాలిటీ సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

నవతెలంగాణ-మధిర



మధిర మున్సిపాలిటీ అభివృద్ధిలో ఓ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు, స్థానిక నేతలు సమిష్టిగా కృషి చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం మధిరలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మునిసిపల్ అధికారులు, పాలకవర్గం, అఖిలపక్ష నేతలతో కలిసి మధిర మున్సిపాలిటీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, ప్రస్తుతం ఉన్న సమస్యలపై డిప్యూటీ సీఎం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల వారు మధిర అభివృద్ధిని చూసేందుకు వచ్చేలా అంతా కృషి చేయాలని కోరారు. మధిర పట్టణానికి ఉజ్వల భవిష్యత్తు ఉంది అది మనందరి బాధ్యత, అభివృద్ధిని భారంగా భావించే వారిని వదిలించుకునేందుకు సిద్ధంగా ఉండాలని సున్నితంగా హెచ్చరించారు. కోడు ముగిసిన వెంటనే ఒక్కరోజు కూడా వృధా కాకూడదనే ఉద్దేశంతో మధిర పట్టణ అభివృద్ధి లక్ష్యంగా ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాలన అభివృద్ధి రెండిటిని గాటిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది, మధిరకు పెద్ద ఎత్తున నిధులు వస్తాయి అన్న ఆశతో ప్రజలు ఉన్నారు.. కక్షలు, కార్పణ్యాలకు తావు లేకుండా రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ కలిసి రావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు గాను రూ.128 కోట్లు కేటాయిస్తూ ఇప్పటికే జీవో విడుదలైన విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. విద్య, వైద్యం, శానిటేషన్, తాగునీరు, విద్యుత్తు ఇలా ఏ విషయంలోనైనా మధిర పట్టణంలో ఇబ్బంది ఉండదు అన్న భరోసా కల్పించాలన్నారు. అధికారుల పని తీరుపై ప్రతినెల సమీక్ష చేస్తాం. నిర్లక్ష్యంగా ఉంటే వదిలించుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మున్సిపాలిటీలో వాహనాలకు జీపిఎస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఉద్యోగులకు బయో మెట్రిక్ హాజరు విధానం అమలు చేయాలని డిప్యూటీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మెన్, కౌన్సిలర్లు, వివిధ పార్టీల అధ్యక్ష, కార్యదర్శులు మధిర పట్టణ అభివృద్ధికి సూచనలు చేశారు.



విజయవంతమైన నెల నెల వైద్య శిబిరం

- 193 మందికి వైద్య సేవలు

నవతెలంగాణ-నేలకొండపల్లి

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధరరావు సేవా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో ఎన్టీఆర్ సేవా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 18వ వైద్య శిబిరం విజయవంతమైంది. వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కొల్లి అనుదీప్ ఎండి జనరల్ 124 మందికి రోగులకు బీపీ, షుగర్ జనరల్ వైద్య సేవలు, ఎముకలు కీళ్ల ప్రత్యేక వైద్యనిపుణులు డాక్టర్ మేదరమెట్ల అనిల్ కుమార్ 42 మందికి, శరత్ మాక్సిజన్ విజన్ వారిచే 27 మందికి కంటి వైద్య పరీక్షలు, మొత్తం193 మందికి వైద్యసేవలు అందించారు. నెలకు సరిపడా బీపీ, షుగర్, గ్యాస్ మాత్రలు వంద రూపాయలకే పంపిణీ చేశారు. ఈ శిబిరంలో వసుంధర ఒకేషనల్ విద్యార్థులు రోగులకు మందులు వేసుకునే విధానంపై సహాయం అందించారు. గ్రామీణ వైద్యుల సేవా సంఘం వైద్యులు రోగులకి బిపి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ సేవ కమిటీ కన్వీనర్ ఏటుకూరి రామారావు మాట్లాడుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఉద్యమాలకే పరిమితం కాకుండా పేదలకు ఉచిత సేవలు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా కమిటీ సభ్యులు కేవీ రామిరెడ్డి, కట్టెకోల వెంకటేశ్వర్లు, యరదేశి నరసింహారావు, బండారుపల్లి నాగేశ్వరరావు, బండి పుష్పలత, ఎస్కే.తానీషా, ఎస్కే. జమాల్ మంకెనపల్లి నరసింహారావు, కర్రీ రఘు, అబ్దుల్ రహీం, సామల మల్లికార్జునరావు, డీ.నాగేశ్వరరావు, అల్పాహార దాతలు మాటూరి శేషగిరిరావు, సుగుణ దంపతులు, వల్లంచెట్ల భాస్కర్‌రావు, కొంగర నారాయణరావు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు సత్యనారాయణ మృతి

- నివాళులర్పించిన పార్టీ నేతలు

నవతెలంగాణ-వైరాటౌన్



మండలంలోని లింగన్నపాలెం గ్రామంలో వయోభారంతో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు తోటకూరి సత్యనారాయణ(100) మరణించారు. ఆదివారం మరణవార్త తెలియగానే సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు తోటకూరి సత్యనారాయణ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగన్నపాలెం గ్రామంలో సీపీఐ(ఎం) బలోపేతానికి తోటకూరి సత్యనారాయణ ఎనలేని కృషి చేశారని, రైతులు, కూలీల పక్షాన అనేక ఉద్యమాలు నిర్వహించారని, వారి మృతి పార్టీకి, ప్రజా ఉద్యమానికి తీరని లోటని అన్నారు. అనేక సందర్భాల్లో సీపీఐ(ఎం) స్థానికంగా గెలవడానికి తోటకూరి సత్యనారాయణ కుటుంబం అండగా ఉందన్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో విప్పలమడక మాజీ సర్పంచ్ తుమ్మల జాన్ పాపయ్య, ఎస్ఎఫ్ఐ వైరా డివిజన్ అధ్యక్షులు ఈ.నాగరాజు, సీపీఐ(ఎం) నాయకులు మాజీ మండల కోఆప్షన్ సభ్యులు షేక్ జానిమియా, శాఖ కార్యదర్శి బాణాల కృష్ణమాచారి, సజ్జ నాగేశ్వరరావు, తోటకూర బాబురావు, తోటకూర శ్యామ్, చెంగల తిరుపతమ్మ, దుందునూరు కృష్ణ తదితరులు ఉన్నారు.

సంతాపం తెలిపిన సీపీఐ(ఎం) నేతలు పోతినేని, నున్నా

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావులు ఫోన్ ద్వారా తోటకూరి సత్యనారాయణ మృతికి సంతాపం తెలిపారు. వారి కుమారులు తోటకూరి శ్రీనివాసరావు, శేషగిరిరావు, కృష్ణయ్య, స్వరాజరావులతో ఫోన్ ద్వారా మాట్లాడి సానుభూతిని తెలిపారు.

'విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

- వరంగల్ వెళ్ళనున్న కార్మికులు

నవతెలంగాణ-తల్లాడ



విద్యుత్ శాఖలో అనేక సంవత్సరాలుగా దీర్ఘకాలికంగా సమస్యలు అపరిష్కృ తంగా ఉన్నాయని, వీటిని ప్రస్తుత ప్రభుత్వం వెంటనే కల్పించుకొని సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం దొడ్డ కృష్ణయ్య భవన్లో తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ తల్లాడ మండల కమిటీ సమావేశం తుమ్మల ప్రకాష్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా డివిజనల్ ఇంజనీర్లు సూపర్డెంట్ ఇంజనీర్లకు, దరఖాస్తుల అందజేశామన్నారు. సోమవారం వరంగల్ సిఎండిని కలిసి డిమాండ్ల పత్రాన్ని అందించనున్నట్లు తెలిపారు. తదుపరి 14వ తేదీ ట్రాన్స్కో, సిఎండిని కలిసి డిమాండ్ల పరిష్కారం చేయాలని వినతి పత్రాలు సమర్పిస్తున్నామని తెలిపారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పెరుగుతున్న సర్వీసులకు అనుగుణంగా మారుతున్న వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా కార్మికులను పెంచాల్సిన అవసరం ఉందని, డిమాండ్‌కు సరిపడా రిక్రూట్మెంట్ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న కార్మికులపై విపరీతంగా పనిభారం ఉందని, వారు మానసికంగా కుంగుబాటుకు గురవుతున్నారన్నారన్నారు. పెండింగ్ డిఎ ఏరియర్స్ ఇవ్వాలని, గృహ జ్యోతి పథకం వల్ల ఉపాధి కోల్పోయిన బిల్ కలెక్టర్లను ఆదుకోవాలని, మీటర్ రీడింగ్, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, ఆర్టిజన్ కార్మికులను పర్మినెంట్ వర్కర్లుగా కన్వర్షన్ చేయాలని, తదితర డిమాండ్లతో సంబంధిత అధికారులకు వినతి పత్రాలు ఇస్తున్నామని తెలిపారు. జిల్లా కార్యదర్శి కామినేని నాగేశ్వరరావు మాట్లాడుతూ..కార్మికుల సమస్యల కోసం, పోరాడేది సీఐటీయూ అన్నారు. ఈ సమావేశంలో సత్తుపల్లి డివిజన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, వైరా కార్యదర్శి గురునాథం, తల్లాడ సబ్ డివిజన్ నాయకులు తుమ్మల ప్రకాష్‌రావు, బిల్ కలెక్టర్లు అశోక్, ఆర్టిజన్లు నాగార్జున, మీటర్ రీడింగ్ కార్మికులు సురేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

షాపు గుమస్తాల హక్కులను కాలరాసిన మోడీ సర్కార్

- గుమస్తాల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్

నవతెలంగాణ-పెనుబల్లి



పోరాడి సాధించుకున్న షాపు గుమస్తాల హక్కులను మోడీ సర్కారు కాలరాసిందని సీఐటీయూ అనుబంధ షాప్ గుమాస్తాల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వీఎం బంజరలో గల చలమాల సూర్యనారాయణ భవనంలో చీపి మారేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ..లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మికులను పనిలో నుండి తొలగించిన సమయంలో కార్మికాధికారుల ద్వారా యాజమాన్యాలతో బేరసారాలు జరిపే హక్కును తొలగించారని, గుమాస్తాలకు ప్రసవ, వివాహ, మరణ సమయంలో ఇచ్చే సహాయాల సొమ్ము పెంచాలని, దుకాణాల లైసెన్స్ రెన్యువల్ సమయంలో వెల్ఫేర్ ఫండ్ కార్మిక శాఖకు చెల్లించడం లేదని దీంతో గుమస్తాలకు వచ్చే బెనిఫిట్స్ రావడం లేదన్నారు. నూతన దుకాణాల రిజిస్ట్రేషన్‌లకు, రెన్యువల్స్‌కు, వెల్ఫేర్ ఫండ్ వసూలుకు జిల్లా కలక్టర్ సాబ్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వ ఆదాయానికి లాభం చేకూర్చుతూ...గుమస్తాలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. దుకాణాలలో, ఫ్యాక్టరీలలో గతంలో మాదిరిగా తనిఖీలు నిర్వహించే అధికారాలు సహాయ కార్మికాదికారులకు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటి సభ్యులు గాయం తిరుపతిరావు మాట్లాడుతూ గుమస్తాలందరూ ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని, వ్యవసాయ కార్మిక సంఘం అండగా వుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుమస్తాలు మోదుగుముడి నరసింహారావు, కాటినేని రామారావు, జీడిమళ్ళ హుస్సేన్, చల్లా నరసింహారావు, చిరగా కృష్ణ, ఆచంటి కృష్ణప్రసాద్, చెన్నకేశవులు, కొప్పుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యా క్షేత్ర పాఠశాల ప్రారంభం

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని మమత ఆసుపత్రి రోడ్డులోని శ్రీనగర్ కాలనీలో విద్యా క్షేత్ర పాఠశాలను మంత్రి తుమ్మల నాగేశ్వరావు, మేయర్ నీరజ, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ సురభి ప్రారంభిస్తారని పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి. సౌభాగ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



సర్వజ్ఞ విద్యార్థికి జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని విడియోస్ కాలనీలోని సర్వజ్ఞ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న గౌరిపెట్టి చార్విక్ టేబుల్ టెన్నిస్ అండర్-14, అండర్-17 ఇయర్స్ బాలురు రాష్ట్ర స్థాయి జిల్లా తెలంగాణ స్టేట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్పోర్ట్స్ జోన్ పోటీలో మొదటి బహుమతి గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఆర్వీ నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ తన విద్యార్థి గౌరిశెట్టి చార్విక్ ఈ ఘనత సాధించినందుకు సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల సృజనాత్మకతను, ప్రతిభను విద్యార్థి దశలోనే గుర్తించి, వారి భవిష్యత్తు కోసం వారిని ప్రోత్సహించడం ద్వారా విద్యార్థులు ఆశించిన లక్ష్యాన్ని సాధించడంలో సర్వజ్ఞ పాఠశాల ముందంజలో ఉంటుందని తెలిపారు. డైరెక్టర్ నీలిమ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు ప్రాముఖ్యత ఇచ్చి, అన్ని రంగాలలో మార్గదర్శకులుగా మారి, అన్ని విషయాలను నేర్చుకోవడం ద్వారా కొత్త సమాజ నిర్మాతగా మారగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. ఖమ్మంలో జరిగిన తెలంగాణ స్టేట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్పోర్ట్స్ జోన్ అవార్డు ప్రధాన వేడుకలో పాల్గొన్న సర్వజ్ఞ స్కూల్ విద్యార్థి జీ.చార్విక్ జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ అండర్-14, అండర్-17 కటగిరి జ్ఞాపిక , ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అనంతరం సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్ నాగేంద్ర కుమార్, నీలిమ విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీ.రజని, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు భాగం భాగేశ్వరరావు మృతి

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోని గోవిందాపురం ఏ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు, ఆళ్లపాడు మాజీ ఎంపీటీసీ, బోనకల్ మాజీ వైస్ ఎంపీపీ, భాగం రమేష్ తండ్రి తెలుగుదేశం సీనియర్ నాయకులు భాగం భాగేశ్వరరావు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. మృతునికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భాగేశ్వరరావు 1982 వ సంవత్సరంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆ రోజు నుంచి మృతి చెందే వరకు టీడీపీలోనే కొనసాగుతున్నారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతదేహాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం సందర్శించి తెలుగుదేశం జెండా కప్పి ఘన నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ, నాయకులు సాదినేని హనుమంతరావు, భోజడ్ల అప్పారావు, మరీదు బరకయ్య మంద నరేందర్, పారా వెంకటేశ్వరరావు, కావూరి జనార్దన్‌రావు, కావూరి శంకర్‌రావు, బొబ్బిళ్ళ తిరుపతయ్య, వడ్డెబోయిన సాయి, మేడేపల్లి కోటేశ్వరరావు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) నాయకులు, ఆళ్లపాడు మాజీ సర్పంచ్ పారా లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు భాగం నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వేగంగా మోటార్ సైకిల్, చెట్టుని ఢీకొన్న కారు

- తీవ్రంగా గాయపడ్డ వరుడు శశికుమార్, తల్లి, పిన్ని, బావమరిది, వదిన
- ఎంగేజ్మెంట్‌కి వెళ్తుండగా ప్రమాదం
- దాచేపల్లి సీతానగరం వద్ద ఘటన

నవతెలంగాణ-బోనకల్





వరుడు కాబోయే భార్యతో ఎంగేజ్మెంట్ కోసం తన కుటుంబ సభ్యులతో పల్నాడు జిల్లా నుంచి శనివారం తెల్లవారుజామున భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు కారులో బయలుదేరారు. శుభ కార్యక్రమం కోసం ఎంతో సంతోషంతో వెళుతున్న కారు ఒక్కసారిగా మోటార్ సైకిల్‌ని ఆ తర్వాత వెంటనే రోడ్డు పక్కనే గల ఓ చెట్టును వేగంగా, బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వరుడుతో సహా తల్లి, పిన్ని, బావమరిది, వదిన తీవ్ర గాయాలు పాలయ్యారు. ఆదివారం ఉదయం 7 గంటలకే మండల పరిధిలోని సీతానగరం గ్రామ సమీపంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు అతి కష్టం మీద కారులో నుంచి క్షతగాత్రులను బయటకు తీశారు. దీంతో శుభ కార్యక్రమం కాస్త విషాదకరంగా మారింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం...పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం దాచేపల్లి గ్రామానికి చెందిన నూతన వరుడు కంద్రాతి శశి కుమార్, అతని తల్లి కంద్రాతి పద్మావతి, పిన్ని కంద్రాతి భాగ్యలక్ష్మి, వదిన ఓరుగంటి అంజలి బావమరిది ఓరుగంటి శంకర్‌లతో కలిసి కారులో (నెంబర్ ఏపీ 39 యుఎ 85 48) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన భాగ్యనందినితో ఎంగేజ్మెంట్ (పూలుపండ్లు) కోసం శనివారం తెల్లవారు జామున బయలుదేరారు. బోనకల్లు మీదుగా పాల్వంచ వెళ్తున్నారు. అయితే అదే సమయంలో వైరా మండలం వల్లాపురం గ్రామానికి చెందిన ఎర్రగాని వీరయ్య తన మోటార్ సైకిల్ పై డీజిల్ కోసం మధిర క్రాస్ రోడ్డు సమీపంలో గల పెట్రోల్ బంక్ నుంచి క్యాన్‌లో డీజిల్ తీసుకొని వల్లాపురం బయలుదేరాడు. సీతానగరం గ్రామ సమీపంలో కాలువ వద్ద వీరయ్య డీజిల్ క్యాన్ బరువు ఎక్కువగా ఉండటంతో మోటార్ సైకిల్‌ని అటూ ఇటూ తిప్పుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో వెనకనుంచి వస్తున్న ఎంగేజ్మెంట్ కారు డ్రైవర్ కంగారుతో మోటార్ సైకిల్‌కి గల సైడ్ బాక్సుకు తగిలాడు. ఆ వెంటనే వేగాన్ని అదుపు చేసుకోలేక పక్కనే గల ఓ చెట్టును బలంగా ఢీకొట్టాడు. దీంతో కారులో ఉన్న డ్రైవర్‌తో సహా ఐదుగురు తీవ్ర గాయాలు పాలయ్యారు. ఈ ప్రమాదంలో వరుడు శశి కుమార్‌కు కాలు విరిగినట్టు బంధువులు తెలిపారు. అదేవిధంగా వరుడు తల్లి పద్మావతి, పిన్ని భాగ్యలక్ష్మి, వదిన అంజలి, బావమరిది శంకర్ తీవ్రంగా గాయపడ్డారు. ఉదయం 7 గంటలకే ప్రమాదం జరిగింది. ప్రమాదానికి గురైన కారు నుంచి క్షతగాత్రులు ఆర్తనాధాలను విన్న స్థానికులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. కారులో ప్రమాదానికి గురైన వారందరిని బయటకు తీశారు. వెంటనే స్థానికులు 108కి సమాచారం అందించారు. బోనకల్ 108 లో భాగ్యలక్ష్మిని, పద్మావతిని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శశి కుమార్, అంజలి, శంకర్ లను వైరా 108 లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అందరికీ తీవ్ర గాయాలు కావడంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఖమ్మంలోనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి బంధువులు అందరిని తరలించారు. శుభ కార్యక్రమానికి వెళుతున్న కారు ఒక్కసారిగా ప్రమాదానికి గురికావడంతో క్షతగాత్రులు, బంధువులు ఆందోళన చెందుతున్నారు. కారు ప్రమాదం సమాచారంతో క్షతగాత్రుల బంధువులు దాచేపల్లి నుంచి ఖమ్మం చేరుకొని మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శనివారం ఉదయం10 గంటలకు పాల్వంచలో శశి కుమార్‌కు, భాగ్యనందినికి ఎంగేజ్మెంట్ కార్యక్రమం జరగవలసి ఉండగా ఒక్కసారిగా ప్రమాద వార్తతో వధువు, వరుడు కుటుంబాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటన స్థలానికి పెద్ద ఎత్తున స్థానికులు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. సంఘటన స్థలాన్ని స్థానిక పోలీసులు సందర్శించారు. డ్రైవర్ అతివేగం, నిద్రమత్తు కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చునని స్థానికులు అంటున్నారు.



కృష్ణవేణి విద్యార్థుల విజయఢంకా

నవతెలంగాణ-ఖమ్మం

జేఈఈ అడ్వాన్స్ పరీక్షా ఫలితాలలో కృష్ణవేణి జూనియర్ కళాశాల విద్యార్థుల విజయఢంకా మ్రోగించారని కళాశాల డైరెక్టర్స్ గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వర్‌రావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జేఈఈ మెయిన్స్, నీట్, ఎంసెట్, ఇంటర్ ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌లోను తమ ప్రతిభ కనబర్చారని తెలిపారు. విద్యార్థులు చెందిన బి.నితిష్ 714, బి. సాయి కిరణ్ - 885, పి. రోహిత్ కుమార్ 961, బి. చరణ్ 1029, ఎం. మోహిత్ నాయక్ 1279, బి. అఖిల్ - 1338, ఎస్. ప్రియదర్శిని - 2574, జి. కార్తీక్ - 2630, ఎం.ఆనంద్ కుమార్ - 2782, ఎం. శశాంక్ 3265, ఎం. జీవని 4851, ఎం. ఉజ్వాలా మానస 6600, పి. నవదీప్ - 6607 విద్యార్థులు ర్యాంకులు సాధించారని తెలిపారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపకులను ప్రిన్సిపాల్ గుర్రం రాంచంద్రయ్య, అకాడమిక్ ఇంచార్జి వంశీకృష్ణ , ఏవో నిరంజన్ కుమార్ అభినందించారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు 25 మంది ఎంపిక

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్లో ఈ నెల రెండో తేదీన జరిగిన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మహిళా, పురుషుల పవర్ లిఫ్టింగ్ పోటీలలో విజేతలుగా నిలిచిన 25 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ జనరల్ సెక్రటరీ సిహెచ్.మనోజ్ కుమార్ తెలిపారు. పురుషుల విభాగంలో 59 కేజీల పవర్ లిఫ్టింగ్‌లో జి.సతీష్(క్లాసిక్ జిమ్), 66 కేజీల భాగంలో బి. సాయికిరణ్(క్లాసిక్ జిమ్), 74 కేజీల విభాగంలో కే. గోపీచంద్ (క్లాసిక్ జిమ్), 83 కేజీల విభాగంలో ఎం పవన్(క్లాసిక్ జిమ్) , జయ ప్రదీప్(ఖమ్మం), 93 కేజీల విభాగంలో వై. స్వర్ణకుమార్, పి సిద్దార్థ(క్లాసిక్ జిమ్), 105 కేజీల విభాగంలో బి. సిరాజ్(క్లాసిక్ జిమ్), 120 కేజీల విభాగంలో బి .కార్తీక్ , బి .ప్రమోద్ (క్లాసిక్ జిమ్), 120 కేజీల విభాగంలో సిహెచ్ రేవంత్ (క్లాసిక్ జిమ్), 47 కేజీల మహిళా విభాగంలో కే.నేహా (క్లాసిక్ జిమ్), 52 కేజీల విభాగంలో ఎండి రెహమతున్నీసా బేగం (క్లాసిక్ జిమ్), 57 కేజీల విభాగంలో వి.దివ్య (క్లాసిక్ జిమ్), 63 కేజీల విభాగంలో స్రవంతి(స్టే ఫిట్ జిమ్) కే. షైనీ, సమిత (క్లాసిక్ జిమ్), 69 కేజీల విభాగంలో సిహెచ్. నగీన(క్లాసిక్ జిమ్) శరీర ఆయేషా(నరేన్‌జిమ్), 72 కేజీల విభాగంలో ఏ .శాలిని, బి .యమునా (క్లాసిక్ జిమ్), 24 కేజీల విభాగంలో వీ. కీర్తన, టి .నిషా(క్లాసిక్ జిమ్), 84 ప్లస్ విభాగంలో ఈ .రోజా (క్లాసిక్ జిమ్) అర్హత పొందారు. వీరు జూలై 6 ,7 తారీకులలో ఖమ్మంలో జరగనున్న సీనియర్ స్టేట్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి పోటీలకు సపోర్ట్ చేసిన క్లాసిక్ జిమ్ ప్రొప్రైటర్ సిహెచ్ నగీన చౌదరి, వ్యాపారవేత్త రాపర్తి రాజా, ఖమ్మం జిల్లా ప్రెసిడెంట్ గౌస్ పాషా రాష్ట్రస్థాయికి ఎంపికైన లిఫ్టర్లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పెద్దమ్మ తల్లి గుడిలో బోనాల పూజలు

నవతెలంగాణ-ముదిగొండ



మండలపరిధిలో వనంవారికిష్టాపురంలో పెద్దమ్మ తల్లి దేవాలయంలో నిర్మాణం చేసి సంవత్సరం పూర్తి అయింది. గుడి ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముదిగొండ సొసైటీ చైర్మెన్ తుపాకుల యలగొండస్వామి ఆధ్వర్యంలో గ్రామస్తులు బోనాలు చెల్లించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ తుపాకుల రమాదేవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేరండి

- మండలంలో జోరుగా సాగుతున్న బడిబాట

నవతెలంగాణ-కల్లూరు

ప్రభుత్వ పాఠశాలలో అర్హులైన ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించాలంటూ మండలంలో నాలుగో రోజు ఉధృతంగా బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. చెన్నూరు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న దంతాల సుధాకర్ బైక్ పైన మండలం మొత్తం పర్యటన చేస్తూ బడిబాట కార్యక్రమాన్ని కొనసాగిస్తూ తల్లిదండ్రుల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఆదివారం వెన్నవల్లి గ్రామంలో బైక్ యాత్ర నిర్వహించి ఆ గ్రామంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమంలో పాల్గొని, విద్యార్థులకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల ను బలోపేతం చేయడం కోసం మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని ఇందులో భాగంగానే మన ఊరు మనబడి, అమ్మ ఆదర్శ పాఠశాల, పథకాలతో విద్యార్థులకు కావల్సిన కనీసం మౌలికసదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. దాంతోపాటు ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం, వీటితోపాటు దాతలు సహకారంతో ఆయా పాఠశాలలో నోట పుస్తకాలు కూడా ఉచితంగా అందజేస్తున్నట్టు వివరించారు. ఈ విధంగా మండలం మొత్తం దంతాల సుధాకర్ బైక్ యాత్ర చేస్తూ గ్రామాల్లో ఆ పాఠశాల ఉపాధ్యాయులు కలిసి బడిబాట నిర్వహించి ప్రభుత్వ బడిలో చేర్పించేందుకు కృషి చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి పిల్లల వివరాలు సేకరిస్తూ ప్రభుత్వ పాఠశాలలో పైసా ఖర్చు లేకుండా అర్హత ఉన్న ఉపాధ్యాయుల చేత బోధన జరుగుతుందని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి అంటూ బడిబాట జోరుగా సాగుతుంది. ఈ కార్యక్రమాల్లో మండల విద్యాశాఖ అధికారి ఎం. దామోదర్ ప్రసాద్, మండల నోడల్ అధికారి పత్తిపాటి నివేదిత, ఆధ్వర్యంలో అయా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు.

ఎమ్మెల్యే చొరవతో మంచినీటి సమస్య పరిష్కారం

- అభినందనలు తెలుపుతున్న గ్రామస్తులు

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని కిష్టయ్య బంజర గ్రామపంచాయతీ శివారు బ్రహ్మంగారి కాలనీలు ప్రజలు కోరిక మేరకు సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్ట రాగమయ దయానందం చొరవతో బోర్ వేయటం వల్ల మంచినీటి సమస్య పరిష్కారమైంది. దీంతో గ్రామస్తులు ఆదివారం ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. మిషన్ భగీరథ నీళ్ల సరిపోనందున కిష్టయ్య బంజర గ్రామపంచాయతీ కాంగ్రెస్ నాయకులు సత్తుపల్లి శాసనసభ సభ్యులు మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్‌ల దృష్టికి తీసుకుపోగా సహృదయంతో స్పందించి కిష్టయ్య బంజర గ్రామపంచాయతీకి మూడు లక్షల నిధులు మంజూరు చేసి బోరు వేసి మోటర్ బిగించారు. ఈ సందర్భంగా బ్రహ్మంగారి కాలనీ వాసులు మన ఎమ్మెల్యే మట్ట రాగమయి దయానంద్‌కి, మట్ట దయానంద్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిష్టయ్య బంజర్ నాయకులు పసుపులేటి శ్రీనివాసరావు, జంగం నరసింహారావు, మట్ట రామకృష్ణ, శ్రీరాములు, పురుషోత్తమ చారి, పుల్లాచారి, జంగం నరేష్, జనార్దన్‌చారి, పోలోజ్ సత్యం, బ్యాటరీ శీను, నరసింహచారి, ముచ్చర్ల శ్రీను, తిరుమల చారి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో రెజొనెన్స్ విద్యార్థుల ప్రభంజనం

నవతెలంగాణ-ఖమ్మం

దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్ 2024 ఫలితాలలో రెజొనెన్స్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి తమ ఆధిక్యాన్ని చాటుకొన్నారని, రెజొనెన్స్ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని డైరెక్టర్స్ ఆర్‌వి.నాగేంద్రకుమార్, కె. శ్రీధర్‌రావు తెలిపారు. జేఈఈ అడ్వాన్స్‌లో వివిధ కేటగిరిలో ఆల్ ఇండియా ర్యాంక్స్ ఏ.దినేష్ 288, ఏ.జీవన్ కుమార్ 364, ఎల్.ప్రవీన్ 729, డి. లోకేష్ 942, కేశవకుమార్ 1186, బి.జగదీష్ 1533, ఎం.సిద్దార్థ దొర 1984, ఎం.లోహిత్ 2521, కె.అవినాష్ 3288, జి.రాజశ్రీ 7073 వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. ఇంతటి ఘనవిజయం సాధించడానికి పటిష్టమైన ప్రణాళిక, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, భోదనానుభవం కలిగిన మేనేజ్మెంట్ ఈ విజయానికి కారణమని తెలిపారు. ఇంటర్తో పాటే ఐఐటి , నీట్, ఎంసెట్ వంటి అన్ని జాతీయ, రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలకు తగు శిక్షణనివ్వడం వలన ఇంతటి అద్భుత ఫలితాలు సాధించామని తెలిపారు. సాధారణ విద్యార్థులతో సైతం, అత్యుత్తమ ఫలితాలు సాధించామన్నారు. స్కూల్ స్థాయిలో ఐఐటి ఫౌండేషన్ కల్గిన విద్యార్థులతో పాటే, ఇతర విద్యార్థులకు కూడా మంచి ర్యాంకులు సాధించామని తెలిపారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ మూలంగానే ఇంతటి ఘన విజయం సాధించామన్నారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులను, అధ్యాపకులను, తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ సతీష్, భాస్కర్‌రెడ్డి, శాంతి, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-కామేపల్లి



జెడ్పీఎస్ఎస్ ఎంజె.పల్లి 2004-05 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ముచ్చర్ల వెంకటలక్ష్మి ఫంక్షన్ హాల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి జ్ఞాపకాలను స్నేహితులు నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. అదేవిధంగా స్నేహితులు వారి వారి కుటుంబ సభ్యులతో ఈ కార్యక్రమానికి హాజరై వారి పిల్లలతో సరదాగా ఆటలు ఆడుకుంటూ ఉపాధ్యాయులతో విలువైన విషయాలను షేర్ చేసుకుంటూ వారి గత మధురస్మృతులను వేసుకుంటూ చక్కని ఆహ్లాదమైన వాతావరణంలో గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన కర్నాటి నరేష్, గోపీచంద్, ఉదయ్, కోటేశ్వరరావు, అనిల్‌కుమార్, ఉపేందర్, వెంకటేశ్వర్లు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్ష

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండలలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండలంలో మొత్తం మూడు పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. పెద్దతండాలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మొత్తం 480 మందికి, 337 మంది హాజరైయ్యారు. 143 మంది పరీక్షకు గైర్హాజరైయ్యారు. పొన్నేకల్లులోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో మొత్తం 552 మందికి గాను 411 మంది హాజరైయ్యారు. 141 మంది గైరాజరైయ్యారు. సత్యనారాయణపురంలోని దరిపల్లి అనంతరాములు ఇంజనీరింగ్ కళాశాలలో మొత్తం 504 మందికి 389 మంది హాజరుకాగా 115 మంది పరీక్షకు గైర్హాజరైయ్యారు. ఈ పరీక్షా కేంద్రాల్లో పరీక్షా ప్రశాంతంగా ముగిసింది.

నేడు సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశం

నవతెలంగాణ-కూసుమంచి

నేడు మండల కేంద్రంలోని యడవల్లి పద్మారెడ్డి భవనంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ మండల కార్యదర్శి యడవల్లి రమణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, బుగ్గ వీటి సరళ పాల్గొంటారని తెలిపారు. కావున పార్టీ మండల కమిటీ సభ్యులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పేరు మార్పు

నేను **గురమ్మ కంపచాటు,** తండ్రి : వీరస్వామి, నివాసం : ఇ.నెం.5-17/ఇ/1, లీలా సుందరయ్య నగర్, వైరా, ఖమ్మం జిల్లా, తెలంగాణ నా పేరును అన్ని భవిష్యత్తు ప్రయోజనాల కోసం **రమ సంపసాల** గా మార్చుకున్నాను.

మురళి మనవడిని ఆశీర్వదించిన నున్నా



నవతెలంగాణ-నేలకొండపల్లి

సీపీఐ(ఎం) నేలకొండపల్లి పట్టణ కార్యదర్శి మందడపు మురళీకృష్ణ కుమార్తె సాయి నర్మదా వినీత్ దంపతుల కుమారుడి బారసాల నామకరణ మహోత్సవానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర ఐద్వా ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ హాజరై చిరంజీవిని ఆశీర్వదించారు. ఆదివారం స్థానిక శ్రీ వాసవి భవన్లో మందడపు మురళీకృష్ణ మనవడి బారసాల కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా, మండల నాయకులు హాజరై చిరంజీవిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కెవి. రామిరెడ్డి, సీనియర్ నాయకులు రచ్చ నరసింహారావు, ఎటుకూరి రామారావు, అమరబోయిన బిక్షమయ్య, బెల్లం లక్ష్మి, పార్టీ పట్టణ నాయకులు శ్రీదేవి, మున్నంగి లక్ష్మి, సైదమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, వేగినాటి లక్ష్మీ నరసయ్య దోసపాటి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలో పైరవీలకు తావులేదు

- అర్హులైన వారికే పెన్షన్
- అక్రమ పద్ధతిలో పొందిన వాటిని రద్దు చేస్తాం
- తిరుమలాయపాలెం పర్యటనలో మంత్రి పొంగులేటి



నవతెలంగాణ-తిరుమలాయపాలెం

ప్రజా ప్రభుత్వంలో ఎలాంటి పైరవీలకు తావులేదని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అక్రమ పద్ధతిలో పెన్షన్ పొందిన వాటిని రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన వారికే పెన్షన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తిరుమలాయపాలెం మండల పర్యటనలో భాగంగా ఆదివారం తిరుమలయపాలెం, రమణ తండా, బీసరాజుపల్లి, వెదుళ్ళచెర్వు, పిండిప్రోలు, తెట్టలపాడు, కేశవాపురం, తిప్పారెడ్డిగూడెం, అజ్మీరా తండా, జల్లెపల్లి, జోగులపాడు, హైదర్ సాయిపేట, పడమటి తండా, పాతర్లపాడు, గోల్‌తండా, చంద్రు తండా, ఇస్లావత్ తండా, మహ్మదాపురం, కుక్కల తండా, మేకల తండా, దమ్మాయిగూడెం తదితర గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ...తెలంగాణ ప్రజల కష్టఫలితంగానే ఇందిరమ్మ రాజ్యం వచ్చిందన్నారు. రాబోయే మూడు సంవత్సరాల్లో పాలేరు నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ ఇళ్ళ స్థలం, ఇళ్ళు ఇచ్చే బాధ్యత తనదన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అనర్హులు పైరవీలు చేసి పెన్షన్ తీసుకుంటే విచారణ చేపట్టి వాటన్నింటినీ ఆపేస్తామని తెలిపారు. అర్హులైన పేదలకు పెన్షన్ ఇవ్వాలన్నదే ఈ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

రెవెన్యూ అధికారులు గ్రామాల్లో సభలు పెట్టి భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. పరిష్కారం కానీ భూమి సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. ఇళ్ళ పై నుంచి వెళ్లిన హై టెన్షన్ విద్యుత్ లైన్లను కూడా రెండు నెలల్లో మార్పిస్తామని చెప్పారు. వర్షాకాలం సాగుకు చివరి భూముల వరకు నీళ్లు వచ్చే విధంగా అధికారులు చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో మంత్రితో పాటు కాంగ్రెస్ జిల్లా నాయకులు రామ సహాయం నరేష్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ మాజీ చైర్మెన్ మద్దినేని బేబీ స్వర్ణకుమారి, కాంగ్రెస్ జిల్లా నాయకులు చావా శివరామకృష్ణ, ఎంపీపీ బోడ మంగీలాల్ నాయక్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, పోట్ల కిరణ్, ఉన్నం రాజశేఖర్, మేకల సైదులు, తిరుమలాయపాలెం సొసైటీ డైరెక్టర్ చల్లా వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శేషాద్రి, తహసీల్దార్ పీవీ.రామకృష్ణ, మండల వ్యవసాయ శాఖ అధికారి నారెడ్డి సీతారాంరెడ్డి, ఎంపీఓ రాజేశ్వరి, విద్యుత్ శాఖ డీఈ సిహెచ్. నాగేశ్వరరావు, ఏఈ రవికుమార్, ఇరిగేషన్ ఇరిగేషన్ డి ఈ రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చామకూరి శ్రీనివాస్, గుగ్గిళ్ళ అంబేద్కర్, మేకల సత్యనారాయణ, ఖమ్మం కార్పొరేటర్ దొడ్డ నగేష్, దొడ్డ గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



పద్మమ్మకి మంత్రి పొంగులేటి నివాళి

కూసుమంచి : మాజీ ఎంపీపీ రామసహాయం వెంకట్‌రెడ్డి తల్లి పద్మమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం మండలంలోని పోచారం గ్రామం వెళ్లి పద్మమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు స్వర్ణ కుమారి, జొన్నలగడ్డ రవి, జూకూరి గోపాల్‌రావు, మాదాసు ఉపేందర్, పెద్ర అంజయ్య, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ వర్కర్ల వేతనాలు వెంటనే చెల్లించాలి



నవతెలంగాణ-బోనకల్(చింతకాని)

జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న గ్రామపంచాయతీ వర్కర్ల వేతనాలను వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఏరియా కార్యదర్శి కే. శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చింతకాని మండలం గ్రామపంచాయతీ వర్కర్ల సమావేశం మండల పరిధిలో నాగులవంచ గ్రామ పంచాయతీలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూజూన్ 16 ఆదివారం ఐఎఫ్‌టియు ఖమ్మం ఏరియా 5 వ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. గత మూడు సంవత్సరాల్లో వేసిన కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్తులో కార్యక్రమాన్ని రూపొందించుకోవడానికి ఈ మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభలకు గ్రామపంచాయతీ కార్మికుల అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లను, డ్రైనేజీని శుభ్రపరుస్తూ రాష్ట్రాన్ని ఆదర్శ రాష్ట్రంగా గుర్తింపు తెచ్చినటువంటి కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అనుసరిస్తుందని విమర్శించారు. గత 5 నెలలు నుంచి జీతాలు చెల్లించడం లేదని, బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. లేనియడల రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ వర్కర్స్‌ను ఐక్యపరిచి ఆందోళన నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఐఎఫ్టియు మండల నాయకులు అమర్లపూడి అప్పారావు, ఆడపు కోటేశ్వరరావు, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, బాష, జయ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



జేఈఈ అడ్వాన్స్‌లో హార్వెస్ట్ ఉన్నతశ్రేణి ఫలితాలు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని హార్వెస్ట్ విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ ఫలితాలు ఉత్తమ శ్రేణి ఫలితాలు సాధించారని హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి. రవి మారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతిరెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ విశ్వవిద్యాలయాల్లో ఇంజనీరింగ్ విద్యనభ్యసించుటకు కేంద్ర విద్యా శాఖ ఎన్‌టిఏ ఆధ్వర్యంలో నిర్వహించే జేఈఈ అడ్వాన్స్ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు వి.జస్వంత్ 94 ఆల్ ఇండియా కేటగిరీలో ర్యాంకు సాధించడం జరిగిందన్నారు. ఏ.గోపీచంద్ 161 ,కే మనోహర్ చౌహాన్ 337, డి సంతోష్ 433, ఎన్ తపస్వి 873 ,బి. శరన్ మేఘ 878, బి. హైందవీ రాథోడ్ 888, వి .విష్ణు తేజ 1134, ఎం. ధీరజ్ కుమార్ 1721, టి. స్పందన 1238, బి .పావన లక్ష్మి 1244, సాధించగా, ఓపెన్ బైపీసీ విద్యార్థి ఏ విగ్నేష్ కృష్ణ ప్రసాద్ 2876 ,జి రాజు వర్ధన్ 4589, ఎన్ అనీష్ 8180, వి. సత్యత థాగత్ 14,873, ఆర్. సాయి సంజీవ్ 16963, ఎం లోకేష్ సాయి 4024 (ఓబిసి), టి అభినవ్ 16963 ఆల్ ఇండియా ర్యాంకులు సాధించారని తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని కళాశాలలో విద్యాసంస్థల కరస్పాండెంట్ రవి మారుతితో, ప్రిన్సిపల్ ఆర్ .పార్వతిరెడ్డి విద్యార్థులను అభినందించారు.

'ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి'



నవతెలంగాణ-ఖమ్మం

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మెన్ డాక్టర్ కెవి. కృష్ణారావు అన్నారు. ఆదివారం ఖమ్మంలోని ఖమ్మం మయూరి సెంటర్ అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమ కారులకి ఇచ్చిన హామీలు 250 గజాల ఇంటి స్థలం, నిజమైన తెలంగాణ ఉద్యమ కారులను గుర్తించ టానికీ ఒక కమిటీ ఏర్పాటు చేయాలని, అమర వీరుల కుటుంబాలన్నింటిని ఆదుకోవాలని, తెలంగాణ ఉద్యమ కారుల అందరికి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బచ్చల పద్మచారి, పెళ్లూరి విజయ్‌కుమార్, నేలవెళ్లి వెంకటేశ్వరావు, భూక్యా రాంబాబునాయక్, అర్వపల్లి విద్యాసాగర్, అబ్బాస్ అలీ, బాలిన భాస్కర్‌రెడ్డి, భూక్యా శ్రీనివాస్ నాయక్, పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్, బట్టు రాజేంద్ర నాయక్, కోడి రెక్క ఉమాశంకర్, బొబ్బిలి భరత్ చంద్ర, సర్దార్, గుంతేటి వీరభద్రం, దొడ్డ శ్రీనివాస్‌రెడ్డి, రెడ్డి బోయిన వరలక్ష్మి, ఉదయ్ భాస్కర్, జోకు పర్తి రాజా, అనంత లక్ష్మి, ఏక లక్ష్మి, కృష్ణ వేణి, పద్మ స్వరూప తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాగమయి దంపతులకు సన్మానం

నవతెలంగాణ-సత్తుపల్లి

ఇటీవల జరిగిన ఖమ్మం పార్లమెంట్ ఎన్నికలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు రామసహాయం రఘురాంరెడ్డి, తీన్మార్ మల్లన్నలకు సత్తుపల్లి నియోజకవర్గం నుంచి అత్యధికంగా మెజార్టీ రావడానికి కృషిచేసి సఫలీకృతులైన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్‌లను సత్తుపల్లి పట్టణ ప్రయివేట్ స్కూల్స్ యాజమాన్య బాధ్యులు అభినందించారు. ఆదివారం వీరంతా ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి అభినందనలు తెలుపుతూ ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరెసా టెక్నో, వీవీ, టాలెంట్, విశ్వశాంతి, గీతాంజలి పాఠశాలలకు చెందిన యాజమాన్య బాధ్యులు నాయుడు వెంకటేశ్వరరావు, ఒగ్గు భగవాన్‌రెడ్డి, పులి శ్రీనివాసరావు, పసుపులేటి నాగేశ్వరరావు, నరుకుళ్ల సత్యనారాయణ, చీకటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'నీట్ పరీక్ష నిర్వహణ, ఫలితాలపై విచారణ జరిపించాలి'



నవతెలంగాణ-ఖమ్మం

నీట్ పరీక్ష నిర్వహణ, ఫలితాలపై విచారణ జరిపించాలని, అదేవిధంగా అవకతవకలు లేకుండా మళ్ళీ నీట్ పరీక్ష నిర్వహించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మంలోని రామ నరసయ్య కేంద్రాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్, దేశ వ్యాప్తంగా మెడికల్ కోర్సులు, దంత వైద్యవిద్యా కోర్సులు చదవాలనుకునే 24 లక్షల మంది విద్యార్థులు మే 5న ప్రవేశ పరీక్ష రాశారని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నీట్ యూజీ- 2024 పరీక్షను సక్రమంగా నిర్వహించకపోవడం మూలంగా విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. గతంలో ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణలు జరగడం, ఇప్పుడు మార్కుల్లో అవకతవకలు విడుదల చేసిన ఫలితాలలో 67 మంది విద్యార్థులకు ఫస్ట్ ర్యాంక్ రావడం వారిలో ఎనిమిది మందిది ఒకే కేంద్రం కావడం గమనార్హంగా ఉందన్నారు. గతంలోనే సుప్రీంకోర్టు నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలను సమీక్షించడం కోసం సుప్రీంకోర్టు అంగీకారం తెలిపిందని, నీట్ ఫలితాలను 14 వ తేదీన విడుదల చేయాల్సి ఉండగా ఎన్‌టిఏ హఠాత్తుగా లోక్సభ ఫలితాలు వెలువడిన ఈనెల 4 వ తేదీనే అంటే పది రోజుల ముందే విడుదల చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. యావత్ మీడియా దేశం దృష్టి లోక్ సభ ఎన్నికల ఫలితాల మీద ఉన్న సమయంలో ఎన్ టి ఏ ఇలా చేయడం వలన లక్షలాది మంది విద్యార్థుల తల్లిదండ్రులను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. తక్షణమే నీట్ పరీక్ష రాసిన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపి మరోసారి నీట్ పరీక్ష నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలనీ డిమాండ్ చేశారు. లేని యెడల పీడీఎస్ యూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, నాయకులు విష్ణు, స్టాలిన్ నరేందర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ యూజీ పరీక్ష రద్దు చేయకుంటే బీజేపీ ప్రజా ప్రతినిధుల ఇండ్లను ముట్టడిస్తాం

పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్

నీట్ యూజీ 2024 పరీక్ష రద్దు చేయకుంటే బీజేపీ ప్రజా ప్రతినిధుల ఇండ్లను ముట్టడిస్తామని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మస్తాన్ అన్నారు. ఆదివారం ఖమ్మంలోని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యక్రమంలో పిడిఎస్‌యు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షలో అవకతవకలు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ వైఫల్యమేనని దేశవ్యాప్తంగా వస్తున్న విద్యార్థుల ఆందోళనలను దృష్టిలో పెట్టుకొని పరీక్షను వెంటనే రద్దుచేసి తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నూతనంగా ఎన్నికైన బిజెపి ఎంపి, కేంద్ర మంత్రుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు రామకృష్ణ, ఉదయ్, విష్ణు, భాను పాల్గొన్నారు.

అండర్ డ్రైనేజీ నిర్మాణం కోసం 128 కోట్లు కేటాయించడం చారిత్రాత్మకం

నవతెలంగాణ-మధిర

మధిర మున్సిపాలిటీలో అండర్ డ్రైనేజీ నిర్మించడం కోసం మధిర ఎమ్మెల్యే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క 128 కోట్లు మంజూరు చేయటం చారిత్రాత్మకమైన విషయంగా కౌన్సిలర్లు మల్లాది వాసు సవితలు పేర్కొన్నారు. అనేక సభల్లో మల్లు భట్టి విక్రమార్క మధిర నా ప్రాణం అంటూ సందర్భం వచ్చినప్పుడల్లా చెబుతూ ఉంటారన్నారు. దీనికి తగ్గట్టే తెలంగాణ రాష్ట్రంలో ఏ మున్సిపాలిటీకి ఇప్పటివరకు కేటాయించని నిధులు మధిర మున్సిపాలిటీ అండర్ డ్రైనేజీ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయటం పట్ల మల్లాది వాసు సవిత దంపతులు హర్షం వ్యక్తం చేశారు.

జేఈఈ అడ్వాన్స్ - 2024 ఫలితాల్లో వెలాసిటీ విజయకేతనం

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో వెలాసిటి విద్యార్థి అల్ ఇండియా ర్యాంకును సాధించాడు. టి.వినిత్ కుమార్ 9562 ర్యాంకును సాధించి ఇండియాలోనే మెరుగైన కళాశాలలో చేరేందుకు అర్హత సాధించాడు. అత్యుత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థి టి.వినిత్ కుమార్ ను అకడమిక్ డీన్ మహ్మద్ యాకూబ్, చైర్మన్ శెట్టి లక్ష్మణ్ రావు, సెక్రటరీ, కరస్పాండెంట్ మల్లోలు రవి, ప్రిన్సిపాల్స్ శ్యామ్, సిహెచ్. వెంకట్, కళాశాల అధ్యాపక బృందం అభినందించింది.



జూనియర్ సివిల్ జడ్జి అభ్యర్థులకు మోడల్ టెస్ట్

నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా అల్ ఇండియా లాయర్ యూనియన్ (ఏఐఎల్‌యూ) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఏఐఎల్‌యూ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జూనియర్ సివిల్ జడ్జి అభ్యర్థులకు మోడల్ టెస్ట్‌ను ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎల్‌యూ కేంద్ర కమిటీ మెంబెర్ ఏడునూతల శ్రీనివాసరావు, తెలంగాణా రాష్ట్ర కమిటీ కార్యదర్శి మందడపు శ్రీనివాసరావు, మీసాల వెంకటేశ్వర్లు, ఖమ్మం జిల్లా కమిటీ అధ్యక్షులు నల్లమల నవీన్ చైతన్య, కార్యదర్శి చింతనిప్పు వెంకట్, ఏఐఎల్‌యూ నాయకులు జక్కంపూడి నాగేశ్వరరావు, తన్నీరు పాపయ్య, రామలక్ష్మి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

రామోజీరావు మృతికి కమ్మ జన సేవ సమితి నివాళి

నవతెలంగాణ-వైరాటౌన్

ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతికి వైరా కమ్మ జన సేవ సమితి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కమ్మ జన సేవా సమితి అధ్యక్షులు చింతనిప్పు వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు కట్టా కృష్ణార్జునరావు, సూర్యదేవర శ్రీధర్, శ్రీరామనేని విజయభాస్కర్, కర్నాటి హనుమంతరావు, మేదరమెట్ల శ్రీనివాస రావు, చావా శ్రీనివాసరావు, పొడపాటి నాగేశ్వరరావు, ఏనుగు హనుమంత రావు, సూర్యదేవర శ్రీమంత్, మాడపాటి కిషోర్, బండారుపల్లి రవి, తోటకూర శ్రీకాంత్, పరుచూరి రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు గిరిజన సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశం

నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణ గిరిజన సంఘం ఖమ్మం జిల్లా విస్తృతస్థాయి సమావేశం సోమవారం ఖమ్మం త్రీ టౌన్ ప్రాంతంలో కార్మిక భవన్‌లో జరుగుతుందని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారం కోసం ఆందోళన పోరాటాలు సంఘ నిర్మాణంతో పాటు గిరిజలకు విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగాల కోసం సమావేశంలో చర్చించి భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లా కమిటీ సభ్యులు, ఆహ్వానితులు అందరూ ఉదయం 10 గంటలకల్లా హాజరుకావాలని కోరారు.ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం ధర్మనాయక్, ఆర్ శ్రీ రాం నాయక్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, బానోతు బాలాజీ, భూక్యా వీరభద్రం పాల్గొంటారని తెలిపారు.

నేడు ప్రజావాణి

- అధికారులు సమయానికి రావాలి
- కలెక్టర్ ప్రియాంక అల



నవతెలంగాణ-కొత్తగూడెం

నేడు కలెక్టరేట్ సమావేశపు హాలులో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ ప్రియాంక అల తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, సమస్యలపై ఫిర్యాదులు అందచేయు ప్రజలు ఉదయం 9.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమానికి విచ్చేసి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా దరఖాస్తులు అందచేయాలని కలెక్టర్ కోరారు.

రామకృష్ణాపురంలో బడిబాట

నవతెలంగాణ-దుమ్ముగూడెం



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బడి బాటలో భాగంగా నర్సాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బొల్ల వెంకటేశ్వర్లు ఉత్తర్వుల మేరకు ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ఆదివారం నర్సాపురం కాంప్లెక్స్ పరిధిలోని రామకృష్ణాపురం, సింగవరం బండారుగూడెం తూరుబాకలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. టీం లీడర్‌గా బెక్కంటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎస్.కృష్ణ, ఏ.నాగేశ్వరరావు, పన్నాలాల్, లక్ష్మి, రామకృష్ణాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. బడి బాటలో భాగంగా రామకృష్ణ గ్రామంలో ఇంటి ఇంటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే అనేక కార్యక్రమాలను కరపత్రములలో ముద్రించి ప్రతి ఇంటింటికీ పంపిణీ చేశారు. టీం లీడర్ బెక్కంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ బడి ఈడు గల పిల్లలందరూ బడిలో ఉండాలని ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలను పనులకు తీసుకుపోవద్దని తల్లిదండ్రులకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థినీ, విద్యార్థులు, విద్యా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి ఇల్లందు మర్కోడుకు బస్ ప్రారంభం

- డిపో మేనేజర్ బాణాల

నవతెలంగాణ-ఇల్లందు

ఇల్లందు బస్ స్టేషన్ నుండి ఉదయం 07:30కు మరలా మధ్యాహ్నం 02:30 నిమిషాలకు మర్కోడుకు బస్ సర్వీస్ ప్రారంభిస్తున్నట్టు డిపో మేనేజర్ బాణాలు వెంకటేశ్వర రావు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మర్కోడు నుండి ఇల్లందుకు ఉదయం 09:30 మరలా సాయంత్రం 04:30కు సర్వీసు ఇల్లందు వరకు నడుపబడునని తెలిపారు. మర్కోడు, ఇల్లందు పరిసర ప్రాంతాల గ్రామ ప్రజలు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-కొత్తగూడెం



బీఎస్పీ లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడుగా రేగళ్ల పెద్ద తండాకు చెందిన గుగులోతు వెంకటేశ్వర్లును జిల్లా అధ్యక్షులు గంధం మల్లికార్జునరావు ఆదివారం నియమించారు. ఈ సందర్భంగా గూగులోతు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం మండలంలోని అన్ని గ్రామాలలో పర్యటించి పూర్తిస్థాయి బూత్ కమిటీల నియామకం చేస్తానని అదేవిధంగా త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని అన్ని పంచాయతీలలో బీఎస్పీ గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. రేగళ్ల గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న పట్టాల సమస్యకు ప్రజలను మమేకం చేసి దశల వారి ఆందోళన కార్యక్రమాలు చేస్తానని, తనపై నమ్మకంతో మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్, జిల్లా అధ్యక్షులు గంధం మల్లికార్జున రావులకు ధన్యవాదాలు తెలిపారు. అధ్యక్షుడిగా నియమితులైన ఆయనను నాగుల రవికుమార్, మాలోతు వీరు నాయక్, వినయ్, జార్పుల అశోక్, తాటిపాముల హరికృష్ణ తదితరులు అభినందనలు తెలిపారు.

మాలకొండయ్య నూతన హాస్పిటల్ ప్రారంభం

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు పరిసర ప్రాంత ప్రజలకు ఉత్తమ వైద్యం అందించే విదంగా మండలంలోని అశోక్ నగర్ గ్రామంలో ఏర్పాటు ఏర్పాటు చేసిన మాలకొండయ్య నూతన హాస్పిటల్‌ను పినపాక శాసనసభ్యుల పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాయంను శాలువాతో సన్మానించి పూల బొకే అందించారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి నూతన హాస్పిటల్‌ను ప్రారంభించారు. హాస్పిటల్ యాజమాన్యానికి పాయం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నవీన్, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు, పాల్గొన్నారు.



ప్రశాంతంగా ముగిసిన
గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

- కలెక్టర్ ప్రియాంక అల
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ



పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

నవతెలంగాణ-కొత్తగూడెం

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయని, జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్ల నడుమ నిర్వహించామని కలెక్టర్ ప్రియాంక అల తెలిపారు. ఆదివారం ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించామన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 8875 మందికి గాను 21 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 8875 మంది అభ్యర్థులకు గాను 6649 మంది పరీక్షకు హాజరైనారని, 2222 మంది అభ్యర్థులు గైహాజరైనరని తెలిపారు. మొత్తంగా 74.95 శాతం హాజరుగా నమోదు అయిందని తెలిపారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ రోహిత్ రాజు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివారం ఉదయం 10 గంటల నుండి ప్రారంభమైన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నేపథ్యంలో ఎస్పీ రోహిత్ రాజు పలు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుజాతనగర్, వేపలగడ్డలోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల నందు ఏర్పాటు చేయబడిన పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ విధులలో ఉన్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కొత్తగూడెం, పాల్వంచలోని 21 పరీక్షా కేంద్రాలలో ప్రశాంతంగా ఈ పరీక్ష కొనసాగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేస్తూ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఏలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు ముగిసినట్లు ఎస్పీ వెల్లడించారు.

సింగరేణి ఉద్యోగాల నోటిఫికేషన్‌లలో సర్దుబాటు

- జూన్ 10నుండి దరఖాస్తులు
- ఈ నెల 29 ఆఖరు తేదీ



నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి కాలరీస్ కంపెని సంస్థ విడుదల చేసిన ఉద్యోగ నోటిఫికేషన్‌ల దరఖాస్తుల స్వీకరణకు స్వల్ప మార్పులు చేసినట్టు సింగరేణి యాజమాన్యం ప్రకటన విడుదల చేసింది. 15 మార్చి 2024న నోటిఫికేషన్ ద్వారా సంస్థలో పలు ఉద్యోగాల ఖాళీలు ప్రకటించి, దరఖాస్తులు ఆహ్వానించింది. మేనేజ్ మెంట్ ట్రైనీ, (ఇ అండ్ ఎం), మేనేజ్ మెంట్ ట్రైనీ (సిస్టమ్స్), జె.ఎం.ఇ.టి, అసిస్టెంట్ ఫోర్ మెన్ ట్రైనీ (ఎలక్ట్రికల్), అసిస్టెంట్ ఫోర్ మెన్ ట్రైనీ (మెకానికల్), ఫిట్టర్ ట్రైనీ, ఎలక్ట్రీషియన్ ట్రైనీ ఉద్యోగాలలోని ఖాళీలు భర్తీచేయుటానికి అర్హులైన అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ ధరఖాస్తులు కోరారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అభ్యర్థులను కోరారు. ఆన్ లైన్ అప్లికేషన్లు స్వీకరన జరుగుతుందని సింగరేణి సంస్థ ప్రకటించింది. కానీ, ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో సాంకేతిక సమస్యలు చోటు చేసుకుంది. ఆ సమస్యలు తలెత్తడంతో ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ వాయిదా పడింది. సాంకేతిక సమస్య పరిష్కరించిన నేపద్యంలో సింగరేణి సంస్థ నోటిఫికేషన్‌లో ప్రకటించిన విధంగా ఉద్యోగాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి సింగరేణి ఆన్‌లైన్ పోర్టల్ సర్దుబాటు చేశారు. ఈనెల10 మధ్యాహ్నం 12.00 గంటల నుండి తిరిగి ప్రారంభించడం జరిగిందని, కావునా అభ్యర్థులు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసు కొనుటకు ఆఖరు తేదీ ఈ నెల 29 వరకు పొడిగించబడింది. కావున నేటి నుంచి 29 సాయంత్రం 5 గంటల వరకు నోటిఫికేషన్‌లో తెలిపిన విధంగా ఉద్యోగాల కోసం ధరఖాస్తు చేసుకోగలరని సింగరేణి జీఎం పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్‌సి బీఆర్.దీక్షితులు తెలిపారు.

ఎమ్మెల్సీ మల్లన్న గెలుపు కాంగ్రెస్ పార్టీకి కొత్త ఊపు

- మల్లన్నను అభినందించిన నాగా సీతారాములు



నవతెలంగాణ-కొత్తగూడెం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఐ, సీపీఐ(ఎం), టీజెఎస్ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గెలుపుతో కాంగ్రెస్ పార్టీకి కొత్త ఊపు అందుకుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల కో-ఆర్డినేటర్, టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలసిన నాగా సీతారాములు ఆయనికి బొకే అందిచి శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగా సీతారాములు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీగా మల్లన్న గెలుపు కాంగ్రెస్ గెలుపుతో పార్టీలో ఉత్తేజాన్ని నింపిందన్నారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాగా సీతారాములు చేసిన ప్రచారం తనకు తెలుసనీ, కార్యకర్తలు పిలిస్తే పలికే నాయకుల్లో ఆయన ఒకరని తెలిపారు. ఎమ్మెల్సీగా తన గెలుపులో సీతారామన్న కృషిని తాను మరువలేనంటూ తీన్మార్ మల్లన్న ఆత్మీయ ఆలింగనం చేసుకొని సన్మానం చేశారు.

బేర శ్రీలక్ష్మికి నారిశక్తి అవార్డు

నవతెలంగాణ-పాల్వంచ



జనహిత ఫౌండర్ చైర్మెన్ డాక్టర్ బేర శ్రీలక్ష్మికి నారిశక్తి అవార్డు దక్కింది. ఈ మేరకు జూన్ 9న హైద్రాబాద్ రవీంద్రభారతిలో నారీశక్తి అవార్డు ప్రధానం చేశారు. జీసీఎస్ వల్లూరి ఫౌండర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రముఖ న్యూమరాలజీ సంఖ్యా శాస్త్ర నిపుణులు దైవజ్ఞ శర్మ, పట్టణ ప్రముఖల చేతి మీదగా అవార్డ్ అందుకున్నారు. ఒక్క మహిళగా అన్ని రంగాలలో ముందు ఉంటూ అటు కోలాటం, ఫౌండేషన్ వ్యవస్థాపకులుగా సమాజానికి తనవంతు కృషి చేస్తున్న సామాజిక కళలను కాపాడుతూ తన వంతు కృషి చేస్తున్న శ్రీలక్ష్మిని అభినందిస్తూ ఈ అవార్డు ప్రధానం చేసినట్టు ఆమె తెలిపారు. నారిశక్తి అవార్డు దొరకడం పట్ల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాళ్ల బండి కృష్ణమూర్తి శుభాకాంక్షలు తెలియజేశారు.

గూడెం అభివృద్ధికి కృషి చేద్దాం

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం అభివృద్ధికి మరింత కృషి చేయాల్సి ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం కొత్తగూడెం సీపీఐ జిల్లా కార్యాలయంలో కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యేతో కలిసి నడిచేందుకు పలువురు మున్సిపల్ కౌన్సిలర్స్ సీపీఐలో చేరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా సారథ్యంలో 12వ వార్డు కౌన్సిలర్ కూరపాటి విజయలక్ష్మి, 19వ వార్డు కౌన్సిలర్ బండి నరసింహా తోపాటు పలు కుటుంబాలు సిపిఐలో చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీలోకి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషాలు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, యూనియన్ నాయకులు వంగ వెంకట్, రమణ మూర్తి, సిపిఐ వార్డు కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్య శ్రీనివాస్, యూసఫ్ మాచర్ల శ్రీనివాస్, చారి, విజయ్, దుర్గా కళ్యాణి, సిపిఐ నాయకులు బత్తుల సురేష్, అజీజ్, నేరెళ్ల రమేష్, లగడపాటి రమేష్ చంద్ర, గుత్తుల శ్రీనివాస్, మిర్యాల రాము, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫాహిం, అస్లాం, గోపి, ఎరుకల రామారావు, తదితరులు ఉన్నారు.

కాలుష్య ప్రభావం...తప్పదు భారీ మూల్యం

బూడిదతో బుగ్గిపాలు అవుతున్న ప్రభావిత గ్రామాలు

- కాలుష్య ప్రభావాన్ని తక్కువగా చూపుతున్న టీఎస్ పీసీబీ అధికారులు
- అలుపెరగని పోరాటం చేస్తున్న పర్యావరణ ప్రేమికులు





నవతెలంగాణ-పాల్వంచ రూరల్

రాష్ట్రం మొత్తానికి వెలుగులు విరజిమ్మే కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ ఆ పరిశ్రమ పరిసర గ్రామాల్లో మాత్రం బూడిద నింపి అక్కడి ప్రజల జీవితాల్లో కారు చీకట్లు కమ్ముకునేలా చేస్తుంది అనటంలో అతిశయోక్తి లేదని బాధిత ప్రజలు వాపోతున్నారు. కేటీపీఎస్ పరిసర ప్రాంతాల్లో నీరు బూడిద, వ్యవసాయ భూమి బూడిద, గాలి బూడిద, సూరారం, పునుకుల, పుల్లాయిగూడెం పరిసర ప్రాంతాల్లో వందల ఎకరాలలో బూడిద చెరువులు ప్రత్యక్షం కావడంతో భూగర్భ జలాలు కూడా బూడిదమయం అయిపోయి కాలుష్యం విలయతాండవం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కేటీపీఎస్ నుండి కాలుష్యం మోతాదుకు మించి వెలువడుతున్నా కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డుకు నివేదికలు పంపే సమయంలో కాలుష్యం తక్కువగా ఉన్నట్లు లెక్కలు చూపిస్తున్నారని కేటీపీఎస్ కాలుష్య ప్రభావిత గ్రామాల ప్రజలు బహాటంగానే చర్చించుకుంటున్నారు. ఏడవ దశ నిర్మాణ అనుమతి సమయంలో స్థానికుల నుండి తీవ్ర వ్యతిరేకత ఏర్పడడంతో టీఎస్ పీసీబీ, ఎంఓఈఎఫ్ ఆదేశాలతో రూ.60 లక్షల ఖర్చు చేసి కేటీపీఎస్ అధికారులు ఆన్లైన్ అంబి ఎన్ట్ ఎయిర్ క్వాలిటీ మో నీటరింగ్ పరికరాన్ని అమర్చారు. అయినా ఫలితం మాత్రం శూన్యం అని అనుకుంటున్నారు.

నాసిరకం బొగ్గు ఉపయోగం వల్లనే నా...

కేటీపీఎస్‌లో విద్యుత్ ఉత్పాదనకు ఉపయోగించే బొగ్గును అధికారులు నాసిరకం బొగ్గును ఉపయోగించడం వల్లనే దానివల్ల వెలువడే బూడిదతో ఆ ప్రాంతాల్లో వాయు జల కాలుష్యం అధికమవుతుందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. పేరుకు సూపర్ క్రిటికల్ అయినా..నిత్యం నల్లటి పొగతో పాటు ఈ ప్రాంతంలో బూడిద కమ్ముకుంటుంది. బొగ్గు సీడీఈ, ఎఫ్ రకాలు ఉండగా కేటీపీఎస్‌లో మాత్రం నాసిరకం బొగ్గుకే ప్రాధాన్యం ఇస్తున్నారని పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. కేటీపీఎస్ ఐదవ దశలో సంవత్సరానికి 28,17,460 మెట్రిక్ టన్నుల బొగ్గును వాడుతుండగా... ఆరవ దశకు 18,87,065 మెట్రిక్ టన్నుల బొగ్గును వినియోగిస్తున్నారు. బొగ్గు నుండి బూడిద 48.18 శాతం విడుదల అవుతుండగా సల్ఫర్ 5వ దశలో 0.31 శాతం, 6వ దశలో 0.10 శాతం ఉన్నట్లు గతంలో కేటీపీఎస్ అధికారులే పేర్కొనడం విశేషం.

కాలుష్యంతో ప్రజల అనారోగ్యం

కాలుష్య ప్రభావం తీవ్రస్థాయిలో వెలువడుతుండటంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. బూడిద నీరు తాగిన పశువులు అనారోగ్యం పాలవుతున్నాయి. వ్యవసాయ అవసరాలకు బూడిద నీరు ఉపయోగించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. కేటీపీఎస్ నుండి వెలువడుతున్న కాలుష్యానికి తగ్గట్టుగా నియంత్రించే చర్యలు యాజమాన్యాలు మాత్రం చేపట్టడం లేదు. కనీసం తాత్కాలిక చర్యలు కూడా తీసుకోవడం లేదని బాధిత గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. కాలుష్య ప్రభావిత ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాల్సి ఉండగా, తూతూ మంత్రంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. కాలుష్యం వల్ల తామంతా రోగాల బారిన పడుతున్నామని వైద్యం కోసం లక్షలు ఖర్చు చేస్తున్నామని ప్రజలు కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఇప్పటికైనా కాలుష్య ప్రభావిత గ్రామాలకు తగిన న్యాయం చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కాలుష్య ప్రభావిత గ్రామాలకు న్యాయం చేయాలి

దాసరి రమేష్, సామాజిక సేవా కార్యకర్త

కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఇప్పటికైనా స్పందించి కేటీపీఎస్ నుండి వెలువడే బూడిద కాలుష్యాన్ని తగ్గించి, కాలుష్య ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు అన్ని విధాలుగా తగిన న్యాయం చేయాలి. కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలి.

నేటి తరం యువతకి
భగవాన్ బిర్సా ముండా జీవితం ఆదర్శం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భగవాన్ బిర్సా ముండా 124వ వర్ధంతి సందర్భంగా భద్రాచలం ఆదివాసీ సమితి బీఏఎస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పాత మార్కెట్‌లోని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సంఘం ముఖ్య సలహాదారు పూనెం వీరభద్రం మాట్లాడారు. భగవాన్ బిర్సా ముండా అతి చిన్న వయసులోనే ఆదివాసీ ముండా జాతిని చైతన్య పరిచి ఝార్కండ్, బీహార్ ప్రాంతాలో బ్రిటీష్ వారిపై స్వాతంత్ర పోరాటం చేసి 22 సంవత్సరాలకే మరణించడం జరిగిందని, వారి పోరాట పటిమ నేటి తరం యువతకి ఎంతో ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.

అదేవిధంగా సంఘం సీనియర్ నాయకులు కుంజా ధర్మా మాట్లాడుతూ....బిర్సా ముండా 1875-1900 మొదటి తరం స్వాతంత్ర్య సమరయోధుడు, భారతీయ అటవీ తెగల జానపద నాయకుడు. అతను ముండా జాతికి చెందినవాడని తెలిపారు. 19వ శతాబ్దపు చివరిలో ప్రస్తుత బీహార్, జార్కండ్ అడవులలో అతను బ్రిటిష్ కాలంనాటి మిలీనేరియన్ ఉద్యమానికి నాయకత్వం వహించాడన్నారు. అతను 22 సంవత్సరాల వయస్సులో బ్రిటిష్ వారిపై యుద్ధం ప్రకటించాడని, 1897 తద్వారా భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ప్రముఖ వ్యక్తిగా నిలిచాడు. అతని గౌరవార్థం భారత పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో అతని చిత్రపటం ఉందన్నారు. ఈ విధంగా గౌరవించబడిన ఏకైక ఆటవిక నాయకుడు బిర్సా ముండా అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు పూనెం కృష్ణ దొర, అడ్వకేట్ పాయం రవివర్మ, ఆదివాసి మహిళా చైతన్య శక్తి ఉపాధ్యక్షురాలు కొండ్రు సుధారాణి, ఏఈడబ్ల్యూసిపి రాష్ట్ర నాయకులు కొండ్రు వీరాస్వామి, గిరిజన మోర్చ నాయకులు పాయం వెంకయ్య, సంఘం సభ్యులు చిచ్చడి సత్యనారాయణ మూర్తి, ఇర్పా శ్రీనివాస్, అదిలాబాద్ జిల్లా తుడుందెబ్బ నాయకులు, ఆదివాసి నాయకులు, మహిళలు హాజరై నివాళులు అర్పించారు.

హక్కుల రక్షణ కోసం పోరాటాలకు సిద్ధం కావాలి

- ఐఎఫ్‌టీయూ మహాసభలో వక్తల పిలుపు

నవతెలంగాణ-ఇల్లందు

మెరుగైన జీవనం కోసం, హక్కుల రక్షణ కోసం కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలని మాజీ శాసనసభ్యులు, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర నాయకులు గుమ్మడి నరసయ్య, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్.మధుసూదన్ రెడ్డి, షేక్.యాకుబ్ షావలి కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఆదివారం భారత కార్మిక సంఘాల సమైక్య (ఐఎఫ్టియు) ఇల్లందు ఏరియా ఐదవ,మహాసభ, ప్రాంగణానికి, అమరులు రాపర్తి ఎల్లయ్య కుమ్మరి కుంట్ల ముకుందం నామకరణం చేశారు అనంతరం మల్లెల వెంకటేశ్వర్లు అధ్యక్షత జరిగిన సభలోవారు పాల్గొని మాట్లాడారు.

ముందు తరాల కార్మిక వర్గం పోరాడి, రక్త తర్పణ చేసి హక్కులు సాధిస్తే, నేటి పాలకులు హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలలో కాంట్రాక్టీకరణ, ప్రైవేటీకరణను పెంచి పోషిస్తూ పర్మినెంట్ కార్మికులు చేయవలసిన స్థానాలలో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులను నియమించుకొని తక్కువ వేతనాలు చెల్లిస్తూ కార్మికుల శ్రమను కారు చౌకగాదోచుకుంటున్నారని, పర్మినెంట్ కార్మికుల సంఖ్యను తగ్గిస్తూ, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికుల సంఖ్యను పెంచుతున్నారని విమర్శించారు. ఈ మహాసభలో, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నేత వై.గోపాలరావు, మోటర్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పాయం వెంకన్న, మాజీ కౌన్సిలర్ రేసు సరిత, ఐఎఫ్టియు నాయకులు వీరన్న, గురునాథం, రఘు, గూగుల్ లక్ష్మణ్, బోళ్ల సీతారాములు, సిహెచ్ కుమార్, బాలుచౌహన్ నరేష్, మహమ్మద్ రఫీ, రాజు, ఈసాల వెంకన్న గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల్లో ప్రజల ఆదరణ

- విజయం చేకూర్చిన ఓటర్లకు కృతజ్ఞతలు
- ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-ఇల్లందు

ఇటీవల జరిగిన ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ విజయాలతో గెలిపించిన ఓటర్లకు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మెన్ డివి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహబూబాబాద్ ఎంపీగా బలరాం నాయక్, నల్గొండ, ఖమ్మం, వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్నను గెలిపించడం మరువలేని విషయం అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు ఇప్పించడానికి కృషి చేస్తామన్నారు. వీటితోపాటు నియోజకవర్గంలోని ఐదు మండలాలు, ఇల్లందు మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలను వేగిరం చేస్తామన్నారు. ఈ సమావేశంలో పట్టణ మండల అధ్యక్షులు డానియల్, పులి సైదులు, వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్ కోరి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు మండల రాము, కాంగ్రెస్ పార్టీ నేతలు సాంబమూర్తి, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

కష్టజీవుల కన్నీటి బాధలు పోవాలని ఎర్రజెండా ఎత్తిన పొట్టయ్య

- ఆయన మృతి విప్లవ కార్మికోద్యమానికి లోటు
- మాస్ లైన్ రాష్ట్ర నేత గుమ్మడి



నవతెలంగాణ-ఇల్లందు

హమాలి కార్మిక ఉద్యమంలో అలు పెరుగని కార్మిక నాయకుడు, కష్టజీవుల కన్నీటి బాధలు పోవాలని ఎర్రజెండా ఎత్తిన ఇర్పపొట్టయ్య మృతి కార్మికోద్యమానికి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే మాస్ లైన్ రాష్ట్ర నేత గుమ్మడి నరసయ్య, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు జే.సీతారామయ్య అన్నారు. ఆదివారం మండలంలోని వేపల్లగడ్డ గ్రామంలో ఇర్ప పొట్టయ్య సంస్మరణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఇల్లందు మండల కార్యదర్శి మోకాళ్ళ రమేష్ అధ్యక్ష వహించారు. తొలుత పొట్టన్న చిత్రపటం వద్ద పూలు వేసి నివాళి అర్పించిన అనంతరం సభ నిర్వహించారు. 40 సంవత్సరాలు హమాలి కార్మికుడిగా పనిచేశాడని వారికి వేతనాల పెంపు బోనసు, పనిలో రక్షణ, సమస్యల పరిష్కారంలో అగ్రభాగాన నిలిచాడని వారు అన్నారు. అక్షరం ముక్కరాని పొట్టన్నకు సాధినేని వెంకటేశ్వరరావు, ముఖ్తార్ పాష, సీతారామయ్య, రమేష్ తదితర నాయకులు అందించిన సహాయ సహకారాలతో మంచి కార్మిక నాయకుడిగా అభివృద్ధి చెందాడని శ్లాగించారు. అనంతరం సభలో భారత భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఎండి.రాసుద్దీన్, జిల్లా కార్యదర్శి ఎస్.కే.యాకూబ్ షావలి,జిల్లా నాయకులు కొండపల్లి శ్రీనివాస్, వేలిమీశెట్టి వీరన్న, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల నాయకులు వజ్జ మధు ప్రసంగించారు.

గూడ్స్ రైలు ఢీకొని మేకల కాపరి మృతి

నవతెలంగాణ-అశ్వాపురం

గూడ్స్ రైలు ఢీకొని మేకల కాపరి మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గొందిగూడెం గ్రామానికి చెందిన సున్నం సీతారామయ్య (50) మేకలు మేపేందుకు రైల్వే ట్రాక్ సమీపంలోకి వెళ్లాడు. ఈ క్రమంలో ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాస్తూ గూడ్స్ రైలు ఢీకొని తీవ్ర గాయాల పాలయ్యాడు. దీన్ని గమనించిన కొందరు స్థానికులు వెంటనే అతన్ని మణుగూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందిస్తుండగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పంచాయతీ ఎన్నికల్లో సైతం సత్తా చాటుతాం

- ప్రజలందరూ కాంగ్రెస్ వైపే
- కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం

నవతెలంగాణ-పినపాక



రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం సత్తా చాటుతామని కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొడిశాల రామనాదం అన్నారు. పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. నియోజవర్గ స్థాయిలో ఎవరికి ఏ కష్టం వచ్చినా కాంగ్రెస్ కార్యకర్తలు ముందుంటారన్నారు. అసెంబ్లీలో, పార్లమెంటులో, ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ సత్తా ఏమిటో నిరూపించామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం అదే పంథా కొనసాగించి కాంగ్రెస్ పార్టీ 23 గ్రామపంచాయతీలో విజయకేతనం ఎగరేస్తుందని తెలియజేశారు.



పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి సుదూర ప్రాంతాలలో ఉద్యోగాలు చేస్తూ ఒకే వేదికగా 28 సంవత్సరాల తరువాత అపూర్వ కలయకతో ఒకరకు ఒకరు ఎంతో ఆప్యాయంగా యర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1995-1996 పదవ తరగతి పూర్వ విద్యార్థులు పాఠాలు బోధించిన మోహన్ రావు, నారాయణరెడ్డి, రామయ్య పురుషోత్తం ఉపాధ్యాయులతో కలుసుకున్నారు. మండల పరిధిలోని ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. గత 28 సంవత్సరాల క్రితం పాఠశాలలో చదువుకొని ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేస్తూ కొందరు మరికొందరు గృహిణీలుగా ఇతర రాష్ట్రాల స్థిరపడి చదువుకున్న పాఠశాల వేదికగా ఆత్మీయ సమ్మేళనంతో కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలతో ఒకరు ఒకరు చిన్ననాటి గుర్తులు గుర్తుతెచ్చుకోని ఆనందం వ్యక్తం చేశారు. పాటలు బోధించిన గురువులకు శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మానికల సీతయ్య, సర్వేశ్వరరెడ్డి, రాంబాబు, సుభాని, బొబ్బిలి, దుర్గ, సీతారత్నం, నాగరాజకుమారి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గోవులను అక్రమంగా తరలిస్తే కేసులు

నవతెలంగాణ-పినపాక

బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఆవులు, లేగదూడలు అమ్మినా, రవాణా చేసినా సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెడ్ కానిస్టేబుల్ దిలీప్ తెలియజేశారు. ఆదివారం ఎస్పీ ఆదేశాల ప్రకారం పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో ఏర్పాటుచేసిన తనిఖీ కేంద్రం వద్ద ఆయన మాట్లాడారు. బక్రీద్ సందర్భంగా పశువులను రవాణా చేయడం నేరమన్నారు. నోరులేని మూగజీవాలను రక్షించుకుంటే భవిష్యత్ తరాలకు వ్యవసాయానికి ఉపయోగపడుతాయన్నారు. ఆవులు, లేగ దూడలను అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లఘించి ఆవులు, లేగదూడలను అమ్మినట్లయితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నట్లుగా తెలియజేశారు. అక్రమంగా గోవులు రవాణా చేస్తే సమాచారం ఉంటే తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రి మృతి...తల కొరివి పెట్టిన కూతురు


నవతెలంగాణ-ఇల్లందు



పట్టణంలోని 3వ వార్డుకు చెందిన కటకం రాజేష్(37) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. ఆయన కూతురు లక్ష్మీ శ్రీ వైష్ణవి (11) తండ్రికి తల కొరివి పెట్టింది. ఈ దృశ్యం చూపరులను కలచి వేసింది. 45 రోజుల్లో ఒకే కుటుంబం నుంచి కటకం కళావతి, కటకం లక్ష్మీ నారాయణ, కటకం రాజేష్‌లు మృతి చెందారు. దీంతో బంధువులు రోధిస్తూ దుఃఖ సాగరంలో మునిగిపోయారు. స్థానిక వార్డులో విషాదఛాయలు అలముకున్నాయి.

షార్ట్ సర్క్యూట్‌తో టిప్పర్ దగ్ధం

నవతెలంగాణ-అశ్వాపురం



మండల పరిధిలోని కుర్వాపల్లి కొత్తూరు గ్రామ సమీపంలో ఆదివారం మట్టి తోలుతున్న ఓ టిప్పర్ క్యాబిన్లోని వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో క్యాబిన్ పూర్తిగా దగ్ధమైంది. లారీ కాలుతున్న తీరును చూసిన స్థానికులు వెంటనే అక్కడికి వెళ్లి మంటలను ఆర్పి వేశారు. అయితే టిప్పర్ లారీని ఓ వ్యక్తి కిరాయికి తెచ్చుకొని మట్టి తోలుతున్నట్లు తెలుస్తోంది.

మండలంలో పర్యటించిన తాజా, మాజీ ఎమ్మెల్యేలు

- పలు శుభకార్యాలకు హాజరు



నవతెలంగాణ-అశ్వారావుపేట

మండలంలో ఆదివారం పలు శుభకార్యాల్లో తాజా, మాజీ ఎమ్మెల్యేలు ఆదినారాయణ, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. బచ్చువారిగూడెం, ఊట్లపల్లిలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యటించారు. ముందుగా ఊట్లపల్లిలో జరిగిన ఓణీలు వేడుకకు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం బచ్చువారిగూడెంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రామినేని నాగేంద్రరావు కుటుంబాన్ని పరామర్శించి, మృతుని చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అచ్యుతాపురంలో తెల్ల మేకల చెన్నారావు కూతురు ఓణీలు వేడుకకు మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జూపల్లి ప్రమోద్, ఆకుల శ్రీను, కొప్పుల శ్రీనివాసరావు, టీఆర్ఎస్ నాయకులు జెడ్పీటీసీ రమణారావు, మందపాటి రాజమోహన్ రెడ్డి, గుడవర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో 'గురుకులాలు'

- ఇరుకు గదుల్లో మగ్గుతున్న విద్యార్థులు
- పాఠశాలలు ఒకచోట, కళాశాలలు మరోచోట
- భవనాలు నిర్మించాలని కోరుతున్న తల్లిదండ్రులు

నవతెలంగాణ-అశ్వారావుపేట

గురుకులాలు అంటే ఒకప్పుడు పెద్ద పెద్ద భవనాలు, విశాల గదులు, చుట్టూ క్రీడా మైదానం, ఆహ్లాదం కోసం చెట్టూ చేమ వెరసి ప్రశాంత వాతావరణంలో విద్యాబోధన జరిగే విద్యాలయాలు. మరి నేడు జన రద్దీ కూడలిలు, పెద్ద పెద్ద వ్యాపార భవనాలు, ఇరుకు గదులు, చాలీ చాలని మరుగుదొడ్లు, తరగతి గదులే వసతి గదులు. అందులో మగ్గుతున్న విద్యార్థులు. నలుగురు ఉండే కుటుంబ సభ్యులు నివసించే ఇంట్లోనే ఓ రెండు రోజులు అదనంగా బంధువులు వసతి పొందితే ఎన్ని ఇబ్బందులో మనందరికి అనుభవమే. కానీ చాలీ చాలని గదుల్లో పదుల సంఖ్యలో విద్యార్థులు వారి బాధలు వర్ణించి గలమా. నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో మొత్తం మూడు గురుకుల పాఠశాలలు, వీటి అనుబంధం కళాశాలలు ఉన్నాయి. ఈ విద్యా సంస్థల ప్రిన్సిపాల్‌లు సంగీత, స్వప్న, మంజుల తెలిపిన వివరాలు ప్రకారం వాటిల్లోని సౌకర్యాలు, అసౌకర్యాలు.

టీఎంఆర్ఎస్ (బాలికలు)

ఈ గురుకులం 2017-18 విద్యాసంవత్సరంలో మంజూరి అయింది. ఇందులో 5 నుండి 10వ తరగతి వరకు 240 మంది విద్యార్థినీలు విద్యాభ్యాసం చేస్తున్నారు.







వీరికి తరగతి గదులు 6తో పాటు, కార్యాలయంకు ఒకటి, విద్యార్థుల సిక్ రూంకు ఒకటి, లైబ్రరీకి ఒకటి మొత్తం 10 గదులు అవసరం ఉంటుంది. వీటితో పాటు రెండు విశాల మైన భోజనం హాల్స్, వసతి కోసం మరో కొన్ని గదులు అవసరం ఉంటుంది. కానీ ప్రస్తుతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పూర్వ భవనాలు మరమ్మతులు, తాత్కాలికంగా చిన్న గాలులతో భవనాలు నిర్మించారు.

అనుబంధ కళాశాల:

దీనికి అనుబంధంగా జూనియర్ కళాశాల 2019-20 విద్యా సంవత్సరంలో ప్రారంభిం అయింది. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మొత్తం 160 మంది విద్యార్థినీలు చదువుతున్నారు. వీరికి తరగతి గదులు 4, కార్యాలయం ఒకటి, లైబ్రరీ,ల్యాబ్‌లు కోసం పరిశోధనా గదులు 4 మొత్తం 10 గదులు ఉండాలి. భోజన హాల్స్ 2, వసతి గదులు 4 ఉండాలి. ఈ కళాశాల సైతం వ్యాపార నిమిత్తం నిర్మించిన అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాల, కళాశాల కోసం మండల పరిధిలోని భీముని గూడెంలో ప్రభుత్వం స్థలం కేటాయించింది. కానీ విద్యాలయం ప్రారంభం అయి 8 సంవత్సరాలు అవుతున్నా శాస్వత భవనాలు నిర్మించలేదు.

ఎంజేపీటీబీసీఆర్ స్కూల్ (బాలికలు)

మహాత్మా జ్యోతీ రావు పూలే బ్యాక్ వర్డ్ రెసిడెన్షియల్ స్కూల్ 2017-18 విద్యాసంవత్సరంలో ప్రారంభించారు. ఇందులో 5 నుండి 10వ తరగతి వరకు 480 మంది విద్యార్థినీలు చదువుతున్నారు. ఇందులోనూ 12 తరగతి గదులు, రెండు భోజన హాల్స్, 12 వసతి గదులు, కార్యాలయం, లైబ్రరీ, సిక్ రూం అవసరం ఉంటుంది. ఈ స్కూల్ సైతం వ్యాపారం నిమిత్తం నిర్మించిన బహుళ అంతస్తు భవనంలో ఇరుకు గదుల్లో నే మగ్గుతున్నారు. ఈ పాఠశాల ఇప్పటికే మూడు భవనాల్లోకి మార్చారు. అయినా సరైన వసతి పొందలేకపోతున్నారు.

అనుబంధ కళాశాల :

2021-22 విద్యాసంవత్సరంలో ప్రారంభం అయింది. వసతి గదులు లేక ఒక సంవత్సరం దుమ్ముగూడెం, ఈ ఏడాది భద్రాచలంలో నిర్వహిస్తున్నారు.

ఎంజేపీటీబీసీడబ్ల్యుఆర్ స్కూల్ (బాలురు)

మహాత్మ జ్యోతి రావు పూలే బ్యాక్ వర్డ్ రెసిడెన్షియల్ బాలురు స్కూల్ 2019- 20 విద్యాసంవత్సరం ప్రారంభం అయింది. ఇందులోనూ 5 నుండి 10 తరగతి వరకు 480 మంది బాలురు చదువుతున్నారు. వీరికి 12 తరగతి గదులు, 12 వసతి గదులు, రెండు భోజన హాల్స్, సిక్ రూం, కార్యాలయం రూం, లైబ్రరీ గదులు అవసరం ఉంటుంది. ఇది సైతం అద్దె భవనంలో ఇరుకు గదులే. ఈ పాఠశాలను ఇప్పటికే రెండు చోట్లకు మార్చారు. గతేడాది 8,9 తరగతులను ఖమ్మం జిల్లా, వీఎం బంజరుకు తరలించారు. ఈ ఏడాది ఇంటర్ కళాశాల నిర్వహించాల్సి ఉన్నప్పటికి వసతి సదుపాయం లేకపోవడంతో అన్నపు రెడ్డిపల్లిలో నిర్వహించడానికి సన్నహాలు చేస్తున్నారు.

ఈ పాఠశాలలకు శాస్వత భవనాలు నిర్మించాలని, కళాశాలలను ఇక్కడే నిర్వహించేలా చర్యలు చేపట్టాలని విద్యార్థులు తల్లిదండ్రులు ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణలను కోరుతున్నారు.

కోల్ ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యం, లారీ ఓనర్స్‌కి మధ్య సమస్యలు పరిష్కారం

నవతెలంగాణ-ఇల్లందు



కోయగూడెం ఓపెన్ కాస్ట్ 2 నుండి ఇల్లందు సీహెచ్పికి బొగ్గు రవాణా చేస్తున్న శ్రీదేవి కోల్ ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యానికి ఇల్లందు, టేకులపల్లి లారీ ఓనర్స్‌కి మధ్య ఉన్నటువంటి బొగ్గు రవాణా సమస్యలు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జీఎం జాన్ ఆనంద్ చొరవతో ఆదివారం జరిగిన చర్చల్లో పరిష్కారమయ్యాయి. ఇరువర్గాలు ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ అధ్యక్షతన ఇల్లందు గెస్ట్ హౌస్ నందు సమావేశం నిర్వహించారు. సమావేశంలో శ్రీదేవి ట్రాన్స్‌పోర్ట్ గుత్తేదారుడు, ఇల్లందు, టేకులపల్లి లారీ ఓనర్స్ మధ్య అవగాహన కుదిరింది. ఈ సందర్భంగా కోయగూడెం కోల్ ట్రాన్స్‌పోర్ట్‌ను వెంటనే ప్రారంభిస్తామని ఇస్తామని శ్రీదేవి లారీ ట్రాన్స్‌పోర్ట్, లోకల్ లారీ ఓనర్స్ తెలిపారు. ఈ సందర్భంగా వారు శాసనసభ్యులు కోరం కనకయ్య జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్మెన్ డి.వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, ఐఎన్టీయుసి నేత వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు అందించడం అదృష్టం

- వైద్యులు పవన్ రెడ్డి, గీతా పావని

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఏజెన్సీ ప్రాంత పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నామని భద్రాచలం పట్టణానికి చెందిన సూర్య హాస్పిటల్ వైద్యులు పవన్ రెడ్డి, గీత పావని అన్నారు. ఆదివారం సూర్య హాస్పిటల్ ఆధ్వర్యంలో లక్ష్మీనగరం స్టేట్ బ్యాంక్ పక్కన ఉన్నటువంటి కిడ్స్ స్కూల్ నందు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఎంపీపీ రేసు లక్ష్మి భద్రాచలం పట్టణ ప్రముఖులు, ప్రముఖ సంఘ సేవకులు లయన్ గాదె మాధవరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడారు. మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం సంతోషకరమని, మున్ముందు మరెన్నో ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు.



లయన్ గాదె మాధవ రెడ్డి మాట్లాడుతూ పవన్ రెడ్డి ఎండి జనరల్ మెడిసిన్ షుగర్ వ్యాధి నిపుణులు ఏజెన్సీ ప్రాంతంలో సేవలందిస్తున్నారని అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొట్టమొదటిగా డాక్టర్ గీత పావని నెఫ్రాలజిస్ట్ కిడ్నీ వ్యాధి నిపుణులు, ఎండీ పీడియాట్రిక్‌గా సేవలందిస్తున్నారని గతంలో కిడ్నీకి సంబంధించిన ప్రాబ్లంస్ వస్తే ఖమ్మం, హైదరాబాద్ నగరాలకు వెళ్లే వాళ్ళమని ఇప్పుడు మన భద్రాచలంలో అందుబాటులో ఉండడం నియోజవర్గ ప్రజలకి వైద్యం అందుబాటులో ఎప్పుడు ఉంటుందని తెలిపారు. డాక్టర్స్ పవన్ రెడ్డి ఎండీ జనరల్ షుగర్ వ్యాధి నిపుణులు, డాక్టర్ గీతా పావని ఎండీ మాట్లాడుతూ భవిష్యత్తులో మరెన్నో భద్రాచలం నియోజకవర్గం వ్యాప్తంగా మరెన్నో ఉచిత క్యాంపులు ఏర్పాటు చేస్తామని ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తామని మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని ప్రజలకు తెలిపారు. సుమారుగా 215 మందికి ఉచిత వైద్య సేవలు అందించి వారందరికీ ఉచిత మందులని సరఫరా చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దలు గాదె మాధవరెడ్డి, జయచంద్రా రెడ్డి, వెంకటరమణారెడ్డి, అన్నె సత్యాలు, లంక అబ్బులు, కనుబుద్ది దేవా, గుడ్ల రాంబాబు, కణితి రాముడు, తెల్లం హరికృష్ణ, ప్రసాద్, ఖాదర్ బాబా, ట్రావెల్స్ జక్కం ప్రసాద్, ఎస్ఆర్ఎల్ ట్రావెల్స్ సుమేర్ మోతుకూరి శ్రీకాంత్, దామెర్ల శ్రీను, సూర్య హాస్పిటల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ట్రైబల్స్ తమ మనగడ, గౌరవ ప్రదమైన జీవితం కోసం పోరాడుతున్నారు

- రాష్ట్ర సదస్సులో డాక్టర్ వాసవి కిరో

నవతెలంగాణ-కొత్తగూడెం



ప్రపంచంలో 47 కోట్ల 67 లక్షల 60 వేల మంది మూలవాసులు, ఆదివాసులు ట్రైబల్స్ ఉన్నా వీరు 90 దేశాల్లో ఉన్నారని, దక్షిణాసియాలో ఉన్న మూలవాసులు ఆదివాసులు ట్రైబల్స్ జనాభాలో మూడింటి రెండు వందల మంది భారతదేశంలోనే ఉన్నారని, వీరంతా ట్రైబల్స్ మనగాడ కోసం...గౌరవమైన జీవితం కోసం పోరాడాలని నిపుణులు డాక్టర్ వాసవి కిరో పిలుపు నిచ్చారు. ఆదివారం కొత్తగూడెంలోని చుంచుపల్లి మండలం, విద్యానగర్‌లోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. జాతీయ నాయకులు సుర్ణపాక నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా డాక్టర్ వాసవి కిరో ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్యలు ముఖ్యవక్తులుగా పాల్గొని ప్రసంగిస్తూ నేడు ఆ దేశంలో ఆదివాసి మహిళలు వివిధ తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని పితృ హత్యా తెగల మధ్య ఘర్షణలు కిడ్నాపులు మూకుమ్మడి మానభంగాలు, అదృశ్యం కావడం, నిర్వాసితం వారి సాంప్రదాయక అటవీ భూమి నుండి ప్రాంతాల నుండి గెంటివేతలు పెద్ద ఎత్తున జనాభా ప్రవేశించడం సాంస్కృతిక దాడి, సామాజిక ఆర్థిక దోపిడీలు ఆధిపత్యమున్న ప్రపంచంలో లేని తీవ్రమైన ప్రమాదకరమైన సమస్యలు ఈరోజు ట్రైబల్స్ దేశవ్యాప్తంగా ఎదుర్కొంటున్నారని వారు అన్నారు. దేశంలో ట్రావెల్స్ కొరకు అనేక చట్టాలు చేశారు. సమాచార హక్కు చట్టం, పీసా చట్టం షెడ్యూల్ ట్రైబల్స్ ఇతర సాంప్రదాయ అటవీ నివాసుల గుర్తింపు హక్కు చట్టం, 2006 విద్యాహక్కు చట్టం, భూమి సేకరణలో న్యాయమైన పరిహారం పారదర్శకత పునరావాసం పునర్నిర్మానం హక్కు చట్టం 2013 మొదలైన చట్టాలు చేశారు. ఎన్ని చట్టాలు ఉన్నా ఎన్ని చట్టాలలో మార్పులు తెచ్చిన ట్రైబల్స్ ఆరోగ్య పరిస్థితి, కలుషిత ఆహారం శాపంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 75 ఏండ్ల స్వతంత్ర భారతదేశంలో ట్రైబల్స్ ఇంకా వెనుకబడిన ప్రాంతాలలోనే ఉన్నారని, అభివృద్ధికి ఆమడ దూరంలో నెట్టివేయబడ్డారని వారి హక్కుల కోసం అనేక మంది పోరాటాలు చేస్తున్న ట్రైబల్స్ పోరాటాలకు ముందుకు రావాలని వారి హక్కుల కోసం కొమరం భీమ్, బీర్సా ముండా, కోటన్న, బాటన్న, లింగన్న లా పోరాటాలు చేయాలని వారి ఆశయాలు సాధన వెలుగులో పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం జాతీయ అధ్యక్షులు ముక్తి సత్యం, సుర్ణపాక నాగేశ్వరరావు, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, మోకాళ్ళ మురళీకృష్ణ, చింత రజిత, జి.సక్రు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల కృషితో మర్కోడుకు పల్లె వెలుగు సర్వీసు ప్రారంభం

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో ఇల్లందు బస్ డిపో నుండి ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు సర్వీసు ప్రారంభమవుతుందని స్థానిక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాయం రామనర్సయ్య, సీనియర్ నాయకులు మొహమ్మద్ అతహార్, మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇల్లందు బస్ స్టేషన్ నుండి ఉదయం 07:30 నిమిషాలకు మళ్ళీ మధ్యాహ్నం 02:30 నిమిషాలకు ఆళ్ళపల్లి మండల పరిధిలోని మర్కోడు గ్రామానికి బస్సు సర్వీసు నడుపబడుతుందని, తిరిగి మర్కోడు గ్రామం నుండి ఇల్లందు పట్టణానికి ఉదయం 09:30 నిమిషాలకు మళ్ళీ సాయంత్రం 04:30 నిమిషాలకు సర్వీసు ఇల్లందు వరకు నడుపబడుతుందని తెలిపారు. కావునా ఆళ్ళపల్లి మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దాంతో గత కొన్ని సంవత్సరాలుగా ఇల్లందు, ఖమ్మం వైపు వెళ్లే మండల ప్రజలు, ఆళ్ళపల్లి మండలానికి వచ్చే వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు రవాణా సౌకర్యం సుగమం అవుతుందని హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా పలువురు స్థానికులు ఇల్లందు ఆర్టీసీ డిపో నుంచి ఆళ్ళపల్లి మండలానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కోసం కృషి చేసిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు నియోజకవర్గం ఎమ్మెల్యే కోరం కనకయ్య, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

16న ఐఎఫ్‌టీయూ మణుగూరు ఏరియా మహాసభలు

నవతెలంగాణ-మణుగూరు

ఐఎఫ్‌టీయూ మహాసభల షెడ్యూల్లో భాగంగా జూన్ 16న జరుగు ఐఎఫ్‌టీయూ మణుగూరు ఏరియా మహాసభను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు ఆర్.మధుసూదన్ రెడ్డి కార్మికులను కోరారు. ఆదివారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన మణుగూరు ఏరియా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, తమ హక్కుల పరిరక్షణ కోసం, మెరుగైన జీవనం కోసం కార్మిక వర్గం పోరాడవలసిన అవసరం ఉందన్నారు. బలమైన కార్మిక ఉద్యమాల నిర్మాణం కోసం ఈ మహాసభలు జరుగుతున్నాయన్నారు.



లోకల్ టాలెంట్ ప్రీమియర్ లీగ్ సీజన్ వన్ విజేతగా దేవరపల్లి

- రన్నర్‌గా చర్ల సీసీఏ, థర్డ్ ప్లేస్ ఎస్ ఏస్ 11

నవతెలంగాణ-చర్ల

గత వారం రోజులుగా గడింకోట క్రీడా మైదానంలో జరుగుతున్న క్రికెట్ పోటీలో ఫైనల్ మ్యాచ్లో దేవరపల్లి విజయం సాధించింది. మొదటిగా బ్యాటింగ్ చేసిన దేవరపల్లి టీం 8 ఓవర్లు ముగిసే సమయానికి 62 పరుగులు చేసింది. 63 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన చర్ల సీసీ ఏ టీం కేవలం 36 పరుగులకే ఆల్ అవుట్ అయింది. ఈ మ్యాచ్లో అద్భుత బౌలింగ్ చేసిన జగదీష్‌కీ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ టోర్నీలో మొదటి బహుమతి రూ.15000 అందజేశారు. కొత్తపల్లి ఆంజనేయులు రెండో బహుమతి రూ.8000, కిరాణా షాపు రాజా, చికెన్ షాపు ఇక్బాల్ భాషా మూడవ బహుమతి రూ.5000 ఇచ్చారు. ఈర్ని కృష్ణ మోహన్ ఈ బహుమతి ప్రధానోత్సవంనికి వచ్చిన నాయకులు రైతు క్లబ్ చైర్మన్ కొత్తపల్లి ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొసరాజు రాజా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విన్నార్స్ దేవరపల్లి రూ.15000 షీల్డ్, రన్నర్స్ సీసీ ఏ చర్ల రూ.8000 షీల్డ్, తర్డ్ ప్రైస్ ఎస్ ఎస్ 11 చర్ల రూ.5000, ఫెయిర్ ప్లే అవార్డు దేవరపల్లి షీల్డ్, 1000 క్యాష్, ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ హెల్లో క్యాప్ రూ.1000 నవీన్ పాలెం, బెస్ట్ బ్యాట్స్మెన్ శివ ఆరెంజ్ క్యాప్, బెస్ట్ బౌలర్ ప్రణయ్ పర్పుల్ క్యాప్, ఈ టోర్నీనీ నిర్వహించిన కమిటీ సభ్యులు శ్రీకాంత్, షారుక్, కోహ్లి, లోహిత్, ప్రవీణ్, ఈ టోర్నీకి సహాయ కార్యక్రమాలు చేసినా వారందరికీ పేరు పేరున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఆర్టీసీలో ఏటీబీ ఏజంట్ల నియామకాలు

నవతెలంగాణ-కొత్తగూడెం

ఆర్టీసీలో ఏటీబీ ఏజంట్ల నియామకం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచ బస్టాండ్‌ల నందు దూరపు సర్వీస్‌లకు ఆన్‌లైన్ చేయుటకు, ఏటీబీ ఏజెంట్ నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు చెప్పారు. ఈనెల 13 గురువారం సాయంత్రం 4 గంటల లోపు మీ అప్లికేషన్స్ కొత్తగూడెం డిపో మేనేజర్ కార్యాలయం నందు ఇవ్వగలరని డీఎం తెలిపారు.



ఉన్నతమైన న్యాయ వ్యవస్థ కోసం కృషి చేస్తున్న సంఘం ఐలూ

నవతెలంగాణ-కొత్తగూడెం

భారత దేశంలోని న్యాయ వ్యవస్థ మరింత ఉన్నతంగా ఎదగడం కోసం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) కృషి చేస్తున్నదని, ఏఐఎల్‌యు జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ మక్కడ్ అన్నారు. ఈ నెల 23న తెలంగాణ హై కోర్టు వారు తలపెట్టిన జ్యూనియర్ సివిల్ జడ్జ్ నియామకాల కోసం నిర్వహిస్తున్న స్క్రీనింగ్ టెస్టులో ఉత్తీర్ణత సాధించటం కోసం ఆదివారం కొత్తగూడెం బార్ అసోసియేషన్ హాలులో ఏఐఎల్‌యు ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ టెస్ట్‌ను ఆయన ప్రారంభించారు. జిల్లా కోశాధికారి కిలారు పురుషోత్తం రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంచి నాణ్యమైన న్యాయమూర్తులు సమాజానికి చాలా అవసరమని ఆయన అన్నారు. న్యాయవాదులకు ప్రతి ఏటా వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్టు ఆయన అన్నారు.

ప్రజా స్వామ్యం, లౌకికవాదం, సామ్యవాదం, న్యాయం లక్ష్యాలుగా ఏఐఎల్‌యు పని చేస్తున్నదని, వాటి సాధనలో భాగంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని ఆయన వివరించారు. రాష్ట్ర బాధ్యులు పి.కిషన్ రావు మాట్లాడుతూ ఏఐఎల్‌యు కార్యక్రమాల్లో న్యాయ వాదులందరూ పాల్గొని అవకాశాలను సద్వినియోగం చేసుకోవలని కోరారు. మోడల్ టెస్టులో కొత్తగూడెంలో ప్రథమ స్థానంలో నిలిచిన కాటూరి బింధును వక్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ క్రీడా సాంస్కృతిక కార్యదర్శి దూదిపాల రవి కుమార్, మహిళా ప్రతినిధి నల్లమల ప్రతిభ, ఏఐఎల్‌యు. బాధ్యులు కె.పుల్లయ్య, తెల్లబోయిన రమేష్, పసుపులేటి శ్రీనివాస్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఏ.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో గిరిజన చట్టాలను కాపాడుకోవాలి

- ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా నాయకులు రామకృష్ణ

నవతెలంగాణ-పినపాక



ఏజెన్సీలో గిరిజన చట్టాలను కాపాడుకోవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా నాయకులు రామకృష్ణ పిలుపునిచ్చారు. పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో ఆయన ఆదివారం మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గిరిజన చట్టాలను పూర్తిగా తుంగలోకి తొక్కుతుందని మండిపడ్డారు. గిరిజనులందరూ ఐక్యంగా ఉండి ఎంతోమంది పోరాట ఫలితంగా సాధించుకున్న హక్కులను చట్టాలను కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ సంఘం నాయకులు సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆట పాట లతో నిర్వహించారు. 1989 -1992 లలో చదివిన సిఎం ఈపిపి , హెచ్ఈపి విద్యార్థులు రెండో ఏడాది చెందిన విద్యార్థులు ఖమ్మం లోని డిపిఆర్సీ భవనం లో వార్షికోత్సవం లో కలుసు కున్నారు. హైదరాబాద్, బెంగుళూర్, ముంబాయి వంటి ప్రదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు అందరూ కలసి ఆట పాట ల తో అలరించారు. కరీంనగర్ జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎస్.వెంకన్న జానపద నృత్యం, తెలంగాణ సినీ ముజిసియన్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లేపల్లి మోహన్ పాటలు అలరించాయి. భద్రాద్రి కొత్తగూడెం జడ్పి సిఈవో చంద్ర శేఖర్, ఎసిపి రామానుజం తో పాటు వివిధ జిల్లాల్లో పని చేస్తున్న వారు అంత పూర్వ విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొన్నారు.



జేఈఈ అడ్వాన్స్‌లో 'న్యూవిజన్' విజయకేతనం

- 644 ర్యాంకుతో మెరిసిన కె.వర్షిత్
- 760వ ర్యాంకు సాధించిన మహస్వి
- వెయ్యిలోపు 24 మందికి ర్యాంకులు
- ర్యాంకర్లకు చైర్మన్ ప్రసాద్ అభినందనలు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

దేశంలోని ప్రముఖ ఐఐటీల్లో ప్రవేశార్థం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్-2024 ఫలితాల్లో న్యూవిజన్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో కళాశాల విద్యార్థులు కె.వర్షిత్, జి.మహస్వి 644, 760 ర్యాంకులతో మెరిశారు. వివిధ కేటగిరీల్లో వెయ్యిలోపు 24 మంది, ఐదువేల లోపు 68 మంది ర్యాంకులు సాధించినట్టు కళాశాల చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్ వివరించారు. ఫలితాల విడుదల సందర్భంగా ఆదివారం కళాశాలలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో హైదరాబాద్ మినహా ఏ ఇతర జిల్లాలు సాధించని ఘనత తమ కాలేజీ సొంతం చేసుకుందన్నారు. వివిధ కేటగిరీల్లో బి. ప్రభంజన్‌జాదవ్-12వ ర్యాంకు సొంతం చేసుకున్నారన్నారు. కె.వర్షిత్ 58, ఎం.నితీష్‌కుమార్ 79, డి.మురళీకృష్ణ 97, వి.రిషిత్ పవర్ 102, జి.మహస్వి 111, జి.శ్రీరామ్ 210, సీహెచ్ భావన 294, ఎం.జీతాహర్షిణి 297, జి.లోకేష్ 341, పి.రేవంత్ 382, వి.దివ్యశ్రీ 386, కె.పుష్పకశివసాయి 429, ఎం.నమిత 519, బి.హరిచందన 540, జి.వాత్సల్యసేన్ 548, వి.మురహరీశ్ 646, డి.ప్రదీప్ 677, ఎస్.రుషిదర్‌రెడ్డి 726, ఎండీ రిదాసమ్రీన్ 749, ఆర్. ప్రణేశ్ 756, బి.ప్రీతి 851, బి.భానుశంకర్ 889, జె.వినేశ్ 947 ర్యాంకులు సాధించారని వివరించారు. కళాశాల స్థాపించిన నాటి నుంచి ప్రతీ సంవత్సరం ప్రతిష్టాత్మక ఐఐటీల్లో 44, ఎన్ఐటీలో 43, ఐఐఐటీ, బీట్‌సాట్‌లో 20, ఎంబీబీఎస్‌లో 41 మంది విద్యార్థులను చేర్చుతూ సరికొత్త చరిత్రను న్యూవిజన్ లిఖిస్తోందని చైర్మన్ చెప్పారు. ఇందుకు సహకరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులకు ఆయన కృతజతలు తెలిపారు. ర్యాంకర్లను చైర్మన్‌తో పాటు డైరెక్టర్ సీహెచ్ గోపీచంద్, అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ కార్తీక్, ప్రిన్సిపాల్స్ బ్రహ్మాచారి, శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు.



జేఈఈ అడ్వాన్స్‌లో మెరిసిన 'నారాయణ'

- 164, 510, 818, 955 ర్యాంకులు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

జేఈఈ అడ్వాన్స్-2024 పరీక్షా ఫలితాల్లో ఖమ్మం నారాయణ విద్యార్థులు ఆలిండియా వివిధ కేటగిరీల్లో మెరుగైన ఫలితాలు సాధించారని కళాశాల కోర్ డీన్ వెంకటరెడ్డి, డీన్ పాటి మాధవరావు తెలిపారు. కళాశాలలో వారు ఆదివారం మాట్లాడారు. వివిధ కేటగిరీల్లో కళాశాల విద్యార్థులు బి. రిత్విక్ 164, బి.శ్రీవేద్ 510, టి.ఆకాశ్ 818, బి. శరణ్య 955, బి.రాకేశ్ 1456, బి.జాహ్నవి 2833, బి.యశంత్‌నాయక్ 3202, పి.హనీశ్ 4310, ఎస్. తన్మయి 6070, కె.మనోజ్‌కుమార్ 7068 ర్యాంకులు సాధించారని వివరించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

పేకాటరాయుళ్ళు అరెస్టు

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



మండల పరిధిలోని కొండాయిగూడెం గ్రామ శివారులో గల మామిడి తోటలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులు సబ్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ చాకచక్యంగా పట్టుకున్నారు. వారి వివరాల ప్రకారం...పేకాట ఆడుతున్నారనే సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి వెళ్లి వారిని పట్టుకున్నామని, వారి దగ్గర నుండి రూ.12300 నగదు, ఐదు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం, పేకలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అని వారిపై కేసు నమోదు చేశామన్నారు. మండలంలో ఎవరైనా పేకాట, కోడి పందాల నిర్వహించినట్లు అయితే వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దశాబ్దాలుగా వ్యాగన్ల ద్వారా బొగ్గు రవాణాకే పరిమితమా..?

యేటా రికార్డు స్థాయిలో బొగ్గుత్పత్తి

- రూ.లక్షల కోట్ల లాభాలు గడిస్తున్నా సింగరేణికి, కేంద్రానికి పట్టని అభివృద్ధి
- బొగ్గుట్టకు రైళ్ళ సౌకర్యం కల్పించాలి
- గాంధీ నగర్ ఇల్లందు రైల్వే లైన్ నిర్మించాలి
- మణుగూరు, కొత్తగూడెం రైళ్ళు ఇల్లందు మీదుగా మళ్ళించాలి
- రవాణ వ్యవస్థ లేక అవస్థలు పడుతున్న కార్మికులు, ఏజెన్సీ ప్రజలు
- ఎంపీలు రఘురామ, బలరాంలు దృష్టిపెట్టాలి





నవతెలంగాణ-ఇల్లందు

ఏజెన్సీ నియోజకవర్గమైన బొగ్గుట్ట దశాబ్దాలుగా అభివృద్ధిలో వెనుకబాటుకు గురైంది. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు మారుతున్నా పైపై మెరుగులు దిద్దుతున్నారేగాని అభివృద్ధికి బాటలు వేయడంలేదు. 1929 బ్రిటీష్ కాలం నుండి బొగ్గు పరిశ్రమ విరాజిల్లుతోంది. బ్రిటీష్ కాలం పక్కన పెడితే కోల్ ఇండియా ఏర్పడిన నాటి నుండి కోటాను కోట్ల మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీసి వ్యాగన్ల ద్వార రవాణ చేసింది. నేటికి రికార్డుస్థాయిలో బొగ్గుత్పత్తి జరుగుతోంది. రూ.లక్షల కోట్లు సింగరేణి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్జించాయి. బొగ్గు ఉత్పత్తిలో 128 సంవత్సరాల చరిత్రను 2017 సంవత్సరం డిసెంబర్ 28న ఇల్లందు (బొగ్గుట్ట) తిరగరాసింది. చరిత్రను బద్దలు కొట్టింది. 28న ఒకే రోజు సిహెచ్‌పిలో అత్యధికంగా 5 బొగ్గు రేకుల ద్వారా 25,418 టన్నుల బొగ్గు రవాణ చేసి సత్తా చాటుకుంది. ఇంత ఉత్పత్తి చేయడం ఇదే తొలిసారి. బొగ్గు రవాణలో చూపుతున్న శ్రద్ధ రైల్వే స్టేషన్ అభివృద్ధి, రైళ్ళు నడిపించాలనే శ్రద్ధ యాజమాన్యానికి, ఇటు రైల్వే అధికారులకు లేకపోయిందని ప్రజలంటున్నారు. కల్పనకు అవకాశాలు ఉన్నా ఎంఎల్ఏలు, ఎంపీలు, వివిధ రాజకీయ పార్టీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి దశలవారి ఆందోళనా కార్యక్రమాలు చేయడంలో విఫలయ్యారనే విమర్శలు వినపడుతున్నాయి. రవాణ సౌకర్యం ఉంటే ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందుతుంది. రైళ్ళ రవాణ సౌకర్యం లేకపోవడంతో రైళ్ళకోసం మహబూబాబాద్, గాంధీపురం, కారేపల్లి వెళ్ళలేక కార్మికులు, ఏజెన్సీ ప్రజలు అవస్థలు పడుతున్నారు.

1889లో బొగ్గుగనులు ఏర్పడి బొగ్గు వెలికి తీసిన నాటి నుండి రవాణాకు, ప్రయాణానికి ఇబ్బందులు పడ్డారు. దీనిని దృష్టిలో ఉంచుకుని బొగ్గు రవాణా, ప్రయాణ సౌకర్యాలకు కోసం 1929లో ఇల్లందులో సింగరేణి కాలరీస్ పేరిట బ్రిటీష్‌వారు రైల్వే స్టేషన్ నిర్మించారు. ఈ ప్రాంతంలో గననీయంగా బొగ్గు ఉత్పత్తి జరుగుతుండటంతో సింగరేణి సంస్థ ప్రధాన కార్యాలయం ఇక్కడే నెలకొల్పడం మూలంగా అధికారులు ప్రయానించడానికి, బొగ్గు రవాణా చేయడానికి వీలుగా రైలు సౌకర్యం ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లా ఏర్పడక ముందు ఇల్లందు వరంగల్ జిల్లాలో ఉన్నది. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రప్రథమ రైల్వేస్టేషన్ ఇదే కావడం విశేషం. ఈ ప్రాంతం నుండి ఆరోజుల్లో స్వపర్ క్లాస్, ఫస్ట్‌క్లాస్ బోగీలు ఉండేవి. ఇందులో సింగరేణి అధికారులు మాత్రమే ప్రయాణం చేసేవారు. కాలక్రమేన సింగరేణి ప్రధాన కార్యాలయం తరలిపోయింది. క్రమేపి రైలు సౌకర్యాలు రద్దవుతూ వచ్చాయి. ఇక్కడి నుండి డోర్నకల్ వరకు రోజుకు రెండుసార్లు ప్యాసింజర్ రైలు వెళుతు ఉండేది. అనంతరం సింగరేణి కాలరీస్ (ఇల్లందు) నుండి ఖాజీ పేట ప్యాసింజర్ రైలు ప్రవేశ పెట్టారు. కొంత కాలం తర్వాత రద్దు చేసి మణుగూరు రైల్వే స్టేషన్ ఏర్పడటంతో అక్కడి నుండి ఖాజీపేటకు రైలు నడుపుతున్నారు. ప్రస్తుతం ఇది కొనసాగుతోంది. డోర్నకల్ వరకు నడిచిన సింగరేణి కాలరీస్ (ఇల్లందు) ప్యాసింజర్ రైలు కూడా రద్దు చేశారు. అనంతరం సింగరేణి కాలరీస్ (ఇల్లందు) నుండి కారేపల్లి వరకు రోజుకు 4 ట్రిప్పులు రైలు నడిచింది. తర్వాత 2006లో సింగరేణి కాలరీస్ (ఇల్లందు) ప్యాసింజర్ పూర్తిగా రద్దు చేశారు.

బొగ్గుట్టకు రైళ్ళ సౌకర్యం కల్పించాలి

గాంధీ నగర్-ఇల్లందు రైల్వే లైన్ నిర్మించాలి

బ్రిటీష్ కాలం నుండి చరిత్రలో ఎంతో పేరున్న బొగ్గుట్టను అభివృద్ధి చేయాలి. రైళ్ళ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది. గాంధీపురం ఇల్లందు మధ్య 12కిమీ రైల్వే లైన్ నిర్మించాలి. దీనికిగాను సుమారు రూ.200 కోట్లు ఖర్చు కావచ్చని అంచన. ఇది నిర్మాణం జరిగితే కొత్తగూడెం నుండి వచ్చే రైళ్ళు ఇల్లందు మీదుగా కారేపల్లి, డోర్నకల్ ఆ పై స్టేషన్‌లకు వెళ్లవచ్చు. ఇల్లందుకు ప్రత్యేకంగా ప్యాసింజర్ రైళ్ళు వేయనవసరం ఉండదు. నియోజకవర్గ ఏజెన్సీ వాసులకు, పట్టణ ప్రజలకు, కార్మికులకు అన్ని వర్గాలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం ఇల్లందు సీఎస్‌పీ నుండి కారేపల్లికి వ్యాగన్ల ద్వార బొగ్గు రవాణ జరుగుతోంది. సత్తుపల్లి, కొత్తగూడెం రైల్వే లైన్ 60కి మీ.నిర్మించారు. సింగరేని, రైల్వే శాఖ కలిసి సుమారు రూ.2 వేల కోట్లు చెరిసగం ఖర్చుతో నిర్మించారు. ఇటీవల రామగుండం, మణుగూరు మధ్య 207 కిమీ రైల్వే లైన్ నిర్మాణానికై సర్వేకు కేంద్రం ఆమోదించింది. రాష్ట్రంలో ఎన్నో చిన్నచిన్న రైల్వే ష్టేషన్‌లు అభివృద్ధి చేస్తున్నారు. ఇదే విధంగా గాంధీ నగర్ ఇల్లందు రైల్వే లైన్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రాష్ట్రపతికి వినతులు పంపినా స్పందనలేదు

మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



ఏజెన్సీవాసులకు ప్యాసింజర్ రైల్ సైకర్యం కల్పించాలని నాటి రాష్ట్రపతికి, కేంద్ర మంత్రులకు, ఎంపీలకు వినతులు పంపినా స్పందన లేదు. 2006లో ప్యాసింజర్ రైలు రద్దు చేశారు. ఇల్లందు నుండి గుండాల, భూపాలపల్లి మీదుగా రైల్వే లైన్ నిర్మించాలని, ఇల్లందుకు రైళ్ళ సౌకర్యం కల్పించాలని తాజాగా గెలిచిన ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలను కోరుతున్నాం.

గాంధీనగర్ ఇల్లందు రైల్వే లైన్ నిర్మించాలి

సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నబి



దశాబ్దాలుగా రైళ్ళ సౌకర్యం లేక సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. రైళ్ళు నపడాల్సిన అవసరం ఉంది. గాంధీనగర్-ఇల్లందు మధ్య 12 కిమీ రైల్వే లైన్ నిర్మిస్తే ప్రజలకు రైలు సౌకర్యం కలుగుతుంది. ఈ దిశగా ఎంపీలు రఘురాం రెడ్డి, బలరాం నాయక్, సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకోవాలన్నారు. పార్లమెంట్ సమవేశాల్లో సమస్యలు రైల్వే శాఖ దృష్టికి తేవాలి.

ఎంపీ బలరాం నాయక్ హామీ నిలబెట్టుకోవాలి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ



ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎంపీగా పోటీ చేసిన కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ ఇల్లందుకు రైళ్ళ సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తామనని గెలిపిస్తే తప్పకుండా హామీ నెరవేరుస్తానని అన్నట్లు గుర్తు చేశారు. ఎంపీగా 3.5లక్షల ఓట్లతో గెలిచారని నియోజకవర్గంలో కూడా మంచి మెజారిటీ వచ్చింది. రైళ్ళ సౌకర్యం పై దృష్టి పెట్టాలి.

సింగరేణి యాజమాన్యం ప్రత్యేక చొరవ తీసుకోవాలి

బార్ అసోషియేషన్ అధ్యక్షులు భూక్య రవికుమార్



బ్రిటీష్ కాలంలో ప్రవేశ పెట్టిన రైలు సౌకర్యం తొలగించడం సరికాదు. ప్రస్తుతం ఏర్పడ్డ నూతన సంకీర్ణ ప్రభుత్వం సమస్యపై దృష్టి పెట్టాలి. ఎంతో చరిత్ర ఉన్న బొగ్గుట్టకు రైలు సౌకర్యం లేకపోవడం సరికాది. యేటా రూ.లక్ష కోట్లు బొగ్గుద్వార ఆదాయం పొంతున్న సింగరేణి యాజమాన్యం ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్రానికి రిప్రజెంట్ చేయాలి. కార్మికులకు, సామాన్యులకు ఎంతో ఉపయోగం.

ఎంపీలను ఒప్పిస్తాం..గాంధీనగర్ ఇల్లందు రైల్వే లైన్ సాధిస్తాం

కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్ కోరి



బొగ్గుట్టకు రైలు సౌకర్యం కావాల్సిందే. ఇటీవల ఎన్నికల సందర్భంగా ఎంపీ బలరాం నాయక్, ఎంఎల్ఏ కోరం కనయ్య హామీలు ఇచ్చారు. ఎంపీలను ఒప్పిస్తాం. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత రాహుల్ దృష్టికి సమస్యలు తీసుకెళతాం. గాంధీనగర్ ఇల్లందు రైల్వే లైన్ సాధిస్తాం. మణుగూరు, కొత్తగూడెం రైళ్ళు ఇల్లందు మీదుగా కారేపల్లి వెళ్ళడానికి కృషి చేస్తాం. ఈ సౌకర్యం సామాన్యులకు ఎంతో మేలు జరుగుతుంది.

ప్రాచీన కళలకు ఎప్పటికీ ఆదరణే

- నటరాజ నృత్య కళానికేతన్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ పంపిణీలో మంత్రి పొంగులేటి

నవతెలంగాణ-ఖమ్మం



ప్రాచీన కళలకు ఎప్పటికీ ఆదరణే ఉంటుంది అనడంలో ఎలాంటి సందేహాలు అవసరం లేదని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నటరాజ నృత్య కళానికేతన్ 48 వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రాష్ట్రాలలలో తమ నృత్య ప్రదర్శనలకు వచ్చిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పాశ్చాత్య దేశాల్లో కూడా ప్రాచీన కళలకు ఆదరణ లభిస్తోందని తెలిపారు. ఇతర దేశాల్లోనే కాకుండా భారత దేశంలో కూడా కూచిపూడి, భరత నాట్యం, కటక్ తదితర కళలలో మంచి ప్రాచుర్యం పొంది జాతీయ, అంతర్ జాతీయ, రాష్ట్ర స్థాయిలో కూడా తమ ప్రతిభను చాటుకుంటున్నారని చెప్పారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో తమ తెలుగు వారు పోటీ పడి రాణిస్తున్నారని వివరించారు. ఇప్పటికే నట రాజ నృత్య కళానికేతన్‌లో శిక్షణ పొందిన అనేక మంది చిన్నారులు వివిధ స్థాయిలలో తమ ప్రతిభను చాటుకుంటున్నారని చెప్పారు. మరోవైపు వారంతా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించడం ఈ కళానికేతన్‌కే గర్వకారణం అని తెలిపారు. దీనిని బట్టి చూస్తే ఎంత నిబద్ధతతో ఉందో అర్థం చేసుకోవచ్చు అన్నారు. నటరాజ నృత్య కళానికేతన్ వ్యవస్థాపకులు, మాష్టారు ఎస్.మాధవరావు 48 సంవత్సరాలుగా వేలాది మంది పిల్లలకు శిక్షణ ఇవ్వడం ఎంతో అభినందనీయమని తెలిపారు. ఇదే ఒరవడిని కొనసాగించాలని మాష్టారు మాధవరావును కోరారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు అనేక మంది విదేశాల్లో కూడా తమ ప్రతిభను చాటుకుంటున్నారని చెప్పారు. పోటీ ప్రపంచంలో అత్యంత కీలకంగా ఉన్న భరత నాట్యం, కటక్ తదితర అంశాలపై నేటితరం చిన్నారులు తమ ప్రతిభను చాటుకోవాలని హితవు పలికారు. రానున్న రోజుల్లో భరత నాట్యం, కటక్ వంటి కళలకు ఆదరణ పెరుగుతోంది చెప్పారు. ఈ కళలకు మనం నిత్యం గుర్తింపు ఇచ్చి తోడుపాటు ఇవ్వాలని కోరారు. భూమి మీద మనిషి ఉన్నంత కాలం ఈ కళలకు అన్ని వర్గాల ప్రజల నుంచి అనూహ్యస్పందన లభిస్తోందని తెలిపారు. అనంతరం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ పొందిన చిన్నారులకు మెమెంటోతో పాటు సర్టిఫికేట్ అందజేశారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన పలు రకాల నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నటరాజ నృత్య కళానికేతన్ వ్యవస్థాపకులు, మాష్టారు ఎస్. మాధవరావు, సీనియర్ జర్నలిస్టు మాధవరావు యోగినాటి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం అన్నదాత ఎదురుచూపు...

- 9 సహకార సంఘాలలో రుణమాఫీ అర్హులు 7,352 మంది
- రుణమాఫీకి కావలసిన నగదు రూ. 47.08 కోట్లు

నవతెలంగాణ-బోనకల్



తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆగస్టు 15 లోపు రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేస్తామని ప్రకటించడంతో అన్నదాతలు రద్దు మాఫీ ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల సమయంలో రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చినప్పటికీ హామీని నిలబెట్టుకోలేదు. మండల వ్యాప్తంగా సుమారు 25 నుంచి 35 శాతం వరకు మాత్రమే రెండు, మూడు దఫాలగా ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ చేసింది. ఎక్కువ మంది రైతులకు రుణమాఫీ జరగలేదు. దీంతో ఆనాటి ప్రభుత్వంపై రైతులలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అయింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెండు లక్షల రుణమాఫీ ఒకేసారి చేస్తామని కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ రుణమాఫీపై కాంగ్రెస్ పరిపాలనలో సందిగ్ధత నెలకొని ఉంది. ఈ క్రమంలో ప్రతిపక్షాల నుంచి రుణమాఫీ పై పెద్ద ఎత్తున కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు వస్తుండటంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 15 లోపు 2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామని ప్రకటించారు. దీంతో రైతులలో ఒక్కసారిగా ఆనందం మొదలైంది. బోనకల్ మండలానికి సంబంధించి రైతుల రుణమాఫీ వివరాలు ఇలా ఉన్నాయి. బోనకల్ మండల వ్యాప్తంగా 9 సహకార సంఘాలు, రెండు ఎస్‌బిఐలు, రెండు ఏపీజీబీ బ్యాంక్ లు ఉన్నాయి. 9 సహకార సంఘాల పరిధిలోనే రైతుల రుణాలకు సంబంధించి 7,352 మంది రైతులకుగాను 47 కోట్ల ఎనిమిది లక్షల 67 వేల ఎనిమిది వందల డెబ్బై తొమ్మిది రూపాయలు వడ్డీతో సహా రుణమాఫీ కానున్నాయి. మండలంలో అతిపెద్ద సహకార సంఘంగా ముష్టికుంట్ల సహకార సంఘంలో 1,188 మంది రైతులకు సంబంధించి 6 కోట్ల 87 లక్షల 57 వేల 796 రూపాయలు రుణమాఫీ కానున్నాయి. రెండవ అతిపెద్ద సంఘంగా ఉన్న లక్ష్మీపురం విశాల సహకార పరపతి సంఘంలో 1,123 రైతులకు సంబంధించి 8 కోట్ల 20 లక్షల 74 వేల 044 రూపాయలు రుణమాఫీ కావలసి ఉంది. బోనకల్ సహకార సంఘంలో 1,026 మంది రైతులకు సంబంధించి 4 కోట్ల 87 లక్షల 2 వేల 729 రూపాయలు రుణమాఫీ కానున్నాయి. మోటమర్రి సహకార సంఘంలో 830 మంది రైతులకు సంబంధించి ఐదు కోట్ల 26 లక్షల ముప్పై నాలుగు వేల 837 రూపాయల రుణమాఫీ కావలసి ఉంది. బ్రాహ్మణపల్లి సంఘంలో 666 మంది రైతులకు సంబంధించి 5 కోట్ల 18 లక్షల 93 వేల 857 రూపాయలు రుణమాఫీ కావలసి ఉంది. రావినూతల సంఘంలో 78 మంది రైతులకు సంబంధించి 4 కోట్ల 64 లక్షల ఒక వెయ్యి 120 రూపాయలు రుణమాఫీ కానున్నాయి. పెద్ద బీరవల్లి సహకార సంఘంలో 674 మంది రైతులకు సంబంధించి 4 కోట్ల 32 లక్షల 56వేల 908 రూపాయలు రుణమాఫీ కావలసి ఉంది. నారాయణపురం సహకార సంఘంలో 505 మంది రైతులకు సంబంధించి 4 కోట్ల ఒక లక్ష 38వేల 004 రూపాయలు రుణమాఫీ కానున్నాయి. కలకోట సహకార సంఘంలో 552 మంది రైతులకు సంబంధించి మూడు కోట్ల 70 లక్షల 8 వేల 578 రూపాయలు రుణమాఫీ కానున్నాయి. ఒకవైపు ఆగస్టు 15 ఎప్పుడు వస్తుందోనని అన్నదాతల ఎదురుచూస్తూనే మరొకవైపు వానాకాలం పంటలపై అన్నదాతలు దృష్టి సారించారు.











జేఈఈ అడ్వాన్స్‌లో 'శ్రీ చైతన్య'కు రెండో ర్యాంక్

- ఆలిండియా స్థాయిలో& 20 మందికి 500లోపు ర్యాంకులు
- 2వ ర్యాంకుతో డి.శైలజా ...31వ ర్యాంకుతో రామ్‌చరణ్ సత్తా

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

జాతీయ స్థాయి ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష జేఈఈ అడ్వాన్స్-2024లో ఖమ్మం శ్రీ చైతన్య విద్యార్థులు సత్తా చాటారు. ఆలిండియా రెండో ర్యాంకుతో కళాశాల విద్యార్థిని డి.శైలజా మెరిసింది. 20 మంది విద్యార్థులకు 500లోపు ర్యాంకులు లభించాయని చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ తెలిపారు. జేఈఈ ఫలితాల విడుదల సందర్భంగా ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కళాశాల విద్యార్థులు డి.శైలజ 2వ ర్యాంక్, బి.రాంచరణ్ 31, బి.వెంకటమణిరామ్ 45, వి.సందీప్ 74, బి.అభిలాష్ 101, ఎస్.సాత్విక్ 115, జి.శివసాయి 119, పి.సాయిదినేశ్‌రెడ్డి 138, బి.రామ్‌చరణ్‌తేజ 167, టి.శ్రీనివాస్ 179, జె.సిద్దు 241, వి.తుషార్ 249, బి.రాఘవ 267, సీహెచ్ సంజయ్ 310, డి. శ్రీసాత్విక్ 320, వి.సునీల్‌కుమార్ 366, ఎం.అనీల్ 409, బి.కుశ్వంత్ 417, ఎ.నీరజ 448, జి.రిషిరాజ్ 497 ర్యాంకులు సాధించారని వివరించారు. రాష్ట్రంలోనే బెస్ట్ లెక్చరర్లతో బోధన కారణంగానే తమ కళాశాల అన్నిటా ర్యాంకులు సాధిస్తోందని అన్నారు. మారుతున్న విధానానికి అనుగుణంగా బోధనాభ్యసనలో మార్పులు చేస్తుండటం వల్లనే ఈ ర్యాంకులు సొంతం చేసుకున్నామని డైరెక్టర్ శ్రీవిద్య అన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను చైర్మన్, డైరెక్టర్‌తో పాటు అకడమిక్ డైరెక్టర్ బి.సాయిగీతిక, డీజీఎం సీహెచ్ చేతన్‌మాథూర్, అకడమిక్ డీన్ ఎస్ఆర్ఎస్‌డీ వర్మ ఏజీఎంలు సీహెచ్ బ్రహ్మం, జి.ప్రకాశ్, జి.గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్స్, అధ్యాపక బృందం అభినందించింది.

'నీట్' ఫలితాలపై విచారణ చేపట్టాలి

- డీవైఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నీట్ పరీక్షా ఫలితాల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేశ్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణపై విద్యార్థుల తల్లిదండ్రులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. 2024 నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యత చేపట్టిన ఎన్‌టీఏ వ్యవహరించిన తీరుపై దేశవ్యాప్తంగా అనేక అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయని పేర్కొన్నారు. ఎన్‌టీఏపై ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో సమగ్ర న్యాయ విచారణ జరిపించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగువిధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష ఫలితాల్లో ఒకే పరీక్షా కేంద్రం, ఒకే సీరియల్ నంబర్లతో ఉన్న విద్యార్థులకు ర్యాంకులు రావటం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు.

లక్షలాది మంది విద్యార్థులు దీనిపై తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సుమారు 24 లక్షల మంది విద్యార్థుల జీవితంతో ముడిపడి ఉన్న ఈ సమస్య పట్ల ప్రభుత్వం తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు.

10 నుంచి 13 వరకు ఫిజికల్ ఫిట్నెస్, స్కిల్ టెస్ట్

- టీజీపీఈసెట్ -2024 కన్వీనర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీ.పీ.ఇడీ, డీ.పీ.ఇడీ కోర్సుల్లో ప్రవేశానికిగాను ఈ నెల 10 నుంచి 13 వరకు శాతవాహనా యూనివర్సిటీ వద్ద ఫిజికల్ ఫిట్నెస్, స్కిల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్టు టీజీపీఈసెట్ -2024 కన్వీనర్ ప్రొఫెసర్ రాజేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ఈ టెస్ట్ ఉంటుందని వెల్లడించారు.

రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు : తపస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పండిత్, పీఈటీ పోస్టుల అప్ గ్రేడేషన్ చేసి పదోన్నతులు కల్పించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర అధ్యక్షులు, హన్మంతరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత కలిగిన బీ.ఇడీ ఉండి నష్టపోతున్న ఎస్జీటీలకు న్యాయం చేయాలని వారు కోరారు.

నవతెలంగాణ బ్యూరో
విద్యార్థులతో చెలగాటమాడటం ఆపాలి

- ఏఐడీఎస్ఓ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీట్ ప్రవేశ పరీక్షల్లో అవినీతి, అక్రమాల ఆరోపణలపై న్యాయ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్ఓ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఎయిడ్సో రాష్ట్ర అధ్యక్షులు జె.మల్లేశ్, రాష్ట్ర కార్యదర్శి ఎ.సత్యనారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది గ్రేస్ మార్కులను ఇచ్చినందున ఆశ్చర్యం కలిగించే స్కోర్ చాలా మంది సాధించినట్టు ఎన్.టీ.ఏ చెబుతున్న సమాధానం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రవేశ పరీక్షకు ముందే ప్రశ్నాపత్రాల లీక్ ఆరోపణలున్నాయని గుర్తుచేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటడాటం ఆపాలని డిమాండ్ చేశారు.

కేంద్ర సహాయ మంత్రులు

(మొదటిపేజీ తరువాయి)

పంకజ్ చౌదరి	- యూపీ
క్రిషన్ పాల్	- హర్యానా
రాం దాస్ అత్వాలే	- రాజ్య సభ (ఆర్పీఐ, మిత్రపక్షం)
రాంనాథ్ ఠాకూర్	- రాజ్యసభ (జేడీయూ, మిత్రపక్షం)
నిత్యానంద్ రాయ్	- బీహార్
అనుప్రియా పాటిల్	- యూపీ (అప్నాదళ్, మిత్రపక్షం)
వి సోమన్న	- కర్నాటక
పెమ్మసాని చంద్రశేఖర్	- ఏపీ (టీడీపీ, మిత్రపక్షం)
భూపతి రాజు శ్రీనివాస్ వర్మ	- ఏపీ
ఎస్పీ సింగ్ భగేల్	- యూపీ (ఎస్సీ)
శోభ కరణ్ లాజే	- కర్నాటక
కీర్తీ వర్ధన్ సింగ్	- యూపీ
బీఎల్ వర్మ	- రాజ్యసభ
శాంతన్ ఠాకూర్	- పశ్చిమ గోదావరి
సురేశ్ గోపి	- కేరళ
ఎల్. మురుగన్	- తమిళనాడు (ఎస్సీ) ఓటమి
అజయ్ టంటా	- ఉత్తరాఖండ్
బండి సంజయ్	- తెలంగాణ
కమలేశ్ పాశ్వాన్	- యూపీ
భగీరథ్ చౌదరి	- రాజస్థాన్
సతీష్ చంద్ర దూబే	- రాజ్యసభ
సంజయ్ సేత్	- జార్ఖండ్
రవ్ నీత్ సింగ్	- పంజాబ్ (లుధియానా నుంచి ఓటమి)
దుర్గాదాస్ యూకే	- మధ్యప్రదేశ్
రక్షా నిఖిల్ ఖడ్సే	- మహారాష్ట్ర
సుకాంత ముజుందార్	- పశ్చిమ బెంగాల్
సావిత్రి ఠాకూర్	- మధ్యప్రదేశ్
టోఖన్ సాహూ	- చత్తీస్‌గఢ్
రాజ్ భూషణ్ చౌదరి	- బీహార్
హర్ష్ మల్హోత్రా	- ఢిల్లీ
నీముబెన్ జయంతి భాయ్ బాంభానియా	- గుజరాత్
మురళీధర్ మోహన్	- మహారాష్ట్ర
జార్జ్ కొరియన్	- కేరళ
పవిత్ర మార్గేరిటా	- రాజ్యసభ

చింతచెట్టు తెచ్చిన గొడవ

- దంపతుల మధ్య వాగ్వాదం
- ఆపేందుకు ప్రయత్నించిన తల్లి
- అడ్డొచ్చిన తల్లిని కొట్టి చంపిన కొడుకు

నవతెలంగాణ-శాయంపేట

ఇంటి పక్కనే ఉన్న చింతచెట్టు విషయంలో ఇరువురి మధ్య గొడవ జరుగుతుండగా, గొడవ ఆపడానికి భార్య తన భర్తను ఇంట్లోకి తీసుకెళ్లడంతో ఆవేశంలో భార్యను కొట్టేందుకు భర్త ప్రయత్నించాడు. గమనించిన అతని తల్లి అడ్డు రావడంతో మంచం అడ్డపట్టెతో ఆమె తలపై కొట్టగా తీవ్ర రక్తస్రావం అయింది. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకి తీసుకెళ్లారు. అప్పటికే వృద్ధురాలు మోతే అమృతమ్మ (85) మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. శనివారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ సీహెచ్ ప్రమోద్ కుమార్ వివరాల ప్రకారం.. మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన మోతే తిరుపతిరెడ్డి ఇంటి పక్కనే ఉన్న చింతచెట్టు విషయంలో బేతు జయపాల్ రెడ్డితో గొడవపడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన తిరుపతిరెడ్డి భార్య నాగరాణి గొడవ సద్దుమణిగేందుకు భర్తను ఇంట్లోకి తీసుకువెళ్లింది. ఆవేశంలో ఉన్న తిరుపతిరెడ్డి తన భార్యతో గొడవపడి కొట్టేందుకు ప్రయత్నించగా, అతని తల్లి అమృతమ్మ ఆపేందుకు అడ్డు వచ్చింది. కోపంలో పక్కనే ఉన్న మంచం అడ్డపట్టెను తీసుకొని తల్లి తలపై కొట్టాడు.

తలకి బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఆటోలో పరకాల పట్టణంలోని ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా, వైద్యులు పరీక్షించి ఆమె పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. తల్లిని సోదరుడు తిరుపతిరెడ్డి కొట్టి హత్య చేశాడని, కూతురు దూదిపాల రాణి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ప్రమోద్ కుమార్ తెలిపారు. పరకాల రూరల్ సీఐ పి.రంజిత్ రావు సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఇక పాలనపై దృష్టి

- ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ఇక పాలన పరుగులు
- మూడేండ్లుగా ఒకే చోటున్న అధికారుల బదిలీలు
- సంక్షేమం -అభివృద్ధి జోడెడ్లుగా సాగాలని సర్కారు నిర్ణయం
- మధిరలో అధికారులతో సమీక్షలో : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరుగ్యారంటీల అమలుపై దృష్టి పెట్టిందని, ప్రమాణ స్వీకారం చేసిన గంటల వ్యవధిలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని పది లక్షల రూపాయలకు పెంచుతూ అక్కడికక్కడే నిర్ణయం తీసుకున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వివిధ శాఖల అధికారులతో ఆదివారం మధిరలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో భట్టి మాట్లాడారు. ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ఇక పాలనపై దృష్టి సారించాలని నిర్ణయించినట్టు తెలిపారు. గత ప్రభుత్వాల మాదిరిగా మాటలకే పరిమితం కాకుండా ఇచ్చిన అన్ని అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు పూర్తి చేయాలని నిర్ణయించామన్నారు. దీనిలో భాగంగానే మున్సిపల్, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే రూ. 500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగించుకునే వారికి జీరో బిల్లు మంజూరును అమల్లోకి తెచ్చామన్నారు. హామీ ఇవ్వకపోయినా డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాల బకాయిలను మంజూరు చేశామని తెలిపారు. 30 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు అందజేశామన్నారు. ఈ క్రమంలోనే లోక్‌సభ ఎన్నికల కోడ్ రావడంతో ఒకసారిగా పాలనకు బ్రేక్ పడటంతో కొంత స్తబ్దత ఏర్పడిందని చెప్పారు. కోడ్ ముగిసిన వెంటనే ఈ నెల 9 నుంచి 'సంక్షేమం- అభివృద్ధి' జోడేడ్ల తరహాలో రాష్ట్రంలో పాలన ముందుకు సాగాలని సీఎం రేవంత్ రెడ్డి, తాను ప్రణాళికలు రూపొందించి వరుస సమీక్షలు, క్షేత్రస్థాయి పర్యటనలకు రంగం సిద్ధం చేశామని అన్నారు.

నెలాఖరులోగా ఉద్యోగుల బదిలీలు

ఈ నెలాఖరులోగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున అధికారులు, ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని నిర్ణయించామని డిప్యూటీ సీఎం అన్నారు. మూడేండ్లకు పైగా ఒకే చోట పాతుకుపోయిన అధికారులందరినీ కదిలించాలని నిర్ణయించినట్టు చెప్పుకొచ్చారు. దీనిలో భాగంగా ఆదివారం నుంచి ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు కార్యాచరణ ప్రారంభమైందన్నారు. ఈనెల చివరకు ఈ ప్రక్రియ ముగియనున్నట్టు చెప్పారు.

వైరా రిజర్వాయర్‌కు ఎన్నెస్పీ నీరు..

నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా వైరా రిజర్వాయర్‌కు సాగునీరు మళ్లించేందుకు డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఎన్నికల కోడ్‌కు ముందే రూ. 75 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పనుల పైన సమీక్ష నిర్వహించనున్నారు. ఖమ్మంలో సమీక్ష చేపట్టిన మరుసటిరోజే ఈనెల 13న సాగునీటి ప్రాజెక్టుల పనులు, వాటి ప్రగతిని తెలుసుకునేందుకు డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి లు సంయుక్తంగా క్షేత్రస్థాయి పర్యటన చేపట్టనున్నారు. నీళ్లు, నియామకాల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన గత పాలకులు ఖమ్మం జిల్లాలో ఇందిరా, రాజీవ్ సాగర్ ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యం చేశారని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ఒక్క అడుగు ముందుకు పడలేదని తెలిపారు. ఈనెల 12న.. సీతారామ ప్రాజెక్టు పరిధిలో దుమ్ముగూడెం నుంచి జూలూరుపాడు వరకు జరుగుతున్న పనులు, ఏన్కూరు నుంచి వైరా రిజర్వాయర్‌కు నాగార్జునసాగర్ ఎడమ కాలువను లింక్ చేయడం, కల్లూరు మీదుగా మధిర, సత్తుపల్లి నియోజకవర్గం నాగార్జునసాగర్ ప్రాజెక్టు జోన్-3 ద్వారా కృష్ణా జలాలను అందించడం, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాలకు సాగునీటి సరఫరా అంశాలు వంటి పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులతో సమీక్షించనున్నారు.

ఆయిల్ ఫామ్ రైతులపై చిన్నచూపు

మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

నవతెలంగాణ-నంగునూరు



ఆయిల్ ఫామ్ రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామంలో రైతు తిప్పని నాగేందర్ ఆయిల్ ఫామ్ తోటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ ప్రభుత్వం ఉన్నప్పుడు ఆయిల్ ఫామ్‌ల నిర్వహణకు ఏడాదికి రూ.4200 ఇచ్చేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అవి చెల్లించడం లేదన్నారు. వెంటనే పెండింగ్ డబ్బులు విడుదల చేయాలని కోరారు. కొత్త రైతులకు డ్రిప్ రావడం లేదని, ఆ కంపెనీలకు డబ్బులు చెల్లించకపోవడం వల్ల వారు ముందుకు రావడం లేదన్నారు. బకాయి పడ్డ నిధులు వెంటనే విడుదల చేయాలని, మొక్కల సబ్సిడీ కూడా పెండింగ్‌లో ఉందని, త్వరగా ఇవ్వాలని కోరారు. వానాకాలం వచ్చింది, కానీ రైతులకు పంట పెట్టుబడి సహాయం గురించి కాంగ్రెస్ నోరు మెదపడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాన చినుకు పడితే రైతు బంధు పైసలు పడేవని, ఇప్పటికైనా ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. షరతులు లేకుండా ఎకరాకు రూ.7500 ఇవ్వాలన్నారు. ఎన్నికల ప్రసంగాల్లో, మ్యానిఫెస్టోల్లో పంట కాలానికి ముందే ప్రతి ఎకరాకు ఇస్తామని చెప్పి, ఇప్పుడు రైతులను మోసం చేయడం సరికాదన్నారు. ఎన్నికల కోడ్ ముగిసినందున కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా, రైతు సమస్యల మీద దృష్టి సారించాలని సూచించారు. జనుము, జీలుగ విత్తనాల కొరత ఉందని, సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎరువుల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. ఎన్నికలకు ముందు అన్ని పంటలకు రూ.500 బోనస్ అని, ఇప్పుడు సన్న వడ్లకే బోనస్ ఇస్తామంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 90 శాతం రైతులు దొడ్డు వడ్లే పండిస్తారని సిద్దిపేట జిల్లాలో కూడా దొడ్డు రకం వరినే పండిస్తారని గుర్తు చేశారు. బోనస్ విషయంలో మంత్రులు తలో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, రైతులను దగా చేయడం మంచిది కాదన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వేలేటి రాధా కృష్ణ శర్మ, జాప శ్రీకాంత్ రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య కోల రమేశ్ గౌడ్, ఎల్లంకి మహిపాల్ రెడ్డి, ఆనగోని లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన ట్యాంకర్..

- లారీ, ట్యాంకర్ మధ్య ఇరుక్కుని నుజ్జునుజ్జయిన కారు
- ఇద్దరు మృతి.. మరో నలుగురికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-సదాశివపేట

యూటర్న్ తీసుకుంటున్న కారును వెనుక నుంచి వచ్చిన ఓ ట్యాంకర్ ఢీకొట్టగా.. అదే సమయంలో ఎదురుగా లారీ వచ్చింది.. దాంతో లారీ, ట్యాంకర్ మధ్య కారు ఇరుక్కొని నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్, కారులోని మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ భయానక ఘటన సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని నందికంది శివారులో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటకలోని దేవరిప్పరిగి తాలూకాకు చెందిన హాజీ శభాజ్, తన భార్య సమ్రిన్, ఇద్దరు కుమారులతో కలిసి కేఏ35ఎన్6126 నెంబర్ గల షిఫ్ట్ డిజైర్ కారులో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. ఫేమస్ హోటల్ దాటాక నందికంది శివారులో ఉన్న నాగ్సన్పల్లి చౌరస్తా వద్ద యూటర్న్ తీసుకోబోయారు. కారు వెనక హైదరాబాద్ నుంచి సదాశివపేట వైపు వస్తున్న ఎంహెచ్04ఎఫ్‌యు8804 నెంబర్ గల ట్యాంకర్ డ్రైవర్ అతివేగంగా వచ్చి కారును ఢీకొట్టాడు. అదే సమయంలో జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు టీఎస్52పీ8496 నెంబర్ గల లారీ ఎదురుగా వచ్చింది. ఆ సమయంలో కారు.. లారీ, ట్యాంకర్ మధ్య ఇరుక్కుని నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ మహారాష్ట్ర నివాసి మృత్యుంజయ దుబే(45), కారులో ఉన్న సమ్రిన్(45) అక్కడికక్కడే మృతి చెందారు. కారులోని ఇద్దరు పిల్లలతో పాటు హాజీ శభాజ్, లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడటంతో వారిని ఆస్పత్రికి తరలించారు. కారును ట్యాంకర్ ఢీకొట్టడంతోనే ప్రమాదం జరిగినట్టు ప్రాథమిక అంచనాకు వచ్చినా.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గాజాలో ఊచకోత ఆపండి

- వైట్ హౌస్ ఎదుట 'భారీ'నిరసన ర్యాలీ

వాషింగ్టన్: గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న దారుణ మారణ కాండకు నిరసనగా, నెతన్యాహుకు పెద్ద మద్దతుదారుగా ఉన్న బైడెన్ ప్రభుత్వ విదేశాంగ విధానానికి వ్యతిరేకంగా శనివారం అమెరికా అధ్యక్ష భవనం (వైట్ హౌస్) ఎదుట వేలాది మంది ప్రదర్శన నిర్వహించారు. అమెరికా పీపుల్స్ రెడ్ లైన్ ఇచ్చిన పిలుపుమేరకు వేలాది మంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు. యూదు దురహంకార నెతన్యాహు ప్రభుత్వం అన్ని అంతర్జాతీయ చట్టాలను, న్యాయ నియమాలను ఉల్లంఘిస్తూ పాలస్తీనీయులను ఊచకోత కోస్తుంటే బైడెన్ నిర్దేశించిన రెడ్ లైన్‌ను నెతన్యాహు దాట లేదంటూ వైట్ హౌస్ సన్నాయి నొక్కులు నొక్కడంపై నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

శనివారం సెంట్రల్ గాజాలో సుసిరాత్‌లో శిబిరంలో సజీవంగా ఉన్న నలుగురు బందీల విడుదల కోసం 250 మందికిపైగా అమాయక పాలస్తీనా పౌరులను ఇజ్రాయిల్ పొట్టన పెట్టుకుంది. ఈ దాడుల్లో మరో 400 మంది దాకా గాయపడ్డారు. ఇజ్రాయిల్ దాష్టీకం పట్ల అమెరికా, బ్రిటన్, చిలీతో సహా పలు దేశాల్లో నిరసనాగ్రహాలు వ్యక్తమయ్యాయి.

వైట్ హౌస్ ఎదుట జరిగిన ర్యాలీలో నిరసనకారులు పాలస్తీనా జెండా పట్టుకుని గాజాపై దాడులు ఆపండి. పాలస్తీనాకు విముక్తి కల్పించండి , తక్షణమే కాల్పుల విరమణ అమలు చేయండి అని రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. చిలీ రాజధాని శాంటియాగోలో ఆందోళనకారులు పాలస్తీనాకు నరహంతక ఇజ్రాయిల్ నుండి విముక్తి కల్పించాలని కోరుతూ శనివారం ప్రదర్శన నిర్వహించారు.

హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశాలను సైతం ఇజ్రాయిల్ బేఖాతరు చేస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిలీలోని బోరిక్ ప్రభుత్వం పాలస్తీనాకు పూర్తి మద్దతు ప్రకటించింది. శాంటియాగో విశ్వవిద్యాలయం ఇజ్రాయిల్ టెక్నాలజీ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాలను తాత్కాలికంగా నిలిపివేసింది.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు వెల్లడి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. అలాగే ఉత్తీర్ణత సాధించిన వారిలో 14,083 మంది జనరల్ కేటగిరి అభ్యర్థులు. 9,281 మంది ఓబీసీ, 5,423 మంది ఆర్థికంగా బలహీన తరగతులు, 13,794 మంది ఎస్సీలు, 5,073 మంది ఎస్టీ అభ్యర్థులు. ఇక, కామన్ ర్యాంక్ లిస్ట్ (సీఆర్ఎల్)లో ఐఐటీ ఢిల్లీ జోన్‌కు చెందిన వేద్ లహోతి టాప్ ప్లేస్ (ఆల్ ఇండియా ర్యాంక్ 1)ను సొంతం చేసుకున్నారు. 17 ఏండ్ల లహోతి తొలి ప్రయత్నంలోనే

ఈ ఘనత సాధించాడు. మొత్తం 360 మార్కులకు 355 మార్కులను సొంతం చేసుకున్నారు. అలాగే మహిళా అభ్యర్థుల కేటగిరిలో ఐఐటీ బాంబే జోన్‌కు చెందిన ద్విజ ధర్మేష్‌కుమార్ పటేల్ టాప్ ప్లేస్‌ను సాధించారు. 360 మార్కులకు గాను 332 మార్కులు సాధించారు. ఫలితాలను జేఈఈఏడీవీ.ఏసీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో అభ్యర్థులు వీక్షించవచ్చు.

కేంద్రమంత్రులకు శుభాకాంక్షలు : బోయినపల్లి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర మంత్రులుగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన సికింద్రాబాద్, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు బీఆర్‌నేత బోయినపల్లి వినోద్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర మంత్రులుగా తెలంగాణ అభివృద్ధి కోసం పాటు పడతారని ఆకాంక్షిస్తున్నట్టు పేర్కొన్నారు.

మహారాష్ట్రలో భారీ వర్షాలు ..

- 24 గంటల్లో ముంబయిలో అత్యధికంగా 60మి.మీ వర్షపాతం

ముంబయి : మహారాష్ట్ర రాజధాని ముంబయి సహా సమీప ప్రాంతాల్లో వర్షాలు దంచికొడుతున్నాయి. గత 24 గంటలుగా భారీ వర్షాలు కురుస్తున్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు, తేమతో కూడిన వాతావరణం నుండి ప్రజలకు ఈ వర్షాలు ఉపశమనం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. థానే, పల్ఘార్ జిల్లాల్లోని పలు రోడ్లపై వరద నీరు ముంచెత్తినట్లు అధికారులు తెలిపారు. థానేలో పలు చోట్ల చెట్లు నేలకూలాయి.అయితే భారీ వర్షాల కారణంగా మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలోని మల్జిపాడ ప్రాంతంలో రహదారి కుంగిపోయింది. ఈ ప్రాంతంలో మరమ్మత్తులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

ప్రశాంతంగా గ్రూప్-1పరీక్షలు

- దరఖాస్తు చేసుకున్న వారు 4.03 లక్షల మంది
- హాజరైన అభ్యర్థులు 3.02 లక్షలు
- త్వరలో కమిషన్ వెబ్‌సైట్లో ప్రిలిమ్స్ కీ
- షెడ్యూల్ ప్రకారమే అక్టోబర్ 21న మెయిన్స్
- వివరాలు వెల్లడించిన టీజీపీఎస్సీ
- నిమిషం ఆలస్యం నిబంధన నిక్కచ్చిగా అమలు
- పలు చోట్ల నిరాశతో వెనుదిరిగిన అభ్యర్థులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 563 పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 31 జిల్లాల్లో ఏర్పాటు చేసిన 897 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగింది. మొత్తం 4.03 లక్షల మంది అభ్యర్థులకుగాను 3.02 లక్షల మంది అభ్యర్థులు (74 శాతం) హాజరయ్యారని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) వెల్లడించింది. ఉదయం 10 గంటల వరకే అనుమతిస్తామని ప్రకటించిన నేపథ్యంలో అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఐతే కొన్ని పరీక్షా కేంద్రాల వద్ద కొందరు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో వారిని అనుమతించలేదు. ఒక్క నిమిషం నిబంధనతో చాలా మంది పరీక్ష రాయలేక పోయారు. ప్రతి కేంద్రానికి ఒక సిట్టింగ్ స్క్వాడ్ బందంతో పాటు 3 నుంచి 5 కేంద్రాలకు ఓ ఫ్లయింగ్ స్క్వాడ్ బందాన్ని ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలను నిర్వహించారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసేయడంతో పాటు 100 మీటర్ల వరకు144 సెక్షన్ అమలు చేశారు. పరీక్షకు సంబంధించిన ప్రిలిమినరీ కీని త్వరలో కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్టు టీజీపీఎస్సీ తెలిపింది. షెడ్యూల్ ప్రకారమే అక్టోబర్ 21న మెయిన్స్ నిర్వహించనున్నట్టు కమిషన్ పేర్కొంది.

అక్కడక్కడా అపశ్రుతులు

పరీక్ష నిర్వహణ విషయంలో రాష్ట్రంలో అక్కడక్కడా అపశ్రుతులు నెలకొన్నాయి. జగిత్యాల జిల్లా కేంద్రంలో పరీక్షా కేంద్రం ముందు అభ్యర్థులు ఆందోళనకు దిగారు. అరగంట టైమున్నా ఐదు నిమిషాలు మాత్రమే ఉందని ఇన్విజిలేటర్ చెప్పడంతో తొందరగా ఆన్సర్ చేశామని వారు ఆరోపించారు. అబిడ్స్ స్టాన్లీ కాలేజ్ పరీక్ష కేంద్రానికి అభ్యర్థులు గంట ముందే తరలివచ్చారు. అధికారులు విధించిన నిబంధనలు పాటించాలని పరీక్షా కేంద్రాల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో ఏర్పాటు చేసిన కేంద్రానికి పలువురు అభ్యర్థులు ఆలస్యంగా రాగా అనుమతించ లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆలస్యంగా వచ్చివారికి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటకి పంపంచారు.

రెండు సార్లు రద్దు

గ్రూప్1 పరీక్ష రెండు సార్లు రద్దయింది. 2022లో కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఆ తర్వాత అక్టోబర్‌లో ప్రిలిమ్స్ నిర్వహించి మెయిన్స్ కోసం 1:50 నిష్పత్తితో అభ్యర్థులను ఎంపిక చేశారు. అయితే పరీక్షా పత్రాలు లీకేజీ వ్యవహారంలో పరీక్షను కమిషన్ రద్దు చేసింది. ఆ తర్వాత గతేడాది జూన్ 11న రెండోసారి ప్రిలిమ్స్ నిర్వహించగా, ప్రక్రియలో లోపాలు జరిగాయని కొందరు కోర్టును ఆశ్రయించడంతో ఈ పరీక్షను సైతం రద్దు చేశారు. తాజాగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేయడంతో పాటు కొత్తగా 60 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది. దీంతో కమిషన్ 563 గ్రూప్ 1 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చింది.

పీఎఫ్ ఐఆర్ పెన్షన్ కుదింపు చర్యలు విడనాడాలి

- ఎం సాయిబాబా



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎంప్లాయిస్ పెన్షన్ స్కీములోని ఐఆర్ పెన్షన్ కుదింపు చర్యలను ప్రభుత్వం విడనాడాలనీ, ఆ చట్టాన్ని యధాతథంగా అమలు చేయాలని సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం సాయిబాబా డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కారాములు అధ్యక్షతన ఆదివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ఐఆర్ పెన్షన్ అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సరైన పద్ధతిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ కుదించే చర్యలు విడనాడాలని సూచించారు. కనీస పెన్షన్ రూ. తొమ్మిదివేలు ఇవ్వాలనీ, పెన్షన్ కరువు భత్యం లింక్ చేయాలన్నారు. ఈ డిమాండ్ల పరిష్కారానికై నిర్వహించనున్న ఆందోళనలో కార్మికుల పెద్దఎత్తున పాల్గొవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలుడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శులు ఎస్‌వి రమ, పి.జయలక్ష్మి, భూపాల్, జె.వెంకటేష్, జె.మల్లికార్జున్, వి.ఎస్ రావు, కె ఈశ్వరరావు, కళ్యాణ వెంకటేశ్వరరావు, గోపాలస్వామి, ఏజే రమేష్, కూరపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డెస్టినేషన్ వెడ్డింగ్ హబ్‌గా తెలంగాణ

- మెడికల్, ఏకో టూరిజంపై ప్రత్యేక దృష్టి :

పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రాన్ని డెస్టినేషన్ వెడ్డింగ్ సెంటర్‌గా తీర్చిదిద్దుతామని పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం బేగంపేటలోని హోటల్ హరిత ప్లాజాలో తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో 3వ సౌత్ ఇండియా వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వివాహ వేడుకలకు గమ్యస్థానంగా ఉన్నప్పటికీ హైదరాబాద్, దాని చుట్టుపక్కల ఉన్న ఫంక్షన్ హాళ్లు, కన్వెన్షన్ సెంటర్లు, రిసార్టుల్లో మాత్రమే నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో సుందరమైన ప్రదేశాలు, పుష్కలమైన వనరులున్నాయని తెలిపారు. వెడ్డింగ్ టూరిజానికి అనువుగా ఉండే సాగర్, కొల్లాపూర్‌లోని సోమశిల తదితర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరముందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను గ్లోబల్ టూరిజం హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. మెడికల్ టూరిజం, ఎకో టూరిజం, అడ్వెంచర్ టూరిజం, సహా వివిధ టూరిజం రంగాలపై దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. డెస్టినేషన్ వెడ్డింగ్‌లను ప్రోత్సహించడానికి ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యాల ద్వారా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. పర్యాటకాభివృద్ధితో ఆదాయం పెరగడంతో పాటు యువతకు గణనీయమైన ఉపాధి అవకాశాలను లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ ఎండీ రమేష్ నాయుడు, డైరెక్టర్ కె.నిఖిల, టీసీఈఐ అధ్యక్షులు ఆళ్ల బలరాం బాబు, ప్రధాన కార్యదర్శి రవి బురా తదితరులు పాల్గొన్నారు.

కర్నాటక కౌన్సిల్ ఎన్నికల్లో బీజేపీకి ఎదురు దెబ్బ

బెంగుళూరు : కర్నాటక లెజిస్లేటివ్ కౌన్సిల్ ఎన్నికల్లో బీజేపీకి ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఎన్నికల్లో నాలుగు స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ కేవలం ఒక స్థానంలోనే విజయం సాధించింది. ఇటీవల కౌన్సిల్‌లోని మొత్తం ఆరు ఖాళీలకు ఎన్నికలు నిర్వహించారు. మూడు పట్టభద్రలు నియోజకవర్గాలకు, మూడు ఉపాధ్యాయ నియోజకవర్గాలకు ఈ ఎన్నికలు జరిగాయి. మొత్తం ఆరు స్థానాల్లో మూడు స్థానాలను అధికార కాంగ్రెస్ గెలుచుకుంది. జెడి(ఎస్)కు రెండు స్థానాలు, బీజేపీకి ఒక స్థానం దక్కింది. అయితే కౌన్సిల్‌లో ఎన్‌డిఎ మెజార్టీ కొనసాగుతోంది. కర్ణాటక లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో మొత్తం 75 మంది సభ్యులు ఉన్నారు. తాజా ఎన్నికల తరువాత ఎన్‌డిఎకు మొత్తంగా 38 సభ్యులు ఉన్నారు. ఇందులో బీజేపీ సభ్యులు 30 మంది, జెడి(ఎస్) సభ్యులు ఎనిమిది మంది. అధికార కాంగ్రెస్‌కు 34 మంది సభ్యులు. కౌన్సిల్ ఇంకొంక ఖాళీ ఉంది. లోక్‌సభ ఎన్నికల తరువాత జగదీష్ షెట్టర్ రాజీనామా చేయడంతో ఒక స్థానం ఖాళీ అయింది. దీనికి త్వరలో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఎన్నికలు జరిగితే ఇది కాంగ్రెస్ ఖాతాలోకే వెళ్లనుంది. ఈ స్థానానికి అభ్యర్థిగా బసనగౌడ బాదర్లీని కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది.

వానాకాలంలో...

వాతావరణం మారుతోంది. వర్షాలు ప్రారంభమయ్యాయి. సీజనల్ వ్యాధులు ప్రబలే ఈ కాలంలో పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. జ్వరం, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, ఫంగల్ ఇన్ఫెక్షన్లు, తదితర సమస్యలు పిల్లలను ఈ కాలంలో వేధిస్తాయి. ఈ వర్షాకాలంలో పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

- కాచి చల్లార్చిన నీరు తాగేలా చూడాలి.
- మలేరియా, డెంగ్యూ ఇతర వ్యాధుల వ్యాప్తిని నివారించేలా పరిసరాలను శుభ్రంగా ఉంచాలి.
- ఫంగల్ ఇన్ఫెక్షన్లు రాకుండా తడి బట్టలు, బూట్లు తప్పనిసరిగా ఆరుబయట ఆరబెట్టాలి.
- భోజనానికి ముందు చేతులు బాగా కడుక్కునేలా చూడాలి.
- స్కిప్పింగ్, హెూపింగ్, టేబుల్ టెన్నిస్ మొదలైన ఇండోర్ ఫిజికల్ యాక్టివిటీస్ వంటి శారీరక శ్రమ కలిగించే క్రీడలను ప్రోత్సహించాలి.
- వర్షాలు పడుతున్న సమయంలో తప్పనిసరిగా బయటికి వెళ్తున్నప్పుడు రెయిన్‌కోట్‌లు, గొడుగులు, గమ్ బూట్లు ఉపయోగించాలి.
- ఆహారంలో తులసి, దాల్చిన చెక్క, నిమ్మ, అల్లం, ఇతర మసాలా దినుసులు చేర్చాలి.
- దోమలు కుట్టకుండా దోమతెర ఉపయోగించాలి.
- బయటి నుండి వచ్చిన పిల్లల కాళ్లను గోరువెచ్చని నీళ్లతో కడగాలి.
- అలెర్జీలు రాకుండా ఇంటి వాతావరణంలో తేమ లేకుండా చూడాలి. ముఖ్యంగా గోడలు, తివాచీలు, కర్టెన్‌లను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలి.

నా సంఘీభావం ప్రకటించానంతే..

కని కస్రుతి... తన రాజకీయ ఆలోచనలకు, మతసామరస్యానికి భిన్నంగా వుందని కేరళ స్టోరీలో నటించేందుకు తిరస్కరించారు. ఇటీవలే 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో గ్రాండ్ ప్రిక్స్ అవార్డును గెలుచుకున్న 'ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్' ప్రధాన పాత్ర పోషించారు. ఆ ఫిల్మ్ ఫెస్టివల్లో పుచ్చకాయ బ్యాగ్ ధరించి పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలియజేసినందుకు అనేక విమర్శలకు గురయ్యారు. అయినా నికార్సైన నటిగా సమాజంలో జరిగే ప్రతి అన్యాయంపై తనదైన శైలిలో గొంతెత్తుతున్న ఆమె పరిచయం నేటి మానవిలో...



ఇటీవల ముగిసిన కేన్స్ వారి 77వ ఎడిషన్‌లో చిత్రనిర్మాత పాయల్ కపాడియా 'ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్' గ్రాండ్ ప్రిక్స్‌ను గెలుచుకున్న విషయం అందరికీ తెలిసిందే. ఎందుకంటే 30 ఏండ్ల తర్వాత కేన్స్ పోటీలో గెలుపొందిన మొదటి భారతీయ చిత్రం ఇది. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించబడిన ఈ చిత్రం ప్రేక్షకుల నుండి ఎనిమిది నిమిషాల స్టాండింగ్ ఒవేషన్‌ను అందుకుంది. 'ఇదంతా నమ్మలేకపోతున్నాను. ఇంత లాంగ్ స్టాండింగ్ ఒవేషన్ వస్తుందని ఊహించలేదు. ప్రీమియర్ చూసిన తర్వాత ఇతర దేశాల నుండి ఎంతో అనుభవం ఉన్న నటులు నా వద్దకు వచ్చి నా నటనలోని సూక్ష్మ నైపుణ్యాల గురించి నాతో పంచుకున్నారు. వారితో జరిగిన ఈ చర్చలు చాలా విలువైనవిగా భావించాను' అంటూ కని పంచుకున్నారు.


థియేటర్ విద్య పూర్తి చేసి

కని కేరళలోని తిరువనంతపురంలోని చెరువక్కల్ గ్రామంలో పుట్టారు. తల్లి జయశ్రీ ఎకె, తండ్రి మైత్రేయ మైత్రేయన్. వీరిద్దరూ అభ్యుదయ భావాలు కలిగిన సామాజిక కార్యకర్తలు. అందుకే తమ బిడ్డకు ఇంటి పేరు కానీ, వెనక తల్లిదండ్రుల పేర్లు తోకలుగా వచ్చే సాంప్రదాయాన్ని బద్దలు కొట్టి కేవలం కని అని పేరు పెట్టుకున్నారు. ఆమె 15 ఏండ్ల వయసులో పదో తరగతి పరీక్షలు రాసే సమయంలో తప్పని పరిస్థితుల్లో ఆమె పేరు వెనుక కుస్రుతి (మలయాళంలో కొంటె అని అర్థం) అని చేర్చాల్సి వచ్చింది. తిరువునంతపురంలో అభినయ థియేటర్ రీసెర్చ్ సెంటర్ చెందిన థియేటర్ ప్రాక్టీషనర్లకు ఒక సాధారణ వేదిక ఉండేది. ఆమెకు వారితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతో 2005 నుండి 2007 వరకు త్రిసూర్ స్కూల్ ఆఫ్ డ్రామాలో థియేటర్ ఆర్ట్స్ ప్రోగ్రామ్‌లో చేరారు. తన థియేటర్ విద్యను ఎల్‌కోల్ ఇంటర్నేషనల్ డి థియేత్రే జాక్వెస్ లెకాక్‌లో పూర్తి చేశారు. తర్వాత రెండేండ్ల పాటు ఫిజికల్ థియేటర్‌ను పూర్తి చేశారు. తర్వాత నటిగా, మోడల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు.

పుచ్చకాయ బ్యాగుతో...


కేన్స్ ఫిలిమ్ ఫెస్టివల్‌లో కని ఓ బ్యాగ్ పట్టుకున్నారు. అదే పుచ్చకాయ బ్యాగ్. పుచ్చాకాయను పోలి ఉన్న బ్యాగ్‌తో ఆమె రెడ్ కార్పెట్‌పై నడిచారు. పుచ్చకాయ ముక్క పాలస్తీనా ప్రతిఘటనకు చిహ్నం. ఆ దేశానికి సంఘీభావంగా ఆమె ఆ బ్యాగ్ పట్టుకున్నారు. అయితే దానిపై సోషల్ మీడియాలో కాంట్రవర్సీ నడిచింది. ఆమె పాలస్తీనాపై కపట ప్రేమ చూపిస్తున్నారు అంటూ విమర్శలు వచ్చాయి. దానిపై స్పందిస్తూ 'అక్కడ చాలామంది చాలా వాటికి సపోర్ట్ చేశారు. బ్యాడ్జెస్ వేసుకున్నారు. రకరకాల వస్తువులతో తమ సంఘీభావాన్ని తెలిపారు. నేను పాలస్తీనాకి సంఘీభావం తెలపాలి అనుకున్నాను. చాలామంది వర్క్ ప్లేసుల్లో మహిళలపై జరుగుతున్న దారుణాల గురించి, కేన్స్‌లో వర్కర్లకు ఇస్తున్న తక్కువ జీతాల గురించి ఇంకా చాలా విషయాలపై గొంతెత్తారు. నేను పాలస్తీనాకి సంఘీభావం తెలపాలి అనుకున్నాను అంతే. ఒక వ్యక్తిగా నేను కొన్నిసార్లు అనేక ఆలోచనలను పంచుకుంటాను. కొన్ని సమస్యలపై ఎలా నిలబడాలో నిర్ణయించుకుంటాను. విపరీతమైన సంఘటనలు ఏకకాలంలో జరుగుతున్న ప్రపంచంలో మనం జీవిస్తున్నాం. నేటి పరిస్థితులు ఎవరికీ అనుకూలంగా లేవు. వీటిని మనం లైట్‌గా తీసుకుంటే కుదరదు. అందుకే నా సంఘీభావం ప్రకటించాను' అంటూ పంచుకున్నారు.





నాలాంటివారెందరో...

తన సినీ కెరీర్ గురించి మాట్లాడుతూ 'నేను ఆర్థికంగా స్వతంత్రంగా ఉన్నప్పుడే ప్రశాంతంగా ఉండగలను. జీవనోపాధి కోసమే సినిమాల్లో నటించాల్సి వచ్చింది. 2020లో నేను నటించిన మలయాళ చిత్రం 'బిరియాని'కి కేరళ స్టేట్ ఫిల్మ్ అవార్డు, మాస్కో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ నటి అవార్డును గెలుచుకున్నాను. కానీ అంతకు ముందు నా జీవితమంతా కన్నీళ్లతో పోరాటమే. నా దగ్గర డబ్బు లేని సమయంలో సజిన్(సజిన్ బాబు) నన్ను సంప్రదించారు. స్క్రిప్ట్ చదివిన తర్వాత ఈ క్యారెక్టర్ చేయలేనని చెప్పా. ఎందుకంటే అది ముస్లింల హక్కుల గురించి మాట్లాడే సినిమా. అయితే నన్ను కలిసిన సజిన్ ఓ ముస్లిం. ఇవన్నీ వాస్తవ జీవితాలని నాకు చెప్పారు. అయినా నేను ఒప్పుకోలేదు. అయితే మూడు నెలల తర్వాత చిత్ర నిర్మాత మళ్లీ నన్ను సంప్రదించారు. ఆ సినిమాలో నటిస్తే 70 వేలు ఇస్తామన్నారు. అప్పుడు నా అకౌంట్‌లో మూడు వేలు మాత్రమే ఉన్నాయి. దాంతో సినిమా చేసేందుకు ఒప్పుకున్నాను. ఇలా నాలాంటి నటులు సినీ పరిశ్రమలో ఎంతో మంది ఉన్నారు. ఒకవేళ థియేటర్ ఆర్టిస్టుగా నాకు సంపాదన బాగుండి వుంటే సినిమాల్లోకి వచ్చి ఉండేదాన్ని కాదేమో' అంటూ ఆమె పంచుకున్నారు. ముస్లింలకు వ్యతిరేకంగా తీసిన కేరళ స్టోరీ చిత్రంలో అవకాశం వస్తే ఆమె దాన్ని సీరియస్‌గా తిరస్కరించారు. తన రాజకీయ ఆలోచనలకు ఈ సినిమా పూర్తి భిన్నంగా ఉందన్నారు. ఆమె అన్నట్టుగానా ఆ చిత్రం తర్వాత కాలంలో అనేక ప్రాంతాల్లో నిషేధానికి గురయ్యింది.



మదర్ థెరిసా పాత్రతో...

థియేటర్ ప్రొడక్షన్స్ భగవదజ్జుకం, లాస్ ఇండాస్, హెర్మాన్ హెస్సే, సిద్ధార్థ వారి రంగస్థల వేదికలపై నటించారు. ఆమె బర్నింగ్ ఫ్లవర్స్ - 7 డ్రీమ్స్ ఆఫ్ ఎ ఉమెన్ అనే ఇండో-పోలిష్ ప్రొడక్షన్‌లో పరిశోధించి, అభివృద్ధి చేసి నటించారు. ఆంథాలజీ చిత్రం కేరళ కేఫ్‌లో కనిపించిన తర్వాత కనికి నటిగా గుర్తింపు వచ్చింది. తర్వాత శిక్కర్, కాక్‌టెయిల్ వంటి సినిమాల్లో ముఖ్యమైన పాత్రలను పోషించారు. ఈశ్వరన్ సాక్షియై అనే మలయాళ ధారావాహికలో మదర్ థెరిసా పాత్రతో ప్రజాదరణ పొందారు.

కిందకు దిగేందుకు సిద్ధపడం

థియేటర్ నేపథ్యం నుండి రావడంతో సరైన ఎంపికలు చేయడంలో ఆమెకు బాగా సహాయపడింది. 'ఇది నాకు స్థిరంగా ఉండటంలో, సవాళ్లను ఎదుర్కోవడం, ఎలాంటి పరిస్థితులనైన తట్టుకొని నిలబడంలో సహాయపడింది. థియేటర్ నటులుగా మేము ఎట్టి పరిస్థితుల్లోనూ కిందకు దిగేందుకు సిద్ధపడం' అన్నారు. మలయాళ సినిమాకి పునరాగమనం గురించి అడిగితే ఆమె నవ్వుతూ పరిశ్రమలో పాత్రల కోసం ఆడిషన్‌కు మరిన్ని అవకాశాలు రావాలని కోరుకుంటున్నానని చెప్పారు. ఆమె రాబోయే ప్రాజెక్టులలో రెండు మలయాళ వెబ్ సిరీస్‌లు, ఒక మలయాళ చిత్రం, ఒక హిందీ చిత్రంతో పాటు రెండు వెబ్ సిరీస్ ఉన్నాయి. అలాగే ఒక తమిళ చిత్రం కూడా ఉంది.





బడి ఊడ్చేదెవరు..?

(మొదటిపేజీ తరువాయి)

చెప్పినట్టుగా.. అన్ని స్కూళ్లకు స్కావెంజర్లను నియమించడం ద్వారా స్వచ్ఛ వాతావరణంలో ప్రభుత్వ స్కూళ్లను నడిపించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.

హైదరాబాద్ పరిధిలో 691 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిల్లో లక్షకుపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే ప్రభుత్వ పాఠాశాలల్లో పారిశుధ్య పనుల కోసం గతంలో స్కావెంజర్లు ఉండేవారు. 40మందిలోపు విద్యార్థులు ఉంటే ఒకరిని రూ.2వేలు, అంతకంటే ఎక్కువ విద్యార్థులుంటే ఇద్దరు కార్మికులకు రూ.2500 చొప్పున వేతనం చెల్లించేవారు. ఈ వేతనంతోనే సదరు కార్మికులు నిత్యం పాఠశాలల ప్రాంగణాలు, గదులు, టాయిలెట్లను శుభ్రం చేసేవారు. అంతేగాక హైస్కూళ్లలో వందలాది మంది విద్యార్థులకు వీరి సేవలు ఎంతో కీలకం. కానీ రెండేండ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్కావెంజర్ల వ్యవస్థను రద్దుచేసింది. దాంతో సిటీలో సుమారు 800కుపైనే.. రాష్ట్రంలో 20వేలకుపైనే కార్మికులు ఉపాధి కోల్పోయారు. పాఠశాలల్లో పరిశుభ్రతను ప్రభుత్వం.. హెచ్ఎంలు, ఉపాధ్యాయులపై నెట్టేసింది. వారి నుంచి వ్యతిరేకత పెరగడంతో ఆ తర్వాత జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీలు, పంచాయతీలకు అప్పగించింది. ఇదివారికి అదనపు భారమే కాదు.. ఈ పనులకు అదనపు చెల్లింపులు కూడా లేవు. అయినప్పటికీ జీహెచ్ఎంసీ కార్మికులు పాఠశాలల్లో ప్రాంగణాలను శుభ్రం చేస్తున్నారు. కానీ మరుగుదొడ్ల పరిశుభ్రత చేయడం లేదు. దాంతో బడుల్లో స్వచ్ఛత ప్రశ్నార్థకంగా మారింది. టాయిలెట్ల పరిస్థితి అధ్వానంగా తయారు కావడంతో విద్యార్థినులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గతంలో పనిచేసిన వారిని తిరిగి పిలిచి కొంత డబ్బులు చెల్లించి పనులు చేయించుకునే పరిస్థితి నెలకొంది.

రెండు రోజుల్లో పాఠశాలలు ప్రారంభం..!

ఎల్లుండి నుంచి స్కూళ్ల ప్రారంభమైతే పరిశుభ్రత ఎలా అనేది ఇప్పుడు ప్రశ్నార్థంగా మారింది. పట్టణ ప్రగతిలో భాగంగా పారిశుధ్యం, హరితహారం, తదితర పనుల్లో జీహెచ్ఎంసీ కార్మికులు తీరిక లేకుండా ఉన్నా.. వీరికి బడుల బాధ్యత అప్పగించడంతో పారిశుధ్య నిర్వహణ పూర్తిస్థాయిలో అమలుకాక అపరిశుభ్రంగా మారుతున్నాయి. సిబ్బంది కొరత, అదనపు పని భారం వల్ల వారు పాఠశాలలకు వచ్చినా కేవలం బడి ఆవరణ మాత్రమే క్లీన్ చేస్తున్నారు. దీంతో అటు స్వచ్ఛ కార్మికులు లేక.. ఇటు జీహెచ్ఎంసీ కార్మికులు చేయక.. టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. వాటినే విద్యార్థులు ఉపయోగించే పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారాయి. ఈ నేపథ్యంలో స్కావెంజర్ల వ్యవస్థను పునరుద్ధరించే విషయంలో ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

బడుల ప్రారంభంలోపే.. స్కావెంజర్లను నియమించాలి :
ఏ.శ్యామ్ సుందర్, ప్రధాన కార్యదర్శి, టీఎస్‌యూటీఎఫ్ హైదరాబాద్ జిల్లా



నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతున్న సందర్భంగా మౌలిక వసతుల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. పాఠశాలల్లో టాయిలెట్స్ క్లీనింగ్, ఇతర పనుల బాధ్యతలను రెండేండ్ల క్రితం అప్పటి ప్రభుత్వం జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీలు, పంచాయతీలకు అప్పగించింది. స్కూళ్లలో క్లీనింగ్ పనులు సరిగ్గా జరగడం లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో ఇచ్చిన హామీ మేరకు జూన్ 12న స్కూల్స్ ప్రారంభం రోజునే అన్ని పాఠశాలలకు స్కావెంజర్లను నియమించాలి.

పార్లమెంట్‌లో రైతుల గొంతుక

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



ఎంపీగా ఎన్నికైన ఏఐకేఎస్ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత ఉపాధ్యక్షుడు అమ్రారామ్ కు ఏఐకేఎస్ ఘనంగా సత్కరించింది. ఇండియా ఫోరం తరపున ఆయన రాజస్థాన్‌లోని సికార్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎం) అభ్యర్థిగా విజయం సాధించారు. ఆదివారం నాడిక్కడ ఏఐకేఎస్ కార్యాలయంలో అమ్రారామ్ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసి సభలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పుష్పగుచ్ఛం అందించి సత్కరించి అభినందించారు. అనంతరం సీతారాం ఏచూరి మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా రైతుల కోసం పోరాడుతున్నారని, అమ్రారామ్ ఇప్పుడు లోక్‌సభలో రైతులు, కూలీల కోసం పోరాడుతారని అన్నారు. సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్ మాట్లాడుతూ అమ్రారామ్ రైతుల మనిషి అని, రైతు పోరాటాలతో పెనవేసుకొని ఉన్నారని అన్నారు. ఏఐకేఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి, ఎస్కేఎం సీనియర్ నేత, మాజీ ఎంపీ హన్నన్ మొల్లా మాట్లాడుతూ రైతు ఉద్యమానికి ప్రతీకగా అమ్రారామ్ నిలిచారని, ఇప్పుడు పార్లమెంట్‌లో రైతుల గొంతుక ప్రతిధ్వనిస్తుందన్నారు. ఏఐకేఎస్ అధ్యక్షుడు అశోక్ ధావలే మాట్లాడుతూ రైతుల కోసం పోరాటం చేయడం అమ్రారామ్ నుంచి నేర్చుకున్నానని అన్నారు. ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల వేళ ఎక్కడ చూసినా ఒక్కటే గొంతు వినిపించేదని, మా ఎంపీ అమ్రారామ్ అని, ఆయనే సరైనోడని తెలిపారు. ఏఐకేఎస్ ఆర్థిక కార్యదర్శి పి.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ అమ్రారామ్ పార్లమెంట్‌లో అడుగుపెట్టడంతో రైతు ఉద్యమానికి మరింత ఊపు వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు ఎ.విజయరాఘవన్, తపన్ సేన్, ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం ధావలే, జేఎన్‌యూఎస్‌యూ మాజీ అధ్యక్షురాలు ఐషీఘోష్, ఢిల్లీ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (డీయూటీఏ) మాజీ అధ్యక్షుడు రాజీవ్ కన్వర్, డీఎస్ఎంఎం నేత నత్తు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం అందడంతో నారాయణ్‌పూర్, కొండగావ్, దంతేవాడ, బస్తర్ జిల్లాల సరిహద్దుల్లో ఈ నెల 6 అర్ధరాత్రి సమయంలో భద్రతా సిబ్బంది ప్రత్యేక బృందాలతో ఈ ఆపరేషన్ చేసినట్టు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌లాల్ తెలిపారు. ఇరు వర్గాల మధ్య అడపాదడపా జరిగిన క్రాస్ ఫైరింగ్‌లో ఆరుగురు మావోయిస్టులు మరణించారు. ఈ ప్రాంతంలో రక్తపు మరకలు ఉన్నాయని, మరో మావోయిస్టు గాయపడ్డాడో, మరణించాడో తెలియాల్సి ఉందన్నారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీకి చెందిన ఈ ఆరుగురిలో నలుగురిపై రూ.8 లక్షలు, ఒకరిపై రూ.5 లక్షలు, మరొకరిపై రూ.లక్ష రివార్డులు ఉన్నట్టు ఆయన తెలిపారు. ఈ ఏడాది ఆ ప్రాంతాల్లో 71 ఎన్‌కౌంటర్లలో 123 మంది మావోయిస్టులు చనిపోయారు. 136 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. 339 మంది లొంగిపోయారు.

నెలరోజులు... వరుస సమీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

భాగంగా ఆదివారం ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన మధిరలో సమీక్ష సమావేశం కూడా నిర్వహించారు. ఈనెల 12, 13 తేదీల్లో ఖమ్మం జిల్లాలో సమీక్షా సమావేశాలు జరపాలని నిర్ణయించారు. దీనికి కూడా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరవుతారని ఆయన కార్యాలయం ఆదివారం తెలిపింది. ఎలక్షన్ కోడ్ ముగియడంతో రేవంత్ సర్కార్ పాలనపై దృష్టి కేంద్రీకరించింది. రాష్ట్ర స్థాయిలో అన్ని శాఖల పనితీరుపై సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిస్థాయి సమీక్షలు చేయనున్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. ఏండ్ల తరబడి ఒకే పోస్ట్‌లో పాతుకుపోయిన అధికారుల బదిలీల ప్రక్రియను తొలి దశలో చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. ఈ మేరకు వచ్చే వారంలో అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ భారీగా బదిలీలు జరుగుతాయనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో జరుగుతుంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక అధికారుల పనితీరుపై ప్రతి నెలా నివేదికలు, సమీక్షలు చేయాలని కూడా సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఈనెల 9న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీ కార్యాచరణ ప్రారంభమైంది. ఈనెలాఖరు నాటికి ఈ ప్రక్రియ ముగియనుంది. మరోవైపు ఆరు గ్యారెంటీల అమలుపై ప్రధానంగా దృష్టి పెట్టి, దానికి అవసరమైన ఆర్థికాభివృద్ధిని రాబట్టుకోవాలని భావిస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంపు, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు గృహ విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లుల మంజూరును అమల్లోకి తెచ్చారు. స్వయం సహాయక బృందాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమం- అభివృద్ధి జోడెడ్ల బండి తరహాలో పాలనను ముందుకు తీసుకెళ్లాలని సీఎం, డిప్యూటీ సీఎం భావిస్తున్నారని ఆయా కార్యాలయాలు తెలిపాయి.

12 ,13న ఖమ్మంలో సమీక్ష

నీళ్లు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన గత పాలకులు ఖమ్మం జిల్లాలో ఇందిరా, రాజు సాగర్ ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యం చేశారనీ, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని డిప్యూటీ సీఎం కార్యాలయం తెలిపింది. ఈ నేపథ్యంలో ఈనెల 12న సీతారామ సాగునీటి ప్రాజెక్టు, వైరా రిజర్వాయర్‌కు సాగర్ కాల్వ అనుసంధానం, నాగార్జునసాగర్ ప్రాజెక్టు సాగునీటి సరఫరా అంశాలను సమీక్షించనున్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా వైరా రిజర్వాయర్‌కు సాగునీటిని మళ్లించేందుకు ఎన్నికల కోడ్‌కు ముందే రూ.75 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్టు డిప్యూటీ సీఎం కార్యాలయం తెలిపింది. 13న జరిగే సమీక్షలో సాగునీటి ప్రాజెక్టు పనులు, వాటి ప్రగతిని తెలుసుకుంటారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంయుక్తంగా ఆయా ప్రాజెక్టుల వద్దకు క్షేత్రస్థాయి పర్యటన చేపడతారని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు పరిధిలో దుమ్ముగూడెం నుంచి జూలూరుపాడు వరకు జరుగుతున్న పనులు, ఏనుకూరు నుంచి వైరా రిజర్వాయర్‌కు నాగార్జునసాగర్ ఎడమ కాలువను లింక్ చేయడం వంటి పనులను వారు పరిశీలిస్తారు. అలాగే మన ఊరు- మనబడి, వివిధ సంక్షేమ పథకాల అమలును సైతం పరిశీలిస్తారు.

ఇక సెలవ్...

(మొదటిపేజీ తరువాయి)

చేయించుకున్న స్మృతి కట్టడం వద్దే కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు పూర్తిచేశారు. రామోజీరావు చితికి ఆయన కుమారుడు, ఈనాడు ఎండీ సీహెచ్ కిరణ్ నిప్పంటించారు. సినీ, రాజకీయ ప్రముఖులు, బంధువులు, సన్నిహితులు, రామోజీ గ్రూపు సంస్థల సిబ్బంది, అభిమానుల 'జోహార్ రామోజీరావు' నినాదాల మధ్య అంత్యక్రియలు ముగిశాయి.

ఫిల్మ్‌సిటీలోని నివాసం నుంచి ఉదయం 11 గంటల ప్రాంతంలో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పోలీస్ బ్యాండ్ నడుమ రామోజీ అంతిమయాత్ర ప్రారంభమయింది. అక్కడ నుంచి రామోజీ గ్రూప్ సంస్థల కార్యాలయాల మీదుగా స్మారకకట్టడానికి చేరుకుంది. అభిమానుల నినాదాలతో ఫిల్మ్‌సిటీ మార్మోగింది. అంతిమయాత్ర స్మృతి కట్టడం వద్దకు చేరుకున్న తర్వాత ఆయన భౌతికకాయాన్ని కుటుంట సభ్యులు వాహనం నుంచి కిందకు దింపారు. కుటుంబ సంప్రదాయ క్రతువులు నిర్వహించిన అనంతరం చంద్రబాబు నాయుడు, లోకేశ్, తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, సీతక్క, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, పలువురు సినీ ప్రముఖులు రామోజీకి కడసారిగా నివాళులర్పించారు. చంద్రబాబు నాయుడు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అంత్యక్రియల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎంపీలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి, ప్రముఖ వైద్యులు గురవారెడ్డి, శాంతా బయోటెక్ వరప్రసాద్ రెడ్డి, సీనియర్ నాయకులు పోచారం శ్రీనివాసరెడ్డి, మండవ వెంకటేశ్వరరావు, మోత్కుపల్లి నర్సింహులు, నామా నాగేశ్వరరావు సినీ, రాజకీయప్రముఖులనేకులు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోళ్లలో రికార్డు

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. అందుకే ఈదురు గాలులు, అకాల వర్షాలకు కూడా రైతులు నష్టపోకుండా తగిన జాగ్రత్తలు చేపట్టింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు వెనుకాడలేదు. ధాన్యం సేకరణలో జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, మెదక్, నల్గొండ, నిజామాబాద్, పెద్దపల్లి, సిద్ధిపేట, సిరిసిల్ల, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, నిర్మల్, మంచిర్యాల, జనగామ జిల్లాలు ముందంజలో ఉన్నాయి.

కొలువుదీరిన క్యాబినెట్

(మొదటిపేజీ తరువాయి)



ఐదుగురు స్వతంత్ర హోదా కలిగిన సహాయ మంత్రులు. మిగిలిన 36 మంది సహాయ మంత్రులు.

వీరంతా ఔట్

గతంలో మోడీ క్యాబినెట్‌లో పనిచేసిన నారాయణ్ రాణే, అర్జున్ ముండా, అనురాగ్ ఠాకూర్, పురుషోత్తం రూపాలా, స్మృతి ఇరానీ, ఆర్కే సింగ్, మహేంద్ర నాథ్ పాండే, అశ్విని కుమార్ చౌబే, వీకే సింగ్, సాధ్వి నిరంజన్ జ్యోతి, సంజీవ్ బలియన్ రాజీవ్ చంద్రశేఖర్, దర్శన్ జర్దోష్, వి.మురళీ ధరన్, మీనాక్షి లేఖిలకు ప్రస్తుత క్యాబినెట్‌లో చోటు దక్కలేదు. వీరిలో కొందరు ఎన్నికల్లో ఓటమి పాలవగా మరికొందరు గెలుపొందినా మంత్రి పదవులు లభించలేదు.

హాజరైన ప్రముఖులు వీరే

మోడీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి పలువురు విదేశీ నేతలు హాజరయ్యారు. శ్రీలంక అధ్యక్షులు రణిల్ విక్రమసింఘే, మాల్దీవుల అధ్యక్షుడు డాక్టర్ మహమ్మద్ మొయిజు, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, మారిషస్ ప్రధాని ప్రవింద్ కుమార్ జగ్‌నాథ్, నేపాల్ ప్రధాని పుష్ప కుమార్ దహాల్ ప్రచండ, భూటాన్ ప్రధాని షెరింగ్ తొగ్బే తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధిపతి పవన్ కల్యాణ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జూన్ గుబులు..!

ఫీజులు పెంచిన ప్రయివేటు పాఠశాలలు

గతేడాది కంటే 20-40 శాతం అధికం | విద్యాహక్కు చట్టానికి యథేచ్ఛగా తూట్లు | చితికిపోతున్న మధ్య తరగతి కుటుంబాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మరో రెండు రోజుల్లో బడి గంట మోగనున్నాయి. మారిన సామాజిక పరిస్థితుల్లో అప్పు చేసైనా తమ పిల్లలను పేరున్న పాఠశాలలో చదివించాలని తల్లిదండ్రులు తపనపడుతుంటారు. దీన్ని ఆసరా చేసుకుంటున్న కొన్ని ప్రయివేటు స్కూల్స్ కొత్త ప్రవేశాలు, డొనేషన్లు, నెలవారీ ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్, షూస్, బ్యాగులు, రవాణా చార్జీల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల జేబుకు చిల్లు పెడుతున్నారు. జూన్ వచ్చిందంటే చాలు అనేక ఖర్చులు తలకు మించిన భారంగా మారుతున్నాయి. ఈ భారాలతో మధ్య తరగతి కుటుంబాలు చితికిపోతున్నాయి.

కొత్త పేర్లు.. కొత్త స్కూళ్లు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇంటర్నేషనల్, టెక్నో, ఈ-టెక్నో, ఒలంపియాడ్, భూం భూం, విజన్ కేతనం, టాలెంట్ అంటూ చివరన పేర్లు పెట్టి ఎక్కువ ఫీజులు వసూలు చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ఫీజులతో పాటు పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్, బ్యాగ్స్ సైతం విక్రయిస్తున్నారు. మరికొన్ని పాఠశాలలకు అనుబంధంగా బుక్ స్టాల్స్ ఏర్పాటు చేసి, అక్కడే బుక్స్ కొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. యూనిఫామ్‌లు, క్యారేజ్ బ్యాగ్, షూస్ వంటివి కూడా పాఠశాల వాళ్లు చెప్పిన దగ్గరే కొనుగోలు చేయాలని నిబంధనలు పెడుతున్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా పుస్తకాలను విక్రయించొచ్చని డీఈవో ఉత్తర్వులు ఇచ్చారు. దీన్ని ఆసరాగా చేసుకున్న కొన్ని స్కూల్స్ యథేచ్ఛగా పాఠశాలలోనే పుస్తకాల విక్రయానికి తెరలేపాయి. ఇక స్కూల్ బస్సు రవాణాకు ఫీజు అదనం.

రకరకాల ఫీజులు..

ప్రయివేటు పాఠశాలల్లో రకరకాల పేర్లతో ఫీజులు వసూలు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.5 వేల నుంచి రూ.10వేలు, అడ్మిషన్ ఫీజు రూ.5వేల నుంచి రూ.10వేలు, నర్సరీకి బుక్స్, స్టూడెంట్ కిట్ రూ.15 వేల నుంచి రూ.20వేలు వసూలు చేస్తున్నారు. ఓ సాధారణ ప్రయివేటు స్కూల్‌లో రెండు జతల బట్టలకు రూ.8 వేల నుంచి రూ.10వేలు, స్పోర్ట్స్ డ్రెస్ రూ.2 వేల నుంచి రూ.5 వేలు, టై, బెల్ట్, బ్యాడ్జీ కలిపి రూ.5వేలు, రెండు జతల షూస్ కలిపి రూ.1500 వరకు చెల్లించాల్సి వస్తుంది. అంతేకాదు, డీజిల్ ధరలు, బస్సుల మెయింటెనెన్స్‌కు ఖర్చులు పెరిగాయంటూ అదనంగా కిలోమీటర్లను బట్టి వసూలు చేస్తున్నారు. 5 కి.మీ పరిధిలో రూ.10 వేల నుంచి రూ.25 వేలు, 5 నుంచి 10 కి.మీ.లకు రూ.30వేలు, 10 కి.మీ కంటే ఎక్కువైతే రూ.40 వేలు వసూలు చేస్తున్నారు. పిల్లల ఫీజులకు తోడు రవాణా ఛార్జీల భారంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఒకేసారి ఫీజు మొత్తం చెల్లిస్తే 10 శాతం రాయితీ ఇస్తామని ఆఫర్లు ఇస్తున్నారు. ఇప్పటికైనా సర్కార్ స్పందించి ఈ ఫీజు దోపిడీని అరికట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

20-40శాతం ఫీజు పెంపు

ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఏటా ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతున్నాయి. గతేడాది కంటే ఈసారి 20-40 శాతం ఫీజులు పెంచి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. ఎన్ని కష్టాలెదురైనా సరే.. తమ పిల్లలను బాగా చదివించాలనే తల్లిదండ్రుల బలహీనతను ఆసరాగా చేసుకుని ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు సొమ్ము చేసుకుంటూ, జలగల్లా పీల్చిపిప్పి చేస్తున్నాయి. పిల్లలకు ఉత్తమ విద్యనందించాలనే ఆశ ఒక వైపు, అధిక ఫీజులతో మోయలేని భారం మరో వైపుతో తల్లిదండ్రులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దీనికి తోడు ఇంటర్నేషనల్ స్కూల్స్‌లో ఫీజులు హడలెత్తిస్తున్నాయి.

ఫీజుల నియంత్రణ కరువు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్లే స్కూల్స్ 100, యూపీఎస్ స్కూల్స్ 550, హై స్కూల్స్ వెయ్యి వరకు ఉన్నాయి. ఇలా మొత్తం కలిపి 1600 వరకు ప్రయివేటు స్కూల్స్ ఉన్నాయి. వీటిల్లో ఫీజుల నియంత్రణ కొరవడింది. ప్రయివేటు, కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూల్స్‌లో ఫీజులను నియంత్రించడానికి 2017లో ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ తిరుపతిరావు అధ్యక్షతన అప్పటి ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. ఏటా ఫీజులను ఎంత పెంచాలనే దానిపై ఈ కమిటీ నివేదికను సమర్పించింది. ఆ నివేదికను ఇప్పటివరకు బహిర్గతం చేయకపోవడంతో ప్రయివేటు స్కూల్స్ ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న చందంగా మారింది. ప్రభుత్వం ఎన్ని జీవోలు, నిబంధనలు తీసుకొచ్చినా ప్రయోజనం లేకుండా పోతోంది. ఫీజులపై స్పష్టత లేకపోవడంతో ప్రయివేటు స్కూల్స్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వం సరైన మార్గదర్శకాలు ఇవ్వకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నేతలు మండిపడుతున్నారు.

సర్కార్ వెంటనే స్పందించాలి



ప్రయివేటు, కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూళ్లలో ఫీజుల వసూలుపై సర్కార్‌పై వెంటనే స్పందించాలి. సీబీఎస్ఈ, ఐసీఎస్సీ లాంటి పేర్లతో స్కూల్స్ పెట్టి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లల తల్లిదండ్రులను పీల్చి పిప్పి చేస్తున్నారు. ప్రతీ ఏడాది 40శాతం ఫీజులు పెంచడం సరికాదు. వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి. విద్యాశాఖా మంత్రి లేకపోవడంతో స్కూళ్లపై పర్యవేక్షణ కొరవడింది. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు నిబంధనలు అతిక్రమిస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి.

- రాథోడ్ సంతోష్, ఎస్ఎఫ్ఐ
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి

రాజకీయాలకు పాండియన్ గుడ్‌బై



భువనేశ్వర్: ఒడిషా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ సన్నిహితులు, మాజీ ఐఏఎస్ అధికారి వికె పాండియన్ రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. ఇటీవల జరిగిన ఒడిషా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బిజూ జనతాదళ్ (బీడేడీ) ఓటమి నేపథ్యంలో పాండియన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. రాజకీయాల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. ఆదివారం ఈ మేరకు వీడియో సందేశం విడుదల చేశారు. తాను నవీన్ పట్నాయక్‌కు సహాయకారిగా ఉండాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చానని, ఇప్పుడు రాజకీయాల నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. తన ప్రయాణంలో ఎవర్నైనా నొప్పించి ఉంటే క్షమించాలని కోరారు. అలాగే, తనపై జరిగిన ప్రచారం వల్ల పార్టీ ఓటమి పాలై ఉంటే అందుకూ క్షమించాలన్నారు. నవీన్ మరోసారి విజయం సాధించని పక్షంలో తాను రాజకీయ సన్యాసం స్వీకరిస్తానని గతంలో చెప్పిన పాండియన్ అందుకు తగ్గట్టే తన నిర్ణయాన్ని వెలువరించారు.

తమిళనాడుకు చెందిన పాండియన్ ఒడిషా కేడర్ ఐఏఎస్ అధికారిగా ఈ రాష్ట్రంలో విధుల్లో చేరారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు సన్నిహితుగా మారారు. ఎన్నికల ముందు ఉద్యోగానికి రాజీనామా చేసి బీడేడీలో చేరారు. నవీన్ పట్నాయక్ నిర్ణయాలను పాండియన్ తీసుకుంటున్నారని ఎన్నికల ప్రచారంలో బీజేపీ విమర్శలు చేసింది.

ఒకే సమయంలో రన్‌వే రెండు విమానాలు

ముంబయిలో తప్పిన ప్రమాదం

ఎటిసిఒపై వేటు



ముంబయి : ముంబయిలో ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం తెల్లవారుజామున పెను ప్రమాదం తప్పింది. రన్‌వేపై ఎయిర్ ఇండియా 657 విమానం ఇంకా టేకాఫ్ ప్రక్రియలో ఉండగానే ఇండిగో 5053 అదే రన్‌వే దిగింది. రెండింటికి మధ్య కొన్ని వందల మీటర్ల దూరమే ఉంది. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రెండు విమానాలు ఒకే రన్‌వేపై ప్రయాణించడం.. ఇండోర్ నుంచి వచ్చిన ఇండిగో విమానం ల్యాండ్ అవుతుండగా.. అదే సమయంలో ఎయిర్ ఇండియా విమానం తిరువనంతపురం వెళ్లేందుకు గాల్లోకి ఎగిరడం వీడియోల్లో స్పష్టంగా ఉంది. ఈ ఘటనపై తక్షణమే స్పందించిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) విమానాశ్రయానికి చెందిన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ఆఫీసర్ (ఎటిసిఒ)ను విధులను నుంచి తప్పించింది. ఈ ఘటనకు దారి తీసిన పరిస్థితులను అర్థం చేసుకోవడానికి, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడానికి దర్యాప్తు జరుగుతోంది. ఈ ఘటనపై ఇండిగో స్పందించింది. తమ పైలట్ ముంబయి ఎయిర్ పోర్టు ఏటీసీ సూచనలను తూచా తప్పకుండా పాటించాడని పేర్కొంది. "జూన్ 8వ తేదీన ఇండిగో 6ఈ6053 విమానానికి ఏటీసీ నుంచి ల్యాండింగ్ క్లియరెన్స్ లభించింది. మాకు ప్రయాణికుల సురక్షితే ముఖ్యం. ప్రొసిజర్ ప్రకారం ఈ ఘటనపై మేం రిపోర్టు చేశాం" అని ఒక ప్రకటనలో వెల్లడించింది.

బంగ్లాదేశ్ ఎంపీ హత్య కేసు

కీలక నిందితుడి అరెస్టు



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో హత్యకు గురైన బంగ్లాదేశ్ ఎంపీ అన్వరుల్ అజీమ్ అనర్ కేసులో కీలక నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. నేపాల్‌లో అక్కడి పోలీసులు నిందితుడ్ని అరెస్టు చేయగా, భారత్‌కు తీసుకువచ్చారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు గాలింపు చేపట్టిగా.. దక్షిణ 24 పరగణాల జిల్లాలో ఒక కాలువలో ఎంపికి చెందిన కొన్ని శరీర భాగాలను గుర్తించారు. ఈ వివరాలను పశ్చిమ బెంగాల్ పోలీసులు ఆదివారం వెల్లడించారు. "వైద్యులు, ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో గాలింపు జరపగా.. ఒక కాలువలో మనిషికి సంబంధించిన శరీర భాగాలు, ఎముకలు లభ్యమయ్యాయి. వీటిని ఎంపికి చెందినిగానే అనుమానిస్తున్నాం. వాటిని ఫోరెన్సిక్ పరీక్ష కోసం పంపిస్తాం. ఇతర శరీర భాగాల కోసం గాలింపు కొనసాగుతుంది" అని పోలీసులు వెల్లడించారు. అంతకుముందు ఎంపి శరీరానికి సంబంధించినగా భావిస్తోన్న దాదాపు మూడున్నర కిలోల మాంసపు ముద్దను హత్య జరిగిన అపార్టుమెంటు సెప్టిక్ ట్యాంకులోనే గుర్తించారు.

ఎంపిని హత్య చేసిన అనంతరం అతడి శరీర భాగాలను ముక్కలుగా చేసి పడేసినట్లు పోలీసులు అనుమానిస్తున్న విషయం తెలిసిందే. అయితే, వీటిలో కొన్ని ఇప్పటికే లభ్యం చేసుకున్నప్పటికీ.. అవి నిర్ధరించుకోవడం కష్టంగా మారింది. దీంతో డిఎన్ఎ పరీక్ష నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకోసం మరణించిన ఎంపి కుమార్తె బంగ్లాదేశ్ నుంచి కోల్‌కతాకు రానున్నారు.



శ్రీకమల్, తాన్వీ ఆకాంక్ష

ఆకాశానికే జాబిలి అందం..

దర్శకుడు కె.విజయ్‌భాస్కర్ మళ్లీ ఓ సరికొత్త ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రానికి శ్రీకారం చుట్టారు. 'నువ్వేకావాలి, మన్మథుడు, మల్లీశ్వరి' వంటి క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాలను తెరకెక్కించిన ఆయన స్వీయ దర్శకత్వంలో 'ఉషా పరిణయం' అనే అందమైన టైటిల్‌తో ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ చిత్రానికి లవ్ ఈజ్ బ్యూటీఫుల్ అనేది ఉపశీర్షిక. విజయ్‌భాస్కర్ క్రాఫ్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విజయ్‌భాస్కర్ తనయుడు శ్రీకమల్ హీరోగా నటిస్తుండగా, తాన్వీ ఆకాంక్ష హీరోయిన్‌గా పరిచయం కాబోతుంది.

చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర పనులను జరుపుకుంటోంది. ఇటీవల ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. తాజాగా ఈ చిత్రం నుంచి 'ఆకాశానికే జాబిలి అందం.. భూగోళానికే నా చెలి అందం..' అంటూ సాగే ఓ ప్రేమగీతాన్ని తొలి లిరికల్ సాంగ్‌గా విడుదల చేశారు.

ఆర్.ఆర్. ధ్రువన్ సంగీత సారథ్యంలో రూపొందిన ఈ పాటకు అలరాజు సాహిత్యం అందించారు. ఆర్.ఆర్.ధ్రువన్ ఈ ప్రేమగీతాన్ని ఆలపించారు.

ఈ సందర్భంగా దర్శక, నిర్మాత విజయ్ భాస్కర్ మాట్లాడుతూ, 'ఇటీవల విడుదలైన టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. ప్రేమకథలో సరికొత్తగా ఉండే విధంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ చిత్రం ప్రేమకు నేనిచ్చే డెఫినేషన్. ఇదొక మంచి లవ్‌స్టోరీ. సినిమా లవర్స్‌కు విందుభోజనంలా ఉంటుంది. అన్ని ఎమోషన్స్ ఈ చిత్రంలో ఉన్నాయి. ఈ సినిమా సంగీతంలో ధ్రువన్ విశ్వరూపం చూస్తారు' అని అన్నారు.

సూర్య, రవి, శివతేజ, అలీ, వెన్నెలకిషోర్, శివాజీ రాజా, ఆమని, సుధ, ఆనంద్ చక్రపాణి, రజిత, బాలక్రిష్ణ, సూర్య, మధుమణి తదితరులు ఈ చిత్రంలో ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

నవచిత్రం

నేటి వివాహ బంధాలకు ప్రతిబింబం



చైతన్య రావ్, హెబ్బా పటేల్ జంటగా నటిస్తున్న సినిమా 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. ఈ చిత్రాన్ని న్యూ రీల్ ఇండియా బ్యానర్ పై కేకేఆర్, బాలరాజ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాని ప్రయోగాత్మకంగా ఫ్యూచరిస్టిక్ రొమాంటిక్ కామెడీగా దర్శకుడు బాల రాజశేఖరుని రూపొందించారు. ఈ సినిమా ఈ నెల21న వరల్డ్ వైడ్‌గా థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర టీజర్‌ను అమల అక్కినేని విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'యాక్టింగ్, స్క్రీన్ ప్లే రైటింగ్‌లో ప్రొఫెసర్‌గా బాల అమెరికాలో చాలా కాలం పనిచేశారు. తెలుగు సినిమాకు దర్శకత్వం వహించాలనే ఆయన కల ఈ సినిమాతో నెరవేరినందుకు సంతోషంగా ఉంది. మా అన్నపూర్ణ కాలేజ్ ఫ్యాకల్టీలు, స్టాఫ్, స్టూడెంట్స్‌ను బాల ఈ మూవీ టీమ్‌లోకి తీసుకున్నారు. టీజర్ ఫన్నీగా, రొమాంటిక్‌గా ఉంది. ఈ రోజు సమాజంలోని రొమాంటిక్, వివాహ బంధాలను గురించి ఒక బలమైన కథను చూపించబోతున్నట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. నేటి పరిస్థితులకు అద్దం పట్టేలా ఉండే సబ్జెక్ట్ ఇది. ప్రేక్షకులు ఈ సినిమాని ఆదరించి, విజయాన్ని అందిస్తారని కోరుకుంటున్నాను' అని తెలిపారు.

'మా మూవీ నుంచి టీ సిరీస్ మ్యూజిక్ ద్వారా రిలీజ్ చేసిన నాలుగు సాంగ్స్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. కల్యాణి మాలిక్ వీటిని కంపోజ్ చేశారు. స్వార్తి జితేందర్ టైటిల్ సాంగ్‌కు మ్యూజిక్ చేశారు. మంచి రొమాంటిక్ కామెడీ మూవీగా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే చిత్రమిది' అని దర్శకుడు బాల రాజశేఖరుని చెప్పారు.



ఒగ్గు కథ ప్రధాన ఆకర్షణగా యేవమ్

పాశ్చాత్య పోకడలో తెలుగుదనం ఉన్న సినిమాలు, తెలుగు వారి సంప్రదాయాలు చూపించే సినిమాలు చాలా అరుదుగా వస్తున్నాయి. సహజత్వంతో కూడిన ఈ అంశాలను హైలైట్ చేస్తూ చూపించే సినిమాలను తెలుగు ప్రేక్షకులు కూడా ఆదరిస్తున్నారు. తాజాగా 'యేవమ్' చిత్రంలో తెలంగాణ ఒగ్గు కథ కల్చర్‌ని హైలైట్ చేస్తూ, తెలంగాణ సంస్కృతిలోని ముఖ్యమైన అంశమైన ఒగ్గుకథను ఈ చిత్రంలో చూపించారు చిత్ర దర్శకుడు ప్రకాష్ దంతులూరి. ఈ చిత్రంలో ఓ కీలకమైన సన్నివేశం వచ్చేటప్పుడు ఆ సన్నివేశంలోని గాఢతను తెలంగాణ ఒగ్గుకథతో చెబుతున్నారు. హిందూ సంప్రదాయంలోని గ్రామ దైవాల గొప్పతనాన్ని ఒగ్గుకథలో కూడా ఈ చిత్రంలో చూపించారు. ఈ ఒగ్గు కథను కూడా రియల్‌గా ఒగ్గు కథలను పాడే కళాకారులతోనే చెప్పించడం విశేషం.

దర్శకుడు మాట్లాడుతూ,'ఈ ఒగ్గుకథతో కథలోని గాఢతను, సన్నివేశంలోని సారాంశంను చెప్పించడంతో ప్రేక్షకులు కథలో ఇన్‌వాల్వ్ అవ్వడమే కాకుండా వారికి కొత్త అనుభూతిని కలిగిస్తుంది. ఇటీవల విడుదలైన ఈ చిత్ర ట్రైలర్‌కు మంచి స్పందన వస్తుంది. ఈ నెల 14న విడుదల కాబోతున్న ఈ చిత్రం అందని అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

చాందిని చౌదరి, దిని చైదరి, వశిష్ట సింహా, భరత్‌రాజ్, ఆషు రెడ్డి నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు: నవదీప్, పవన్ గోపరాజు, కెమెరా: ఎస్వీ విశ్వేశ్వర్, సంగీతం: కీర్తన శేషు, నీలేష్ మందలపు, ఎడిటర్ : సుజనా అడుసుమిల్లి.

ఎదురులేని ఆసీస్

ఇంగ్లాండ్‌పై 36 పరుగులతో గెలుపు

ఆస్ట్రేలియా 201/7, ఇంగ్లాండ్ 165/6



నవతెలంగాణ-బ్రిడ్జ్‌టౌన్

డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లాండ్ చతికిల పడింది. 202 పరుగుల ఛేదనలో మిడిల్ ఆర్డర్ వైఫల్యంతో పరాజయం మూటగట్టుకుంది. స్కాట్లాండ్‌తో మ్యాచ్ వర్షార్పణం, ఆసీస్ చేతిలో ఓటమితో డిఫెండింగ్ చాంపియన్ గ్రూప్ దశ నుంచి నిష్క్రమించే ప్రమాదంలో పడింది. ఫిల్ సాల్ట్ (37, 23 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు), జోశ్ బట్లర్ (42, 28 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సులు) ఛేదనలో అదిరే ఆరంభం అందించారు. తొలి వికెట్‌కు 7.1 ఓవర్లలోనే 73 పరుగులు జోడించారు. కానీ ఓపెనర్లు ఇద్దరూ జంపా మాయలో పడటంతో ఇంగ్లాండ్‌కు కష్టాలు మొదలయ్యాయి. విల్ జాక్స్ (10), జానీ బెయిర్‌స్టో (7) విఫలమయ్యారు. మోయిన్ అలీ (25), హ్యారీ బ్రూక్ (20 నాటౌట్), లివింగ్‌స్టోన్ (15) అంచనాలను అందుకోలేదు. 20 ఓవర్లలో 6 వికెట్లకు 165 పరుగులే చేసిన ఇంగ్లాండ్ 36 పరుగుల తేడాతో భారీ ఓటమి చవిచూసింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 7 వికెట్లకు 201 పరుగులు చేసింది. ట్రావిశ్ హెడ్ (34, 18 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సులు), డెవిడ్ వార్నర్ (39, 16 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సులు), మిచెల్ మార్ష్ (35, 25 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు), మార్కస్ స్టోయినిస్ (30, 17 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు) సహా గ్లెన్ మాక్స్‌వెల్ (28, 25 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఆసీస్ స్పిన్నర్ జంపా (2/28) 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. రెండు మ్యాచుల్లో రెండు విజయాలతో గ్రూప్-బిలో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో కొనసాగుతుంది.

ఉగాండా ఢమాల్

39 పరుగులకే ఆలౌట్ | కరీబియన్ల ఏకపక్ష విజయం

నవతెలంగాణ-ప్రావిడెన్స్

తొలిసారి ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో పోటీపడుతున్న పసికూన ఉగాండాపై వెస్టిండీస్ పంజా విసిరింది. కరీబియన్ పేసర్ అకీల్ హొస్సేన్ (5/11) ఐదు వికెట్ల విజృంభణతో ఉగాండా ఉలిక్కిపడింది. 12 ఓవర్లలో 39 పరుగులకే కుప్పకూలింది. అల్జారీ జొసెఫ్ (2/6) సైతం మెరవటంతో ఉగాండా టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే అత్యల్ప స్కోరుకు ఆలౌటైంది. 174 పరుగుల భారీ ఛేదనలో ఉగాండా బ్యాటర్లు విలవిల్లాడారు. కరీబియన్ భీకర పేస్ ముందు తేలిపోయారు. టెయిలెండర్ జుమా (13 నాటౌట్) ఒక్కడే ఉగాండా ఇన్నింగ్స్‌లో రెండెంకల స్కోరు సాధించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 173 పరుగులు చేసింది. జాన్సన్ చార్లెస్ (44, 42 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు), ఆండ్రీ రసెల్ (30 నాటౌట్, 17 బంతుల్లో 6 ఫోర్లు) సహా నికోలస్ పూరన్ (22), రోవ్‌మాన్ పావెల్ (23), రూథర్‌ఫోర్డ్ (22) రాణించారు. గ్రూప్-సిలో రెండు విజయాలు సాధించిన వెస్టిండీస్.. అఫ్గనిస్థాన్‌తో సమానంగా 4 పాయింట్లు గెల్చుకుంది. మెరుగైన నెట్‌రన్‌రేట్‌తో అఫ్గాన్ గ్రూప్‌లో అగ్రస్థానంలో ఉండగా, విండీస్ రెండో స్థానంలో కొనసాగుతుంది. ఇదే గ్రూప్‌లో న్యూజిలాండ్ అట్టడుగు స్థానంలో ఉంది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886